శుక్రవారం 2-12-2022

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 251



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



CMR JEWELLERY

For your golden moments !

ఇప్పుడు మన విజయవాడ లో

GRAND OPENING DEC 8

సరి కొత్త బంగారు బంధం

చైన్లు	గాజులు	హారాలు	నెక్లెస్	నల్లపూసలు	ఇయర్ రింగ్స్	రింగ్స్
3% నుండి V.A.	4% నుండి V.A.	7% నుండి V.A.	7% నుండి V.A.	9% నుండి V.A.	9% నుండి V.A.	9% నుండి V.A.

ఎం.జి.రోడ్, విజయవాడ | +91 9133387115

నేటి సులభ కొనుగోలు ప్రణాళిక
రేపటి బంగారు ఆభరణములు కొనుగోలుకు మలుపు ...

కనకధారా

మీ సురక్షితమైన భవిష్యత్తు కోసం

	తీసుకోబోయే నగలు	వేల్యూ ఆడిషన్ (తరుగు)	తయారీ చార్జీలు	జాతిరాళ్లపై	యం.ఆర్.పి ధర పై
1	91. 6 హాల్ మార్క్ బంగారు ఆభరణాలపై	100% లేదు	100% లేదు		
2	వెండి(రెగ్యులర్) ఆర్టికల్స్ పై	100% లేదు	100% లేదు		
3	వెండి వస్తువుల (యాంటిక్)పై	50% తగ్గింపు	50% తగ్గింపు		
4	వెండి నగలు (యం.ఆర్.పి) పై				20% తగ్గింపు
5	జాతి రాళ్ల ఆభరణాల పై	100% లేదు	100% లేదు	10% తగ్గింపు	

GOLD JEWELLERY PURCHASE ON ORDER

బంగారు ఆభరణాల పై 100%* తరుగు లేదు

జాతిరాళ్ళ ఆభరణాలలో రాళ్ళ పై 10%* తగ్గింపు


మొదటి నెల ముందస్తు చెల్లింపు పై ఆకర్షణీయమైన బహుమతి కలదు OR 10% గిఫ్ట్ వోచర్ లభించును

తరుగు మజూరి లేదు సిల్వర్ రెగ్యులర్ ఆర్టికల్స్ పై

*T&C Apply

www.cmrjewellery.com | CMRJewelleryIndia | CMRJewellery | THE MOST TRUSTED JEWELLER SINCE 4 DECADES

Visakhapatnam | Gajuwaka | Gopalapatnam | Vizianagaram | Srikakulam | Narsipatnam | Kakinada | Amalapuram | Bhimavaram | Rajahmahendravaram | Eluru | Ongole | Tirupati | Kothagudem | Khammam


‘ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 251

శుక్రవారం 2-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఒక్కరోజే 506 పరుగులు

పాక్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు వరల్డ్ రికార్డు -13లో



రికార్డుల పరంపర

ఎనిమిదో రోజూ అదే జోరు.. తాజా గరిష్టాలకు సెన్సెక్స్, నిఫ్టీ -13లో



నిర్ణయాత్మకంగా జీ-20 అజెండా

ప్రపంచంలో శక్తివంతమైన జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. ఏడాది పాటు ఈ బాధ్యతలను నిర్వర్తించనుంది.


వివరాలు 6లో



గుజరాత్‌లో 60% ఓటింగ్!

గుజరాత్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికల్లో గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి 60.23% పోలింగ్ నమోదైంది.

వివరాలు 6లో



సుప్రీంలో మహిళా ధర్మాసనం

సుప్రీంకోర్టులో గురువారం ఏర్పాటైన జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం 32 కేసులు విచారించింది.

వివరాలు 6లో



ఐసిస్ చీఫ్ హతం

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ (ఐసిస్) చీఫ్ అబూ అల్ హసన్ అల్ హషిమి అల్ ఖురేషి హతమయ్యారు.

వివరాలు 6లో

త్వరలో పూర్తిస్థాయిలో ‘ఫ్యామిలీ డాక్టర్’!

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ పూర్తయ్యేకొద్దీ మరింతగా అందుబాటులోకి

నిర్మాణాలు వేగవంతం.. ఉగాది కల్లా పూర్తి చేసేలా ప్రణాళిక

వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం

- పర్యవేక్షణకు సమర్థ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి
- కాన్సెప్ట్ అమలులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ భాగస్వామ్యం
- రక్తహీనతతో బాధపడే చిన్నారులు, గర్భిణులకు మేలు
- ఆరోగ్యశ్రీ సాఫ్ట్‌వేర్ మరింత మెరుగుపరచాలి
- వైద్య ఆరోగ్యశాఖ అమలు చేసే కార్యక్రమాలన్నీ యాప్‌లో ఉండాలి
- ఆరోగ్యశ్రీ చికిత్స అందించే నెట్‌వర్క్ ఆసుపత్రి వివరాలు లొకేషన్‌తో సహా వెల్లడించాలి
- ఆరోగ్య రంగంలో ఎలాంటి ఫిర్యాదునైనా 104 ద్వారా స్వీకరించాలి



సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) పూర్తి స్థాయిలో అమలుకు సన్నద్ధం కావాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. డాక్టర్లే స్వయంగా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న నేపథ్యంలో అదనంగా అవసరమయ్యే 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) వాహనాలను త్వరగా సమకూర్చుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఎఫ్‌పీసీపై పర్యవేక్షణకు సమర్థ యంత్రాంగం ఉండాలని, రాష్ట్రం, అసెంబ్లీ, మండలాల వారీగా వివిధ స్థాయిల్లో పర్యవేక్షణకు అధికారులను నియమించాలని సూచించారు. వైద్య శాఖలో

మిగతా 2వ పేజీలో ▶

వారిని పరామర్శించండి..

గ్రామ సందర్శనలో భాగంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స జరిగిన వారిని, దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర జబ్బులతో మంచానికే పరిమితమైన వ్యక్తులను ఫ్యామిలీ డాక్టర్ కలుసుకుని పరామర్శించాలి. ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్యంపై వాకబు చేయాలి. అవసరమైన వైద్య సేవలు, మందులు అందించాలి. వైద్య ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలి. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్ స్థాయి వరకు ట్యాబ్‌లు/సెల్ ఫోన్లు అందించాలి. వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి అమలు చేస్తున్న ఎఫ్‌పీసీ, ఆరోగ్యశ్రీ సహా వివిధ కార్యక్రమాల యాప్‌లన్నీ వీటిలో పొందుపరచాలి. ఫ్యామిలీ డాక్టర్ సంబంధిత గ్రామానికి వెళ్లి అందిస్తున్న వైద్య సేవల రియల్ టైమ్ డేటాను రికార్డు చేయాలి. దీనివల్ల సిబ్బంది, వివిధ విభాగాలు తీసుకునే చర్యల మధ్య సమన్వయం చక్కగా కుదురుతుంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందచేసి క్రమం తప్పకుండా మందులు ఇవ్వడమే కాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో కూడా సూచనలివ్వాలి.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏది నిజం?

‘సున్నా వడ్డీ’లోనూ వక్రమార్కుడు

- ఏటా క్రమం తప్పకుండా రైతుల ఖాతాలకు సున్నా వడ్డీ రాయితీ
- టీడీపీ ఐదేళ్లలో 40.61 లక్షల మందికి రూ.685.46 కోట్లే చెల్లింపు
- వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్లలో 73.88 లక్షల మంది వాస్తవ సాగుదారులకు రూ.1,838.61 కోట్లు చెల్లింపు
- ఇందులో 39.08 లక్షల మందికి ఎగ్గొట్టిన చంద్రబాబు
- పైగా.. నాడు వడ్డీ క్లెయిమ్‌లు బ్యాంకు ఖాతాలకు చెల్లించే వారు
- అదే ఇప్పుడు వడ్డీ రాయితీ మొత్తం నేరుగా రైతుల ఖాతాల్లో జమ
- అప్పట్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించడం, ఎవరికి ఎంత జమైందో తెలిసేదే కాదు
- నేడు సామాజిక తనిఖీ కోసం పారదర్శకంగా ఆర్బీకేల్లో అర్హుల జాబితాలు.. అర్హత ఉండి రాయితీ పడని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే చాన్స్
- నాటికీ నేటికీ ఇంత తేడా ఉన్నా రామోజీ విషపు రాతలు

వివరాలు 4లో ▸

కొత్త సిలబస్‌తో జేఈఈ అడ్వాన్స్‌డ్

- వచ్చే ఏడాది(2023) అడ్వాన్స్‌డ్ పరీక్ష కొత్త సిలబస్‌తోనే
- జేఈఈ మెయిన్‌తో అనుసంధానిస్తూ సిలబస్ మార్పు
- సీబీఎస్‌ఈ సిలబస్‌కు ప్రాధాన్యం
- గణితం, భౌతిక శాస్త్రం, కెమిస్ట్రీలో మార్పులు.. సీబీఎస్‌ఈ విద్యార్థులకు కొంత సులువు
- ఇంటర్ విద్యార్థులకు ఒకింత కష్టం
- మెయిన్ అంశాలను మరింత లోతుగా చదివేలా సిలబస్
- సిలబస్ పెరిగినట్లున్నా, పరీక్ష సులువుగానే ఉంటుందని భావన
- కోచింగ్ తీసుకోని విద్యార్థులు కూడా విజయం సాధించడమే మార్పు ఉద్దేశం




3లో

విశాఖలో విస్తరించిన ఐటీ అనుబంధ దిగ్గజం

3,300 మందితో కార్యకలాపాలు ప్రారంభించిన ప్రపంచస్థాయి బీపీఎం సంస్థ డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్

- షిప్పింగ్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలందించనున్న సంస్థ
- క్లౌడ్, డేటా అనలిటిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్‌లోనూ దిట్ట
- త్వరలో మరో 200 ఉద్యోగ నియామకాలు
- ఏపీ ప్రభుత్వ మద్దతువల్లే విస్తరణ సాధ్యమైందంటున్న సంస్థ



- వివరాలు 2లో ▸

జైల్లో పెడతమంటే పెట్టుకోండి!

- ఏమైతది? భయపడేదేముంది?
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు
- బీఆర్‌ఎస్ స్థాపనను జీర్ణించుకోలేకే చౌకబారు రాజకీయాలు
- ఎన్ని చేసినా తెలంగాణలో బీజేపీ గెలుపు సాధ్యం కాదు

10లో

4న రాష్ట్రపతికి పౌర సన్మానం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం 4వ తేదీన విజయవాడలో పౌర సన్మానం చేయనుంది. పోరంకి–నిడమానూరు రోడ్డులోని మురళీ రిసార్ట్స్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ప్రజల తరఫున సీఎం వైఎస్ జగన్.. రాష్ట్రపతిని సన్మానిస్తారు.

- వివరాలు 2లో ▸

‘జయహో బీసీ’ మహాసభతో మరింత భరోసా



బీసీ మహాసభ పోస్టర్లతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

- 7న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహణ
- మంత్రులు బొత్స, చెల్లుబోయిన, కారుమూరి, జోగి రమేష్
- ‘వెనుకబడిన కులాలే వెన్నెముక’ నినాదంతో మరింత ముందుకు
- మహాసభలో పాల్గొననున్న బీసీల ఆత్మబంధువు సీఎం వైఎస్ జగన్
- 84 వేల మంది ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: వెనుకబడిన వర్గాల ప్రజలకు మరింత భరోసా ఇవ్వడానికే ఈనెల 7న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ‘జయహో బీసీ’ పేరుతో మహాసభను నిర్వహిస్తున్నామని విద్య, బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రులు బొత్స సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్ చెప్పారు. విజయవాడలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, సత్యవతి, భరత్..

మిగతా 3వ పేజీలో ▶

ఆంధ్ర యూనివర్సిటీ అరుదైన ఘనత

- ‘శోధ్‌గంగ’లో 9వ స్థానం
- తొమ్మిది నెలల్లో 7,635 థీసిస్‌ల అప్‌లోడ్
- ఆన్‌లైన్‌లో అందుబాటులోకి పురాతన పరిశోధన గ్రంథాలు
- త్వరలో మరిన్ని థీసిస్‌ల అప్‌లోడ్‌కు కసరత్తు

- వివరాలు 5లో ▸

5న అల్పపీడనం



- దక్షిణ అండమాన్ సముద్రంలో ఈ నెల 5న అల్పపీడనం ఏర్పడనుంది. అది పశ్చిమ వాయవ్య దిశగా కదిలి 48 గంటల్లో వాయుగుండంగా బలపడనుంది. 8వ తేదీకి తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు చేరుతుందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

- వివరాలు 14లో ▸

తొలిరోజు 88.59% పింఛన్‌ల పంపిణీ


సాక్షి, అమరావతి/తాడికొండ: రాష్ట్ర వ్యాప్తంగా ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ పంపిణీ వేగంగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి 88.59 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తయింది. గ్రామ, వార్డు వలంటీర్లు తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందజేశారు. ప్రభుత్వం 62,31,221 మందికి పింఛన్‌ల కోసం రూ.1,584.86 కోట్లు కేటాయించింది. మొదటి రోజు 55,20,026 మందికి

మిగతా 2వ పేజీలో ▶



ఒంగోలులోని ఇందిరా కాలనీలో షేక్ పీరాబీకి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాషా

ఇదండీ సంగతి



పశ్చాత్తాప పడటానికి మనిషినన్న ఫీలింగ్ రావడం లేదు !!

తొలిరోజు 88.59% పింఛన్‌ల పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

రూ.1,403.70 కోట్లు అందించారు.

రాజధాని ప్రాంతంలో భూమిలేని పేదలకూ..

అమరావతి రాజధాని ప్రాంతంలో భూమిలేని పేదలకు ప్రభుత్వం అందజేసే పింఛన్లను కూడా గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. తుళ్లూరు మండలంలో 16,200 మంది లబ్ధిదారులకుగాను తొలిరోజు 12,423 మందికి (76.69 శాతం మందికి) వలంటీర్లు పింఛను డబ్బు అందజేశారు. తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలో తొమ్మిది గ్రామాల్లో 5,796 మందికిగాను 5,400 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. రాజధాని గ్రామాల్లో భూమిలేని పేదలు మొత్తం 17,173 మందికి ఇప్పటివరకు వారి బ్యాంకు ఖాతాల్లో సీఆర్‌డీఏ ద్వారా పింఛను డబ్బు జమచేసేవారు.



శ్రీకాకుళంలో అప్పలసూర్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ లక్ష్మీకళ్యాణి



విజయనగరంలో కాంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాసవి



కాకినాడ జిల్లా జగపతినగరంలో శ్రీరాములకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ ఆనంద్‌కుమార్



ఏలూరులో చింతా జయమణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమ



విజయవాడలో దివ్యాంగురాలు దుర్గాభవానికి పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగి ఈసుబ్



గుంటూరులో పారిజాతమ్మకు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ షేక్ ఆషా



నెల్లూరు జిల్లా మామిడిపూడిలో బీబీ జాన్‌కు పింఛన్ ఇస్తున్న వలంటీర్ హసీనాబేగం



వైఎస్సార్ జిల్లా కడపలో సైపుల్లాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రూతు



అనంతపురంలో పంచారత్నకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ కళ్యాణి



తిరుపతి జిల్లా ఎంఎస్ కాలనీలో శంకరయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ వీణ



నంద్యాల జిల్లా వల్లంపాడులో దివ్యాంగుడు సుబ్బయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య

క్లుప్తంగా

'మాస్టర్‌తో ఓ రోజు'కు గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న డాక్టర్ పలని వేలు

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రసిద్ధ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ పలని వేలు ఈ నెల 11న విజయవాడలో 'మాస్టర్ తో ఒక రోజు' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి ఆహ్వానించారు. శస్త్రచికిత్సల్లో అధునాతన సాంకేతికతను ఏ విధంగా వాడుకోవచ్చనే విషయాలపై యువ వైద్యులకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు పలని వేలు వివరించారు.

ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ నుంచి ఓటీటీ ప్యాకేజీలు

సాక్షి, అమరావతి: అతి తక్కువ ధరలతో ఇంటర్నెట్, టెలిఫోన్‌లతో పాటు ఓటీటీ సేవల ప్యాకేజీలను ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్(ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) ప్రకటించింది. హోమ్‌గోల్డ్ ప్యాకేజీ కింద రూ.499కి 200 చానల్స్, 20 ఎంబీపీఎస్ స్పీడ్, 150 జీబీ వరకు ఫుల్ స్పీడ్‌తో ఓటీటీ చానల్స్‌ను అందిస్తోంది. హోమ్ గోల్డ్ ప్లస్ కింద రూ.699కి 240 చానల్స్, 30 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 300 జీబీ ఫుల్ స్పీడ్‌తో ఓటీటీ చానల్స్, హోమ్ ప్లాటినంకింద రూ.999కి 245 చానల్స్, 50 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్‌తో పాటు అనేక ఓటీటీ చానల్స్‌ను అందిస్తున్నట్లు శుక్రవారం తెలిపింది. అలాగే, ఓటీటీ ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యంతో రూ.299, రూ.399. రూ.799లకు ప్యాకేజీలను అందిస్తోంది. ఈ ప్యాకేజీల కోసం ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ కాల్ సెంటర్ 18005995555 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరింది. హోమ్‌లైఫ్ ప్యాకేజీ కింద రూ.295కే ఉచిత చానల్స్‌తో పాటు 15 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ స్పీడ్‌తో 200 జీబీ డేటా, అన్ లిమిటెడ్ నెట్ కాలింగ్ సదుపాయాన్ని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ అందిస్తోంది.

ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీడీఎంఏగా ఉన్న ఆయనకు ప్రభుత్వం అదనంగా కాలుష్య నియంత్రణ మండలి బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఉద్యోగులతో ప్రవీణ్‌కుమార్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

నేటి నుంచి విశాఖలో మారిటైమ్ జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డా.శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, విశాఖపట్నం: మారిటైమ్ సాంకేతికతలో ఎదురవుతున్న సవాళ్లు, అభివృద్ధికి మార్గాలు అనే అంశంపై తమ సంస్థలో శుక్ర, శనివారాల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌టీఎల్) డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసరావు తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన, విశాఖపట్నం లోకల్ సెంటర్ చైర్మన్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్, ఎంఆర్‌డీబీ చైర్మన్ కమాండర్ డాక్టర్ భాస్కర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మారిటైమ్ టెక్నాలజీలో డిజిటల్ ప్రభావం, గ్రీన్‌మెరైన్ ఎన్విరాన్‌మెంట్, అటానమస్ వెహికల్స్, ప్రత్యామ్నాయ వనరులు, హైడ్రోడైనమిక్స్ డిజైన్లు, పునరుత్పాదక ఇంధన వనరులు, సముద్రగర్భంలో పరిశోధనలు మొదలైన అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ), డీఆర్‌డీవో సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ భుజంగరావు, రామనారాయణన్, ఎన్‌ఐవోటీ–చెన్నై డైరెక్టర్ డాక్టర్ రామదాస్, దేశ, విదేశాలకు చెందిన పరిశోధనల సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.

విశాఖలో విస్తరించిన ఐటీ అనుబంధ దిగ్గజం

ఏపీ ప్రభుత్వ మద్దతువల్లే విస్తరణ సాధ్యమైందంటున్న సంస్థ

సాక్షి, విశాఖపట్నం: దేశంలోని ద్వితీయశ్రేణి నగరాల్లో కీలకంగా మారిన విశాఖపట్నం వైపు దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయి. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం)లో ప్రపంచ అగ్రగామి సంస్థల్లో ఒకటైన డబ్ల్యూఎన్‌ఎస్ సంస్థ తమ కార్యకలాపాలు విస్తరించేందుకు సరైన వేదికగా సాగర తీరమైన విశాఖను ఎంపిక చేసుకుంది. ఇక్కడ 200 మంది ఉద్యోగులతో ప్రారంభమైన ఈ సంస్థ.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏకంగా 3,300 మంది ఉద్యోగులతో భారీ కార్యాలయంలో సేవల్ని విస్తరించింది. త్వరలోనే ఉద్యోగుల సంఖ్యని పెంచే దిశగా అడుగులు వేస్తోంది.

భారత్‌ని నడిపించే చోదకశక్తులుగా మారుతున్న టైర్–2 నగరాల్లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు తమ శాఖల్ని విస్తరించుకుంటున్నాయి. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతూ.. సకల సౌకర్యాలున్న టైర్–2 నగరాల్లో మిన్నగా ఉన్న విశాఖపట్నాన్ని మొదటి ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటూ తమ సంస్థ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా.. అంతర్జాతీయ బీపీఎం సంస్థల్లో ఒకటైన డబ్ల్యూఎన్‌ఎస్.. 3,300 మంది ఉద్యోగులతో కార్యాలయాన్ని విస్తరిస్తూ తన కార్యకలాపాన్ని ప్రారంభించింది. సిరిపురంలో గతంలో హెచ్‌ఎస్‌బీసీ సంస్థ ఉన్న భవనంలోనే డబ్ల్యూఎన్‌ఎస్ తన కొత్త డెలివరీ సెంటర్‌ని తాజాగా ప్రారంభించింది.



డబ్ల్యూఎన్‌ఎస్ సంస్థ కార్యాలయం

దేశ విదేశాల్లో డబ్ల్యూఎన్‌ఎస్ సేవలు

ఈ కేంద్రం షిప్పింగ్, లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్, హైటెక్, ప్రొఫెషనల్ సర్వీసులు అందిస్తుంది. అలాగే, దేశ విదేశాల్లో ఉన్న విభిన్న పరిశ్రమలకు డిజిటల్ ఫస్ట్ ఇండస్ట్రీ పేరుతో పరిష్కార మార్గాల్ని అందిస్తూ.. సామర్థ్యాల్ని మరింత బలోపేతం చేసుకునేలా డెలివరీ సెంటర్ ఏర్పాటుకు విశాఖను వేదికగా ఎంపిక చేసుకుంది.

గతంలో సరైన సహకారంలేక..

వాస్తవానికి డబ్ల్యూఎన్‌ఎస్ సంస్థ 2012లోనే విశాఖలో దాదాపు 40 మంది ఉద్యోగులతో సంస్థ కార్యకలాపాల్ని టెక్ మహీంద్ర భవనంలో ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రభుత్వాలేవీ సరైన ప్రోత్సాహకాలు అందించకపోవడంతో కార్యకలాపాల్ని విస్తరించలేకపోయింది. కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు ఎనలేని సహకారం అందిస్తుండటంతో ఇదే సరైన తరుణమని భావించిన సంస్థ.. 2020 నాటికి 2000 మంది ఉద్యోగులకు విస్తరించింది. రెండేళ్లలోనే 3,300 మంది ఉద్యోగులతో మరింత విస్తరించుకుని.. విశాఖలోనే అతిపెద్ద బీపీఎం సంస్థల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 400 మంది క్లైయింట్స్‌తో డబ్ల్యూఎన్‌ఎస్ తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంది. ఇక విశాఖలో ప్రారంభించిన తాజా డెలివరీ సెంటర్‌తో కెనడా, చైనా, కోస్టారికా, ఇండియా, ఫిలిప్పీన్స్, పోలాండ్, రొమేనియా, దక్షిణాఫ్రికా, స్పెయిన్, శ్రీలంక, టర్కీ, యూకే, యూఎస్ వంటి చోట్ల మొత్తం 60 డెలివరీ సెంటర్లలో 57,503 మంది నిపుణులతో బలోపేతమైంది. త్వరలోనే విశాఖలో మరో 200 మంది ఉద్యోగుల్ని నియమించుకునే అవకాశముంది.

విశాఖ కేంద్రంగా సేవల విస్తరణ



విశాఖపట్నం వంటి శక్తిమంతమైన నగరంలో మా సంస్థ కార్యకలాపాలు విస్తరించడం గర్వంగా ఉంది. వైజాగ్‌లో బలమైన టాలెంట్ హబ్‌ని నిర్మించడంతో పాటు విశాఖ కేంద్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా మా ఖాతాదారులకు సేవల్ని విస్తరిస్తున్నాం. క్లౌడ్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీస్ సహా డిమాండ్ బట్టి నైపుణ్యాల్ని అందించనున్నాం. నైపుణ్యవంతమైన ఉద్యోగులు, సిబ్బంది లభించడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరించింది. ఏపీ ప్రభుత్వం స్థిరమైన మద్దతుని అందించడంవల్లే వేగవంతంగా సంస్థను విస్తరించగలిగాం.

– కేశవ్ ఆర్ మురుగేష్, డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూప్ సీఈవో

రాష్ట్రపతికి విజయవాడలో 4న పౌర సన్మానం

4, 5 తేదీల్లో విజయవాడ, విశాఖ, తిరుపతిలో రాష్ట్రపతి పర్యటన

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం 4వ తేదీన విజయవాడలో పౌర సన్మానం చేయనుంది. రాష్ట్రపతిగా ఎన్నికయ్యాక ఆమె తొలిసారిగా రాష్ట్రంలో 4, 5 తేదీల్లో పర్యటించనున్నారు. పర్యటన వివరాలను ప్రభుత్వం గురువారం వెల్లడించింది. 4వ తేదీ ఉదయం 10.15 గంటలకు రాష్ట్రపతి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా విజయవాడ శివారు తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి–నిడమానూరు రోడ్డు మురళీ రిసార్ట్స్‌కు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్ర ప్రజల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సన్మానిస్తారు. అనంతరం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రాజ్‌భవన్‌లో తన గౌరవార్థం ఇచ్చే విందుకు ఆమె హాజరవుతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విశాఖపట్నంలోని నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకుంటారు. కేంద్ర రవాణా–జాతీయ రహదారుల శాఖ రాష్ట్రంలో నిర్మించనున్న జాతీయ రహదారులకు ఆమె శంకుస్థాపన చేస్తారు. విశాఖలో నిర్వహించే నేవీ డే వేడుకలకు హాజరై నౌకా దళ విన్యాసాలను తిలకిస్తారు. అనంతరం ఐఎన్‌ఎస్ డేగా నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి చేరుకుని తిరుమలలో రాత్రి బస చేస్తారు. అలాగే, 5వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.



రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముత్యాలరాజు, తలశిల రఘురాం, కలెక్టర్లు

అనంతరం టీటీడీ గోశాలను సందర్శిస్తారు. అనంతరం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థినులతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి బయలుదేరి ఢిల్లీ చేరుకుంటారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు

పోరంకి మురళీ రిసార్ట్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పౌర సన్మానం కార్యక్రమ ఏర్పాట్లను జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాలరాజు, ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌లు పి.రంజిత్‌బాషా, ఎస్.ఢిల్లీరావులు పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్లు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.అపరాజితసింగ్, ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి. ఎడిషనల్ డైరెక్టర్ శర్మ తదితరులున్నారు.

త్వరలో పూర్తి స్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్'!



వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేదని, అన్ని ఖాళీలను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఆలోగా విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది కల్లా పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన కొనసాగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్.. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ పూర్తయ్యేకొద్దీ ఆయా చోట్ల పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం జగన్ ఈ ఏడాది అక్టోబరు 21న ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ పైలెట్ ప్రాజెక్టు అమలుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ భాగస్వామ్యం

ఎఫ్‌పీసీ అమలులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖను భాగస్వామ్యం చేయాలి. రక్తహీనతతో బాధ పడుతున్న పిల్లలు, గర్భవతులు, బాలింతలను గుర్తించి ఆ వివరాలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అందచేయాలి. వాటి ఆధారంగా పౌష్టికాహారం, మందులు అందించేలా చర్యలు తీసుకోవాలి.

యాప్‌లో ఆసుపత్రుల వివరాలు..

ఏ వ్యాధికి, ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స లభిస్తుందన్నది బాధితులకు తెలియాలి. సంబంధిత చికిత్స అందించే నెట్‌వర్క్ ఆసుపత్రి వివరాలు వెంటనే తెలిసేలా యాప్ రూపొందించాలి. ఆసుపత్రి లొకేషన్‌తో పాటు డైరెక్షన్ కూడా వెల్లడించేలా యాప్ ఉండాలి. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల దగ్గర నుంచి అందరూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రి గురించి గైడ్ చేసే పరిస్థితి రావాలి. ప్రజలకు ఈ యాప్ అందుబాటులో ఉండాలి.

ఫిర్యాదులన్నీ 104 ద్వారా

ఆరోగ్యశ్రీ సేవల విషయంలో ఏమైనా తప్పులుంటే కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగులకు సరిగా సేవలు అందించకపోవడం, సేవల్లో నాణ్యత లోపించడం లాంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై కచ్చితంగా దృష్టి పెట్టాలి. నెగిటివ్ ఫీడ్ బ్యాక్‌పై పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలి. డయాలసిస్ రోగులకు సేవలందించేందుకు 108 వాహనాలను వినియోగించుకోవాలి. ఆరోగ్య రంగంలో ఎలాంటి ఫిర్యాదునైనా 104 ద్వారా స్వీకరించాలి. విలేజ్ క్లినిక్స్ సహా అన్ని చోట్లా ఈ నంబర్‌ను ప్రదర్శించాలి.

మరో 260 వాహనాలు..

ఫ్యామిలీ డాక్టర్ పైలెట్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు 7,166 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను రెండు సార్లు, 2,866 విలేజ్ క్లినిక్‌లను ఒకసారి చొప్పున సందర్శించినట్లు అధికారులు తెలిపారు. గత అక్టోబర్ 21 నుంచి ఇప్పటివరకు 7,86,226 మందికి వైద్య సేవలందించామన్నారు. రక్తపోటు బాధితులు 1,78,387, మధుమేహం బాధితులు 1,25,948 మందికి మందులు అందచేసినట్లు వివరించారు. డిసెంబర్‌లో 104 ఎంఎంయూ వాహనాలను అదనంగా 260 సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పూర్తి స్థాయిలో 104 వాహనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎఫ్‌పీసీతో వైద్య సిబ్బందిలో వివిధ విభాగాల మధ్య సమన్వయం గణనీయంగా పెరిగిందని, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కూడా సిబ్బంది భాగస్వామ్యం బాగా పెరిగిందని చెప్పారు. పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలు, గర్భవతుల ఆరోగ్యంపై కూడా దృష్టి సారించి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి జి.ఎస్.నవీన్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జి.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ఏపీ ఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, డీఎంఈ, ఏపీవీవీపీ కమిషనర్ వినోద్ కుమార్, ఔషధ నియంత్రణ విభాగం డీజీ రవిశంకర్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఉన్నతాధికారులు

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ టూ చీఫ్ మినిస్టర్ డాక్టర్ సమీర్‌శర్మ, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్యలు కలిశారు. సీఎంకు పుష్ప గుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు.







పారదర్శకంగా రేషన్ పంపిణీ

పౌరసరఫరాల శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక ఎండీయూ చొప్పున 620 వాహనాల్లో జీపీఎస్ సాంకేతికతను ప్రవేశపెట్టామన్నారు. సక్రమంగా ఇంటింటికీ రేషన్‌ను అందించేందుకు వీలుగా ఆయా కాలనీల్లో ఎంపిక చేసిన ప్రదేశాల జియోగ్రాఫికల్ వివరాలను ఈ–పోస్ యంత్రానికి అనుసంధానం చేశామని తెలిపారు. రేషన్ పంపిణీ సమయంలో ఎండీయూ వాహనం కచ్చితంగా లబ్ధిదారుల ఇంటి సమీపానికి వెళ్లి సరుకులు ఇచ్చేలా పర్యవేక్షణ చేస్తామన్నారు. తొలుత పైలట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 8.99 లక్షల కార్డుదారులను భాగస్వాములను చేసినట్లు వివరించారు.

సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసిన ఏపీ జేఏసీ నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని గురువారం ఏపీ జేఏసీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర సచివాలయం ఒకటో బ్లాక్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జవహర్‌రెడ్డిని ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో కలిశారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక పరమైన పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, పెండింగ్ డీఏల విడుదల, సరండర్ లీవ్ బకాయిలు, జీపీఎఫ్ లోన్స్ వంటి అంశాలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్‌ను కలిసినవారిలో ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏపీ క్లాస్ 4 ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేసన్, ఏపీ వీఆర్వో అసోసియేషన్, ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం తదితర నేతలు కలిశారు.

చంద్రబాబుకు చాదస్తం మరీ ఎక్కువైంది

- మంత్రి అంబటి మండిపాటు
- రాత్రి పూట ఎవరైనా ప్రాజెక్టును సందర్శిస్తారా?
- పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం మా బాధ్యత
- ఆయన నిర్వాకం వల్లే నిర్మాణం ఆలస్యం



సత్తెనపల్లి: పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. చంద్రబాబు పిచ్చి, చాదస్తం కాకపోతే రాత్రి 7 గంటల సమయంలో పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వయసు ప్రభావం వల్ల చాదస్తం మరీ ఎక్కువైందని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా నేరుగా లబ్ధిదారులకు బటన్ నొక్కితే వెళ్లేలా చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారన్నారు. అదీ తమ చిత్తశుద్ధి అన్నారు. ఎక్కడా, ఏ విధమైన పొరపాట్లు జరగవని చెప్పారు. ఎక్కడైనా సరే అధికారులు, సిబ్బంది తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుపై అభూత కల్పనలు సృష్టించి, తద్వారా లబ్ధి పొందాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. 2018లోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని డబ్బాలు కొట్టిన బాబును ప్రజలు ఇంటికి పంపారన్నారు. బాబు నిర్వాకం వల్లే ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. అన్ని అడ్డంకులను అధిగమించి, ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ప్రారంభోత్సవానికి చంద్రబాబునూ ఆహ్వానిస్తామన్నారు. ఇందులో తొందర పడాల్సిందేమీ లేదని చెప్పారు. పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) ఎక్కడా తప్పు పట్టలేదన్నారు. మొట్టమొదట ట్రాన్స్‌ట్రాయ్ ఏజెన్సీ ఉంటే, చంద్రబాబు దానిని తొలగించి నవయుగకు ఇచ్చారని, ఆ తర్వాత తమ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా మెఘాకు ఇచ్చిందని చెప్పారు. వాళ్లు మారిస్తే తప్పులేదు కానీ, తాము మారిస్తే తప్పా అని ప్రశ్నించారు.

చంద్రబాబుది రోజుకో డ్రామా

హోంమంత్రి తానేటి వనిత మండిపాటు



కొవ్వూరు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రోజుకో డ్రామా చేస్తున్నారని హోంమంత్రి తానేటి వనిత మండిపడ్డారు. ఆయన తీరుపై ప్రజలు ఇదేమి ఖర్మరా బాబూ.. అని మాట్లాడుకుంటున్నారని చెప్పారు. గురువారం ఆమె తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో మీడియాతో మాట్లాడారు. పోలవరం వద్ద కావాలనే చంద్రబాబు రాద్ధాంతం చేశారన్నారు. టీడీపీ హయాంలో పోలవరంను ఏటీఎంలా వాడుకున్నారని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు.. ముందస్తు సమాచారం ఇవ్వకుండా జన సమూహంతో అదీ రాత్రి పూట పాజెక్టు వద్దకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. తన హయాంలో ఏం చేశారో చెప్పకుండా రోడ్లు పట్టుకొని తిరిగితే ప్రజలు నమ్ముతారని ఆయన భావిస్తున్నారన్నారు. ఈరోజు పూర్తవుతుంది.. రేపు పూర్తవుతుందని చంద్రబాబులా అసత్యాలు చెప్పమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగానే పోలవరం ప్రాజెక్టు ప్రారంభమవుతుందని పునరుద్ఘాటించారు. చంద్రబాబు తొందరపడబట్టే డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందన్నారు.

క్లుప్తంగా

ఏపీలో 14 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు గణనీయమైన వృద్ధిని సాధించాయని కేంద్ర ఆర్థిక శాఖ గురువారం వెల్లడించింది. గతేడాది నవంబర్ నెలకు ఏపీలో జీఎస్టీ వసూళ్లు రూ.2,750 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది 14 శాతం మేర పెరిగి రూ.3,134 కోట్లకు చేరిందని తెలిపింది. తెలంగాణలో గతేడాది రూ.3,931 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు.. 8 శాతం మేర పెరిగి రూ.4,228 కోట్లకు చేరిందని వెల్లడించింది.

చంద్రబాబు హయాంలోనే అన్యాయం

ఇదేమి ఖర్మ కార్యక్రమంలో టీడీపీ నేతలకు భంగపాటు



టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రేమావతి

తిరుపతి మంగళం : ఏం తల్లీ.. జగన్ ప్రభుత్వం ధరలను పెంచి ప్రజలకు అన్యాయం చేస్తోంది కదా..? అని టీడీపీ నేత పులివర్తి నాని స్థానిక తిరుమలనగర్‌లో మహిళలను ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే మాకు అన్యాయం జరిగిందంటూ స్థానికురాలు ప్రేమావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా తిరుమల నుంచి కిందకు దింపేసి బతుకు లేకుండా చేశాడని, ఏళ్ల తరబడి తిరుమలలో ఉద్యోగం చేస్తున్న తన భర్త ఉద్యోగం కూడా తీసేశాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ ధరలు పెంచారు.. గ్యాస్ ధర పెంచారు కదా తల్లీ.. అని కస్తూరమ్మను టీడీపీ నేతలు ప్రశ్నించారు. అవును సార్.. పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచేది కేంద్ర ప్రభుత్వం కదా.. రాష్ట్ర ప్రభుత్వానికి ఏం సంబంధం? అంటూ ఆమె ఎదురు ప్రశ్న వేయడంతో టీడీపీ నేతలు కంగుతిన్నారు. మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీలో గురువారం టీడీపీ నాయకులు నిర్వహించిన ఇదేమి ఖర్మ.. కార్యక్రమంలో స్థానికులు టీడీపీ నేతలపై మండిపడ్డారు. వారి సమాధానాలకు విస్తుబోయారు. చంద్రబాబు పాలనలోనే తమ పరిస్థితి ఇదేమి ఖర్మ.. అన్నట్టుగా ఉందన్నట్లుగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేయండి

- ఏపీలో పెట్టుబడులను ప్రోత్సహించండి
- ఇన్వెస్ట్ ఇండియా సీఈవో దీపక్ బగ్లాను కోరిన మంత్రి అమర్‌నాథ్



దీపక్ బగ్లాను కలిసిన అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడానికి సహకరించాలని ఇన్వెస్ట్ ఇండియాను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులకు ఇన్వెస్ట్ ఇండియా నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. న్యూఢిల్లీలో ఇన్వెస్ట్ ఇండియా సీఈవో దీపక్ బగ్లాను గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడికి అవకాశం ఉన్న రంగాల గురించి బగ్లాకు వివరించారు. గడిచిన మూడేళ్లల్లో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులను తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పరిశ్రమలకు పూర్తిస్థాయి సహకారం అందిస్తూ ప్రతిపాదన నుంచి ప్రారంభం వరకు అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, పోర్టు ఆధారిత పరిశ్రమల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, వీటిని విదేశీ ఇన్వెస్టర్లకు వివరించడం ద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్, ఏపీఐఐసీ వీసీ, ఎండీ, ఏపీఈడీబీ సీఈవో సృజన తదితరులు పాల్గొన్నారు. విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగస్వామ్యం కావడానికి బగ్లా ఆసక్తిని వ్యక్తంచేశారు.

సచివాలయాల సేవలపై అవగాహన సదస్సులు

మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించేలా సదస్సులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సచివాలయ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శక సేవలు అందిస్తున్న సచివాలయాల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. 19 పోర్టల్స్ ద్వారా గ్రామ స్థాయిలోనే వందల సేవలు లభిస్తున్నాయన్నారు.

కొత్త సిలబస్‌తో జేఈఈ అడ్వాన్స్‌డ్



జేఈఈ మెయిన్‌తో అనుసంధానిస్తూ సిలబస్ మార్పు

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్–2023 పరీక్షలు కొత్త సిలబస్‌తో జరగనున్నాయి. సిలబస్‌లో మార్పులు చేస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన జాయింట్ అడ్మిషన్ బాడీ (జేఏబీ) ఇప్పుడు కొత్త సిలబస్‌ను విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్ ' jeeadv. ac. in' లో పొందుపరిచింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ మూడు సబ్జెక్టుల్లోనూ సిలబస్ మార్చింది. 2023 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కొత్త సిలబస్‌ను అనుసరించాల్సి ఉంటుంది. పాత సిలబస్‌లోని కొన్ని అధ్యాయాలను తొలగించి, కొత్తగా కొన్ని చేర్చారు. జేఈఈ మెయిన్‌తో అనుసంధానంగా ఉండేలా నూతన సిలబస్‌ను రూపొందించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కోచింగ్ తీసుకోని విద్యార్థులు కూడా విజయం సాధించడం సిలబస్ మార్పు ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు.

మార్పులు ఇలా

జేఈఈ అడ్వాన్స్‌డ్ గణితంలో కొత్తగా గణాంకాలు (స్టాటిస్టిక్స్)ను జోడించారు. దీనికి బదులుగా త్రిభుజం పరిష్కారం (సొల్యూషన్ ఆఫ్ ట్రయాంగిల్) అంశాన్ని తొలగించారు. భౌతిక శాస్త్రంలో సెమీకండక్టర్లు, కమ్యూనికేషన్ అంశాలను మినహాయించారు. వీటికి బదులుగా జేఈఈ మెయిన్‌లోని కొన్ని అంశాలు జోడించారు. మెయిన్‌లోని ఫోర్స్‌డ్ అండ్ డాంపడ్ ఆసిల్లేషన్స్, ఈఎమ్ వేవ్స్, పోలరైజేషన్ అంశాలను కొత్త సిలబస్‌లో చేర్చారు. కెమిస్ట్రీలోనూ మార్పులు చేశారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు సులువు

కొత్త సిలబస్‌లో ఎక్కువగా సీబీఎస్ఈ అంశాలను చేర్చారు. దీనివల్ల సీబీఎస్ఈ విద్యార్థులకు కొంత సులువుగా ఉంటుందని, ఇంటర్మీడియట్ చదివే వారికి కొంత ఇబ్బందికరమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్ విద్యార్థులు గతంలోకంటే ఎక్కువ సిలబస్‌ని అనుసరించాల్సి వస్తుందన్నారు. కొత్త సిలబస్ జేఈఈ మెయిన్‌కు అనుసంధానంగా ఉండేలా చేయడం వల్ల మెయిన్‌కి ప్రిపేర్ అయిన వారు అవే అంశాలను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. సిలబస్‌ను పెంచినప్పటికీ, పరీక్ష సులువుగా మారే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. మెయిన్‌లోని అధ్యాయాలు అడ్వాన్స్‌డ్‌లో చేర్చినందున సిలబస్ పెరిగినట్లు పైకి కనిపించినప్పటికీ, అవే అంశాలు కనుక అంతగా భారం ఉండదని, విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని విశ్లేషిస్తున్నారు. ఐఐటీలలో వివిధ కోర్సులు చదవాలనుకొనే వారు కొత్త ఫార్మాట్ ఆధారంగా ప్రవేశ పరీక్షకు సిద్ధం కావాలని సూచిస్తున్నారు.

పరీక్షలు ఇలా..

కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ డిజైన్ (సీఈఈడీ), అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ డిజైన్ (యూసీఈఈడీ) కింద ఈ కొత్త పేపర్ నమూనా, సిలబస్ ప్రవేశపెట్టినట్లు జేఏబీ ప్రకటించింది. కొత్త విధానంలో ప్రవేశ పరీక్ష పార్ట్–ఎ, పార్ట్–బిలుగా రెండు భాగాలుగా ఉంటుంది. పార్ట్–ఎ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మూడు విభాగాలలో ప్రశ్నలు ఉంటాయి. న్యూమరికల్ ఆన్సర్ టైప్, మల్టిపుల్ సెలెక్ట్ క్వశ్చన్స్, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ (ఎన్ఏటీ, ఎంఎస్క్యూ, ఎమ్సీక్యూ) ఉంటాయి. పార్ట్–బి లో రెండు ప్రశ్నలు ఉంటాయి. ఒకటి డ్రాయింగ్, మరొకటి డిజైన్ ఆప్టిట్యూడ్. పార్ట్ – బి లోని ప్రశ్న కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించేలా ఇస్తారు. అభ్యర్థులు దానికి సమాధానాన్ని ఇన్విజిలేటర్ అందించిన జవాబు పుస్తకంలో మాత్రమే రాయాలి. ప్రశ్నలకు సంబంధించిన చిత్రాల డ్రాయింగ్ అందులోనే చేయాలి.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడి

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతకు తీవ్ర గాయాలు





కొయ్యలగూడెంలో నిరసన వ్యక్తంచేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు (ఇన్‌సెట్) గాయపడిన మూర్తిరాజు

కొయ్యలగూడెం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ శ్రేణులు చేసిన రాళ్ల దాడిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతకు గాయాలయ్యాయి. గురువారం చంద్రబాబు కొయ్యలగూడేనికి వస్తున్న సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ శంకు కొండల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలిపారు. 'జగన్ సీఎం కావడం మా అదృష్టం.. చంద్రబాబు ప్రతిపక్ష నేత కావడం మా ఖర్మ' అంటూ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. అయితే, టీడీపీ శ్రేణులు పథకం ప్రకారం అప్పటికే వెంట తెచ్చుకున్న రాళ్లను ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విసిరారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు గుండుమోలు మూర్తిరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. మూర్తిరాజును వెంటనే ఆస్పత్రికి తరలించారు. రాళ్లు విసిరిన వారు దెందులూరు నియోజకవర్గానికి చెందినవారని, సీసీ ఫుటేజీ పరిశీలిస్తే గుర్తించవచ్చని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

సీమ ద్రోహి చంద్రబాబు: మంత్రి రోజా



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న రోజా

తిరుపతి ఎడ్యుకేషన్ : చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని, సొంత జిల్లా చిత్తూరుకు ఆయన చేసిందేమీ లేదని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని టెన్నిస్ కోర్టులో గురువారం జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తన పాలనలో రాయలసీమ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి కర్నూలును న్యాయ రాజధానిగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లను ఓడించి హైదరాబాద్‌కు తరిమేసినా తిరిగి రాష్ట్రంలోకి టూరిస్టుల్లా వస్తున్నారని విమర్శించారు. తన పాలనలో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఏమీ చేయని బాబు, మూడేళ్ల పాలనలో జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్ జిల్లా పేరు మారుస్తా

- హార్టీకల్చర్ యూనివర్సిటీ పేరు మారుస్తా
- పోలవరం పునరావాస కాలనీలను జూబ్లీహిల్స్‌లా చేద్దామనుకున్నా
- ఏలూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు
- పోలవరం ప్రాజెక్టు వద్ద రోడ్డుపై బైఠాయించి హైడ్రామా



పోలవరం వద్ద రోడ్డుపై బైఠాయించిన చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి, రాజమహేంద్రవరం/కొవ్వూరు: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను నట్టేట ముంచుతున్నారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మార్చి రాజశేఖరరెడ్డి పేరు పెట్టారు. నేను అనుకుంటే వైఎస్సార్ జిల్లా పేరు మారుస్తా. పశ్చిమ గోదావరిలో ఉన్న హార్టీకల్చర్ యూనివర్సిటీ పేరు మారుస్తా' అంటూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వ్యాఖ్యలు చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో, కొవ్వూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో రోడ్‌షోలు నిర్వహించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. తొలుత కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగిన బీసీ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. 'ముఖ్యమంత్రి, డీజీపీ, చీఫ్ సెక్రటరీ ఒకే జిల్లా వాళ్లు. రాష్ట్రంలో సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల ఈ నలుగురే రాజకీయం చేస్తుంటే మేము చూస్తూ ఉండాలా' అని అన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీలకు పదవులు ఇచ్చి అగ్రవర్ణాల కింద పని చేయించుకుంటున్నారని అన్నారు. బీసీలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు కావాలని కోరిక ఉండటం తప్పు కాదని, ఒక పద్ధతి ప్రకారం ఎదగాలని చెప్పారు. బీసీల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు.

కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు

ఆయన పోలవరంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు గానీ గంజాయి మాత్రం ఇస్తున్నారని, అందరూ గంజాయి మత్తులో ఉంటే రాష్ట్రాన్ని దోచేస్తున్నారని విమర్శించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని, తెలంగాణలో ఎక్కువ మద్దతు ధర ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు పోయి, ఇసుక, మైనింగ్ మాఫియా, గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లు ఎక్కువయ్యారన్నారు. పోలవరం పునరావాస కాలనీలను జూబ్లీహిల్స్‌లా చేయాలనుకున్నా అన్నారు. 72 శాతం ప్రాజెక్టు తానే పూర్తి చేశానని, తాము అధికారంలోకి రాగానే పోలవరాన్ని జిల్లాగా ప్రకటిస్తామన్నారు. మనం ఎమైనా చేస్తే పోలీసులు వచ్చి గోడలు దూకి అరెస్టు చేస్తారని అంటూనే, వాళ్లదేం తప్పులేదని, జీతాలు కూడా లేవంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. తన మీద కేసులు పెట్టేందుకు తవ్వుతూనే ఉన్నారని, ఈక కూడా దొరకదని చెప్పారు.

ప్రాజెక్టు వద్ద హైడ్రామా

అంతకుముందు చంద్రబాబు, టీడీపీ నేతలు పోలవరం ప్రాజెక్టులోకి వెళ్లడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకొన్నారు. ప్రాజెక్టు సందర్శనకు అనుమతి తప్పనిసరని, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో అనుమతించలేమని డీఎస్పీ లతాకుమారి వివరించారు. దీంతో పోలీసులను అడ్డగోలు రీతిలో ప్రశ్నించి 15 నిమిషాల పాటు రోడ్డుపై బైఠాయించారు. ఆ తర్వాత వెళ్లిపోయారు.

ఉద్యోగాలిచ్చా.. రాయల్టీ ఇవ్వండి

తన హయాంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశానని, మీ పిల్లలకు విదేశాల్లో ఉద్యోగాలు వచ్చాయని, లక్షల ఆదాయం చూపించానని అందుకు ప్రతిఫలంగా తనకు రాయల్టీ పే చేయాలని చంద్రబాబు కొవ్వూరు సభలో అన్నారు. సంపాదనలో కనీసం ఒక శాతం రాయల్టీ ఇవ్వాలన్నారు. పార్టీ ఫండ్ అన్నా ఇవ్వాలని ప్రాధేయపడ్డారు.

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు

- 2024 ఎన్నికల తర్వాత టీడీపీ ఉనికే ఉండదు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి స్పష్టీకరణ
- పాదయాత్ర కాదు.. పొర్లు దండాలు పెట్టినా లోకేశ్‌ను ప్రజలు నమ్మరు



సాక్షి, అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని.. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ ఉనికే ఉండదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 7న వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న 'జయహో బీసీ మహాసభ' ఏర్పాట్లను గురువారం ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తనకు చివరి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు ఇటీవల ప్రజలను పదే పదే కోరుతున్నారని, ఆఖరి అవకాశం ఇస్తే ఏం చేయగలుగుతావో చెప్పాలని ప్రజలు ఆయన్ను నిలదీస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు అధికారాన్ని అప్పగిస్తే, దోచుకో.. పంచుకో.. తినుకో.. (డీపీటీ) పద్ధతిలో పరిపాలించారని విమర్శించారు. దాంతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు.. రాష్ట్రంలో ఒకసారి, మొత్తం మూడుసార్లు సీఎంగా చేసినందుకు ప్రతిఫలంగా చంద్రబాబు ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. గోబెల్స్, చంద్రబాబు అన్నదమ్ముల్లాంటి వాళ్లని.. చెప్పిన అబద్ధాన్నే పదే పదే చెప్పి.. అదే నిజమని ప్రజలు భావిస్తారని అనుకుని నిత్యం అబద్ధాలనే ప్రచారం చేస్తారంటూ ఏకిపారేశారు. తన కులం, తన కుటుంబం, తన మనుషుల కోసమే పని చేసిన చంద్రబాబు అసలు రాజకీయ నాయకుడే కాదని మండిపడ్డారు.

అసమర్థుడి పాదయాత్రా?

ఒకవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి.. ఇంకోవైపు సామాజిక న్యాయాన్ని పాటిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ప్రగతిపథాన నిలుపుతుంటే.. చంద్రబాబు, లోకేశ్‌లు సైకోల్లా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఏ విషయంపైనా కనీస అవగాహన లేని లోకేశ్‌కు ఉన్నవన్నీ చెడు వ్యసనాలేనన్నారు. ఏమాత్రం రాజకీయ అవగాహన లేని లోకేశ్ పాదయాత్ర కాదు.. పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. లోకేశ్ వంటి అసమర్థుడిని నాయకుడిగా ప్రజలు అంగీకరించన్నారు. గతంలో కంటే ఎక్కువ ఓట్లు, సీట్లతో అధికారంలోకి వస్తామని.. మరో 25 ఏళ్లు వైఎస్ జగనే సీఎంగా ఉంటారని పునరుద్ఘాటించారు. జెడ్ కేటగిరి భద్రత కలిగిన చంద్రబాబు.. తనకు భద్రత లేదని నాటకం ఆడుతూ సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

బాబుకు బైబై చెబుతున్న బీసీలు

- పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



సాక్షి, అమరావతి : మోసం చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబుకు బీసీలందరూ బై బై చెబుతున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. చంద్రబాబు బీసీలను ఓట్లేసే యంత్రాల్లా వాడుకున్నారని, అన్ని కులాల వారికీ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. 'చంద్రబాబు ఏనాడైనా బీసీలను రాజ్యసభకు పంపారా? 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు బీసీలకు ఏం చేశారో చెప్పాలి' అని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇదివరకెన్నడూ లేని రీతిలో బీసీలకు సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వం మాది. ఈ నెల 7న జరిగే జయహో బీసీ మహాసభలో ఇప్పటి వరకు చేసిందేమిటనేది చెప్పటమే కాకుండా, ఇకపై ఏం చేస్తామనేది కూడా సీఎం జగన్ చెప్పబోతున్నారు. చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే అర్హతే లేదు.

విదేశాలకు ఎగుమతిచేసే ధాన్యం రకాలు పండించాలి

విదేశాలకు ఎగుమతికి డిమాండ్ ఉన్న ధాన్యం రకాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని మంత్రి కారుమూరి సూచించారు. ఆయన గురువారం పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

'జయహో బీసీ' మహాసభతో మరింత భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే కె.పార్థసారథి తదితరులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జయహో బీసీ మహాసభ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. 'జయహో బీసీ మహాసభ – వెనుకబడిన కులాలే వెన్నెముక' నినాదంతో మహా సభ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీసీ గర్జన సభలో డిక్లరేషన్ రూపంలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల కంటే గత మూడున్నరేళ్లలో సీఎంగా ఎక్కువ ప్రయోజనాన్ని చేకూర్చారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకు 50 శాతం పదవులను బీసీ వర్గాలకు ఇచ్చి.. పరిపాలనలో సింహభాగం వాటా ఇచ్చారని గుర్తు చేశారు.

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం

అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు–నేడు, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ తదితర పథకాలు, కార్యక్రమాల ద్వారా బీసీ వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని మంత్రులు చెప్పారు. తద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పరిపాలనలో సింహ భాగం వాటా ఇవ్వడం ద్వారా బీసీలు సామాజిక సాధికారత సాధించడానికి బాటలు వేశారన్నారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదు.. సమాజానికి వెన్నెముకలా నిలిచేలా అభివృద్ధి చేస్తానని డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని తూ.చ. తప్పకుండా అమలు చేశారని చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల కింద డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో పేదల ఖాతాల్లో జమ చేసిన రూ.1.77 లక్షల కోట్లలో సింహభాగం బీసీలకే ఇచ్చారని స్పష్టం చేశారు. మూడున్నరేళ్లుగా బీసీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించి.. భవిష్యత్‌లో ఆ వర్గాలకు మరింత భరోసా ఇవ్వడానికి తీసుకుంటున్న చర్యలను చాటి చెప్పడానికే ఈ మహాసభ నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు. ఈ సభలో బీసీల ఆత్మబంధువు సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని తెలిపారు.

లేని ప్రేమను ఒలకబోస్తున్న బాబు

2014లో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ వర్గాలనే అవమానించారని మంత్రులు గుర్తు చేశారు. 2014–19 మధ్య చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపిన పాపాన పోలేదన్నారు. ఈ మూడున్నరేళ్లలో 8 రాజ్యసభ స్థానాలు వైఎస్సార్‌సీపీకి దక్కితే.. అందులో నాలుగు స్థానాలను వైఎస్ జగన్ బీసీలకు ఇచ్చి రాజ్యసభకు పంపారని ప్రశంసించారు. వాస్తవాలు ఇలా ఉంటే బీసీ వర్గాలపై లేని ప్రేమను ఒలకబోస్తున్న చంద్రబాబును చూసి.. ఇదేం ఖర్మరా బాబూ.. అని ప్రజలు అంటున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదీప్ రాజు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, పార్టీ కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాప్‌రెడ్డి, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణ మూర్తి, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పేరు పేరునా ఆహ్వానం

వార్డు సభ్యుల నుంచి పార్లమెంటు వరకూ ఉన్న బీసీ ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పదవులు నిర్వహిస్తున్న ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు.. మొత్తం 84 వేల మంది ప్రతినిధులు జయహో బీసీ మహాసభలో పాల్గొంటారు. మహాసభకు ఆహ్వానిస్తూ వీరందరికీ పేరు పేరునా ఆహ్వాన పత్రాలు పంపాం. ఒకవేళ ఎవరికైనా ఆహ్వానాలు అందకపోయినా, ఇదే ఆహ్వానంగా భావించి సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ నెల 7న ఉదయం 10గంటలకు మహాసభ ప్రారంభమవుతుంది. 12 గంటలకు సీఎం జగన్ ప్రసంగిస్తారు. ఈ మహాసభ అనంతరం రీజనల్, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో బీసీ సభలను మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిలోపు నిర్వహిస్తాం. బీసీలే వెన్నెముక అన్న ప్రాతిపదికగా వైఎస్సార్‌సీపీ ముందుకెళ్తోంది.

– వి.విజయసాయిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్

అది బీసీలను కించపరచడమే..

మంత్రి పదవులు పొందిన బీసీలకు అధికారాలు లేవంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తుండటం హాస్యాస్పదం. ఇది వారిని కించపరిచినట్లే. అదంతా ఎల్లో మీడియా సృష్టి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో చేస్తున్న కృషి ప్రతిపక్షాలకు కన్పించడం లేదా? సమాజంలో అట్టడుగు, అణగారిన వర్గాలకు మేమున్నాం అనే ధైర్యాన్ని, భరోసాను ఇవ్వడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. బీసీ మహాసభ తర్వాత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహాసభలు కూడా నిర్వహిస్తాం. ఎవరినో విమర్శించడానికి ఈ బీసీ సభ పెట్టడం లేదు. విమర్శలు చేసే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా లేదు. రాష్ట్రంలో ప్రతి ఒక్క బీసీ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాది అనే రీతిలో మేం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

పనివాళ్ల ఒంటిమీది చెమట ఆరకముందే
వాళ్లకు ఇవ్వాల్సిన కూలీ సొమ్ము చెల్లించాలి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 2

'చిరు' ప్రయత్నం చేయాల్సిందే!

కొన్ని సందర్భాలు ఆగి ఆలోచించుకోవడానికి ఉపకరిస్తాయి. గతాన్ని సింహావలోకనం చేసుకొమ్మంటాయి. భవిష్యత్ కర్తవ్యాన్ని గుర్తు చేస్తాయి. ఐరాస ప్రకటించిన 'అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరం' సరిగ్గా అలాంటి సందర్భమే. మన దేశం చొరవతో ఈ ప్రకటన రావడం సంతోషించదగ్గ విషయం. అదే సమయంలో చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచమే కాదు... ముందుగా మనమెక్కడ ఉన్నామో పర్యాలోచించుకోవాలి. ఆరోగ్య 'సిరి'గా పేరు తెచ్చుకున్న విలువైన పోషకాహారానికి మనం నిజంగానే ఆచరణలో విలువ ఇస్తున్నామా అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. గత నాలుగైదు దశాబ్దాల్లో మన దేశంలో ఈ చిరుధాన్యాల ఉత్పత్తి 2.3 – 2.4 కోట్ల టన్నుల నుంచి 1.9–2 కోట్ల టన్నులకు పడిపోయిందట. ఈ లెక్కలు కొత్త సంవత్సర కర్తవ్యానికి ఓ మేలుకొలుపు.

జనవరి 1 నుంచి చిరుధాన్య వత్సరంగా ఉత్సవం జరుపుకొనేందుకు ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. నిజానికి, 2018లోనే భారత సర్కార్ ఆ ఏడాదిని జాతీయ చిరుధాన్య వత్సరంగా తీర్మానించింది. చిరుధాన్యాలను 'పోషక సంపన్న ఆహారధాన్యాలు'గా అధికారికంగా గుర్తించి, 'పోషణ్ మిషన్ అభియాన్'లో చేర్చింది. ఆపైన 2023ను అంతర్జాతీయ చిరుధాన్య వత్సరమని ప్రకటించాల్సిందిగా ఐరాసకు ప్రతిపాదన పెట్టింది. మరో 72 దేశాలు మద్దతునిచ్చాయి. అలా ఈ పోషక ధాన్యాలను ప్రోత్సహించాలన్న మన చొరవ అంతర్జాతీయ వేదికపై గుర్తింపు తెచ్చుకుంది. చివరకు 2021 మార్చి 5న ఐరాస సర్వప్రతినిధి సభ చిరుధాన్య వత్సర ప్రకటన చేసింది.

ప్రపంచ పటంపై చిరుధాన్యాలను మళ్ళీ తీసుకురావడానికి ఇది భారత్‌కు మంచి అవకాశం. ఈ పోషకధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్, ఆ ధాన్యాల ఉత్పత్తులకు సమర్థమైన మార్కెటింగ్ వసతులు కల్పించడానికి నడుం కట్టాల్సిన తరుణం. ఈ 'సిరి' సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ, భారత జాతీయ వ్యవసాయ సహాయక మార్కెటింగ్ సమాఖ్యలు అక్టోబర్ మొదట్లో అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. ప్రధాని మోదీ సైతం ఆ మధ్య తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లోనూ ఈ పోషకధాన్యాల ఉత్పత్తితో రైతులకూ, వినియోగంతో ప్రజలకూ కలిగే లాభాలను ప్రస్తావించారు. ఇవన్నీ వినడానికి బాగున్నాయి. కానీ, ఆచరణలో ఇంకా వెనకబడే ఉన్నాం.

దేశంలో దాదాపు 80 శాతం మెట్టభూములైనా, 20 శాతం మాగాణితో వచ్చే వరి, గోదుమల పైనే ఇప్పటికీ అర్థరహితమైన మోజు! అదనులో రెండు వర్షాలు కురిస్తే చాలు... ఆట్టే నీటి వసతి అవసరం లేకుండానే మంచి దిగుబడినిచ్చే చిరుధాన్యాలు నిజానికి మన శీతోష్ణాలకు తగినవి. వీటిలోనే పోషకాలు ఎక్కువ. అయినా చిరుధాన్యాల్లో పెద్ద గింజలైన జొన్న, సజ్జ, రాగులన్నా, చిన్న గింజలుండే కొర్రలు, సామలు, ఊదలు, అరికెలు, వరిగెల లాంటివన్నా అటు రైతులకూ, ఇటు వినియోగదారులకూ చిన్నచూపే. పండుగపూట పరమాన్నంలా వరి వండుకొని తినగలిగిన తాతల కాలం నుంచి ఇవాళ నీటిపారుదల ప్రాజెక్టులతో పుష్కలంగా వరి పండించగలగడం పురోగతే. ఆ మోజులో మన ఒంటికీ, వాతావరణానికీ సరిపోయే జొన్నలు, సజ్జల్ని వదిలేయడమే చేస్తున్న తప్పు.

వరి, గోదుమల పంటకాలం 120 – 150 రోజులైతే, సిరి ధాన్యాలు 70–100 రోజుల్లోనే చేతికొస్తాయి. నీటి వసతి ఆట్టే అవసరం లేని వర్షాధారిత మెట్టభూములు, కొండ ప్రాంతాల్లో ఈ ధాన్యాలను ప్రభుత్వం ప్రోత్సహించాలంటున్నది అందుకే. విదేశాంగ మంత్రి అన్నట్టు 'కోవిడ్, యుద్ధ వాతావరణం, పర్యావరణ సమస్యలు' అంతర్జాతీయ ఆహార భద్రతకు సవాలు విసురుతున్న వేళ చిరుధాన్యాల సాగు, వాడకం పట్ల అవగాహన పెంచడం పరిష్కారం. అలా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గండం నుంచి గట్టెక్కించడానికీ ఈ ధాన్యాలే మందు. క్రీ.పూ. 3 వేల నాటి సింధునదీ పరివాహక ప్రజల కాలం నుంచి ఇవే తినేవాళ్ళం. ఇవాళ ప్రపంచంలో అనేక రకాలు ముందు మన దేశంలోవే.

ఇప్పుడు మళ్ళీ ఆ పంటలకు ప్రభుత్వం ఆసరానివ్వాలి. ఈసరికే వాటిని పండిస్తున్న పశ్చిమ రాజస్థాన్, దక్షిణ కర్ణాటక, తూర్పు మధ్యప్రదేశ్‌లలో రైతులకు ప్రోత్సాహకాలివ్వాలి. ఒక నిర్ణీత ప్రాంతాన్ని ఒక నిర్ణీత ధాన్యం సాగుకు కేంద్రంగా మలచడం లాంటివీ చేయవచ్చు. ఆ ప్రాంతీయుల ఆహారంలో ఆ ధాన్యాన్ని అంతర్భాగం చేయగలగాలి. అందుకు ముందుగా ప్రజలకు వీటి వినియోగాన్ని అలవాటు చేయాలి. ఇక, ఫలానా ధాన్యంతో ఫలానా రోగం పోతుందని స్వతంత్ర ఆహార శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ప్రయోగపూర్వకంగా ఏళ్ళకొద్దీ చెబుతున్నాయి. పరిశోధనలతో వాటిని నిరూపించే బాధ్యత ప్రభుత్వానిది. భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ లాంటివి ఆ పని తలకెత్తుకోవాలి. దాని సత్ఫలితాలు మరిందరిని సిరిధాన్యాల వైపు మళ్ళిస్తాయి.

భూతాపం పెరిగిపోతున్న వేళ ఎండలు మండేకొద్దీ దిగుబడి పడిపోయే వరి కన్నా వేడిని తట్టుకొని దిగుబడినిచ్చే చిరుధాన్యాలకు ఓటేయడం వివేకం. ప్రపంచంలో సగం మంది పోషకాహారలోప పీడితులు గనక వారికీ ఈ ధాన్యాలే శ్రీరామరక్ష. ఈ వ్యావసాయిక జీవవైవిధ్యాన్ని కాపాడేలా కేంద్రం 'మిల్లెట్ మిషన్' ప్రకటించింది. కర్ణాటక, ఒరిస్సా లాంటివి అందులో దూసుకుపోతున్నాయి. రేషన్ షాపుల్లో సిరిధాన్యాలను ఇవ్వడం మొదలు దేశంలోని 15 లక్షల స్కూళ్ళు, 14 లక్షల ప్రీస్కూల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ధాన్యాలను మధ్యాహ్న భోజన పథకంలో భాగం చేయగలిగితే భేష్. ఇలాంటి ప్రాథమిక ఆలోచనల్ని పటిష్ఠంగా అమలు చేస్తే– ఆహార భద్రతలో, పోషకాహార విలువల్లో బలమైన భారతావని సాధ్యం. చిరుధాన్య నామ సంవత్సరాలు సార్థకమయ్యేది అప్పుడే!

'సున్నా వడ్డీ'లోనూ వక్రమార్కుడు..

బురదజల్లుడు, అబద్ధాలు అచ్చేయడం, అర్థంపర్థంలేని వార్తలు వండి వార్చడంలో తన రికార్డులను తానే బద్దలుకొట్టుకుంటున్న ఎల్లో జర్నలిస్ట్ రామోజీరావు ఎప్పటిలాగే టీడీపీ వైపు తన చేతివాటాన్ని మరోసారి ప్రదర్శించారు. ఈసారి ఆయన రూటు సాగువైపు మళ్లింది. 'వడ్డీ రాయితీ పెద్ద సున్నా' అంటూ ఆయన తాజాగా అచ్చోసిన అసత్యాల కథనం నిజంగానే నిజాల్ని దాచి వండిన వంటకం. పొగ తాగడం, మద్యం సేవించడం ఆరోగ్యానికి ఎంత హానికరమో ఈనాడు పత్రిక కూడా ఆ పాఠకులకు అంతే హానికరం.



వడ్డీ రాయితీ పెద్ద సున్నా!

- పంట రుణాలపై 'సున్నా వడ్డీ' 20% మందికే
- ఏటా రూ.3వేల కోట్లు చెల్లిస్తామన్న సీఎం.. 2020-21లో ఇచ్చింది రూ.158 కోట్లే
- 2019-20లో రూ.418 కోట్లు విడుదల


ఎందుకంటే..

రాష్ట్రంలో చిన్న, సన్నకారు, వాస్తవ సాగుదారులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా 'వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకానికి' 2019లో శ్రీకారం చుట్టింది. రూ.లక్షలోపు తీసుకున్న పంట రుణాలను ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు మరుసటి సీజన్ రాకముందే వారు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తూ వారికి అండగా నిలుస్తోంది. కానీ, టీడీపీ ఐదేళ్లలో 40.61 లక్షల మందికి కేవలం రూ.685.46 కోట్లు చెల్లిస్తే, గడిచిన 3.5 ఏళ్లలో 73.88 లక్షల మంది వాస్తవ సాగుదారులకు ప్రస్తుత వైఎస్ జగన్ సర్కారు రూ.1,838.61 కోట్లు చెల్లించింది. వీటిలో రూ.1,180.66 కోట్లు టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలే. ఇలా బాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా ఏటా క్రమం తప్పకుండా అర్హతగల ప్రతీ రైతుకు అణా పైసలతో సహా వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంటే చంద్రబాబు అడుగులకు మడుగులొత్తే ఈనాడు రామోజీరావు కళ్లున్న కబోదిలా ప్రవర్తిస్తూ ఆ పత్రికల పాఠకులపై చిమ్ముతున్న విషానికి అంతులేకుండా పోతోంది. నిజానికి.. గతంలో ఇంతపెద్ద ఎత్తున, ఇంత పారదర్శకంగా డీబీటీ విధానంలో నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యేలా వడ్డీ రాయితీ పథకాన్ని అమలుచేసిన దాఖలాల్లేవు. అయినా ఇవేమీ ఎల్లో జర్నల్ అయిన ఈనాడుకు కన్పించవు.

అర్హుల జాబితా ప్రదర్శించినా అక్కసే..

మరోవైపు.. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి మరింత మెరుగులద్ది పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. వడ్డీ రాయితీ చెల్లింపుల్లో జాప్యానికి తావులేకుండా ఉండేందుకు ఏడాదిలోపు రుణం చెల్లించిన లబ్ధిదారుల డేటా బ్యాంకుల ద్వారా ఎస్వీపీఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా ఏర్పాటుచేశారు. ఈ డేటా ఈ–క్రాప్ డేటాతో ధ్రువీకరించి అర్హులైన రైతుల జాబితాను గుర్తించి సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. అంతేకాదు.. మొబైల్ ద్వారా ఎస్వీపీఆర్ (సున్నా వడ్డీ పంట రుణాల) పోర్టల్ https://karshak.ap.gov.in/ysrsvpr/లోకి వెళ్లి హోంపేజీలో 'know your status' అనే విండో ఓపెన్ చేసి తమ ఆధార్ నంబరుతో చెక్ చేసుకునే వెసులుబాటు రైతులకు కల్పించారు. ఒకవేళ ఏడాదిలోగా రూ.లక్షలోపు రుణాలు తిరిగి చెల్లించి వడ్డీ రాయితీకి అర్హత పొంది, జాబితాలో తమ పేర్లు లేకపోతే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కూడా కల్పించారు. ఇలా అర్హత పొందిన రైతుల ఖాతాల్లో వారు చెల్లించిన నాలుగు శాతం వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా జమచేస్తున్నా ఈనాడు తట్టుకోలేకపోతోంది. అంతేకదా.. రామోజీ.

ఏది నిజం?



ఎక్కువమంది లబ్ధి పొందేలా విస్తృత ప్రచారం

ఇక రూ.లక్ష లోపు రుణం సకాలంలో చెల్లించడం ద్వారా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని వడ్డీ భారం నుంచి రైతులు విముక్తి పొందేందుకు వీలుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పిస్తోంది. కరపత్రాలు, వాల్ పోస్టర్లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత నెల 28న రబీ 2020–21, ఖరీఫ్ 2021 సీజన్లలో అర్హత పొందిన 8.22 లక్షల మంది రైతులకు రూ.160.55 కోట్ల వడ్డీ రాయితీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రైతుల పొదుపు ఖాతాలకు జమచేశారు. ఇలా గడిచిన మూడున్నరేళ్లలో పాత బకాయిలు కలిపి 73.88 లక్షల మందికి రూ.1,838.61 కోట్లు చెల్లించారు. పాత బకాయిలకు సంబంధించే కాదు గడిచిన మూడేళ్లకు సంబంధించి కూడా ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేకుండా అర్హుల ఖాతాల్లోకి సున్నా వడ్డీ రాయితీ జమచేశారు.

రూ.1,180.66 కోట్ల బకాయిలు ఈనాడుకు కన్పించవు

కానీ, ఈ పరిస్థితులకు వైఎస్ జగన్ సర్కార్ చెక్ పెట్టింది. వడ్డీ రాయితీని నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ (డీబీటీ) చేసేలా మార్పుచేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకానికి శ్రీకారం చుట్టారు. అంతేకాదు.. టీడీపీ హయాంలోని బకాయిల చెల్లింపునకూ ముందుకొచ్చి రైతులపట్ల తనకున్న చిత్తశుద్ధిని ఆయన చాటుకున్నారు. ఇలా 2014–15లో రూ.3.46 కోట్లు, 2015–16లో రూ.1.91 కోట్లు, 2016–17లో రూ.212.33 కోట్లు, 2017–18లో రూ.345.18 కోట్లు, 2018–19లో రూ.617.78 కోట్లు కలిపి మొత్తం 39.08 లక్షల మంది రైతులకు రూ.1,180.66 కోట్ల బకాయిలను చెల్లించారు. బాబు ఎగ్గొట్టిన ఈ బకాయిలపై 'ఘనత వహించిన' ఈనాడు ఏనాడు దీనిపై వార్త రాసిన పాపానపోలేదు. అలాగే, ఐదేళ్లలో కేవలం 40.61 లక్షల మందికి రూ.685.46 కోట్లే చెల్లిస్తే ఎందుకింత తక్కువ చెల్లించారని కూడా ప్రశ్నించడానికి రామోజీకి పెన్ను పెగలలేదు.

అయినా ఇవన్నీ విస్మరించి ఎందుకు రామోజీ ఈ వయస్సులో అబద్ధాల సాగుకు అంత ఆయాసం..?

టీడీపీ ఐదేళ్లలో వడ్డీలేని పంట రుణాల పథకం కింద చెల్లించిన మొత్తం..

వడ్డీ రాయితీ చెల్లించిన ఏడాది	రైతులు	వడ్డీ రాయితీ (రూ.కోట్లలో)
2014-15	80,558	3.87
2015-16	2,42,344	31.10
2016-17	21,02,228	252.65
2017-18	13,81,952	293.64
2018-19	2,53,675	104.20
మొత్తం	40,60,757	685.46

గత బకాయిలతో సహా ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన వడ్డీ రాయితీ..

సీజన్	రైతుల సంఖ్య (లక్షల్లో)	వడ్డీ రాయితీ (రూ.కోట్లలో)
2014-19 మధ్య బకాయిలు	39.08	1,180.66
ఖరీఫ్-2019 క్లెయిమ్స్	14.26	289.68
రబీ 2019-20, ఖరీఫ్-2020 క్లెయిమ్స్	12.31	207.72
రబీ 2020-21, ఖరీఫ్-2021 క్లెయిమ్స్	8.22	160.55
మొత్తం	73.87	1,838.61

రామోజీ.. అప్పట్లో అప్పలకు జమచేసుకోలేదా?

వాస్తవానికి ప్రతీ సీజన్‌లో వ్యవసాయ అవసరాల కోసం రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుంటారు. రూ.లక్షలోపు రుణాన్ని ఏడాదిలోపు చెల్లిస్తే బ్యాంకులు వసూలుచేసే ఏడు శాతం వడ్డీలో 3 శాతం కేంద్రం రాయితీ ఇస్తుంది. మిగిలిన 4 శాతం రైతులు భరించేవారు. గతంలో 'వడ్డీలేని రుణ పథకం' కింద రైతులు చెల్లించిన వడ్డీ రాయితీని బడ్జెట్ కేటాయింపులను బట్టి ఏడాదికో.. రెండేళ్లకో వీలునుబట్టి బ్యాంకులకు అరకొరగా జమచేసేవారు. ఈ మొత్తం జమకాగానే బ్యాంకులు వెంటనే రైతులు చెల్లించాల్సిన అప్పు ఖాతాలకు సర్దుబాటు చేసేసేవారు. అలాగే, గతంలో క్లెయిమ్స్ డేటాను అప్‌లోడ్ చేయడానికి నోడల్ బ్రాంచీలకు మాత్రమే వీలుండేది. దీంతో ఎంతమంది అర్హత పొందారు.. వారికి ఎంత వడ్డీ రాయితీ జమైందో రైతులకే కాదు.. సంబంధిత బ్యాంకు శాఖలకు కూడా తెలిసేది కాదు. సామాజిక తనిఖీ కోసం బ్యాంకుల వద్ద కానీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానీ జాబితాలు ప్రదర్శించే పరిస్థితులు ఉండేవి కాదు.

బాబోయ్.. ఇదేం ఖర్మరా!

ఏలూరు పర్యటనలో ఆద్యంతం చంద్రబాబు అబద్ధాలు

సాక్షి, అమరావతి: కళ్లార్పకుండా అబద్ధాలు.. నిస్సిగ్గుగా బుకాయింపు! ఏలూరు జిల్లాలో బుధవారం పర్యటించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గోబెల్స్‌ను తలదన్నే రీతిలో అంతులేని అబద్ధాలాడారు. యథాప్రకారం హైదరాబాద్‌ను తానే నిర్మించానని.. సెల్‌ఫోన్‌నూ తానే కనిపెట్టానంటూ గొప్పలు చెప్పుకున్నారు. ఆయన తీరు చూస్తుంటే ఇదేం ఖర్మరా.. అని అంతా అనుకోవాల్సిందే మరి!

1 మేనిఫెస్టో మాయం..

చంద్రబాబు: కేవలం ఆరు పేజీలతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేస్తున్నామంటూ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు చెప్పుకున్న సీఎం జగన్ ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు.

వాస్తవం: అధికారంలోకి వచ్చాక మూడున్నరేళ్లలోనే 98 శాతం హామీలను అమలు చేసి ఎన్నికల మేనిఫెస్టోకు సీఎం జగన్ సిసలైన నిర్వచనం చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకూ రూ.1,77,585.51 కోట్లు అందచేశారు. దేశ చరిత్రలో డీబీటీ రూపంలో ఈ స్థాయిలో పేదల ఖాతాల్లో నిధులు జమ చేయడం ఇదే ప్రథమం. డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో మొత్తం రూ.3,19,227.86 కోట్ల మేర పేదలకు ప్రయోజనం చేకూర్చారు. ఇది పేదరిక నిర్మూలనకు బాటలు వేస్తోందని సామాజికవేత్తలు ప్రశంసిస్తుంటే చంద్రబాబుకు రుచించడం లేదు. 2014 ఎన్నికల్లో వందలకొద్దీ హామీలను గుప్పించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక టీడీపీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను మాయం చేశారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానంటూ నమ్మబలికారు. అసలు రూ.87 వేలు కోట్లు, వడ్డీ రూ.24 వేలు కోట్లు కలిపి మొత్తం రూ.1.11 లక్షల కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా రూ.15 వేల కోట్లు విదిల్చి (అది కూడా సున్నా వడ్డీని ఎగ్గొట్టి) నయ వంచన చేశారు. రూ.14 వేల కోట్ల రుణాలను మాఫీ చేయకుండా డ్వాక్రా మహిళలను దగా

2 ఓ గేటులో 1/4 బిగించి హంగామా

చంద్రబాబు: పోలవరం ప్రాజెక్టుకు గేట్లు పెట్టి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో సహా 72 శాతం పనులు నేనే పూర్తి చేశా...

వాస్తవం: పోలవరం స్పిల్‌వేకు 25.72 మీటర్ల స్థాయిలో 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో 48 గేట్లను అమర్చాలి. వరద నీటిని దిగువకు విడుదల చేయడానికి వీలుగా గేట్లను ఎత్తడానికి, దించడానికి హైడ్రాలిక్ సిలిండర్లు, హాయిస్ట్‌లను అమర్చాలి. చంద్రబాబు హయాంలో పోలవరం స్పిల్‌వే పునాది స్థాయిని కూడా దాటలేదు. స్పిల్‌వేలో 39, 40 పియర్స్ మాత్రమే 32 మీటర్ల స్థాయి వరకు చేశారు. ఆ స్థాయిలో గేట్లను అమర్చడానికి వీలు కాదు. 2018 డిసెంబర్ 24న రెండు పియర్స్ మధ్య నాలుగు స్కిన్ పేట్లను వెల్డింగ్ చేసి (ఇది ఒక గేటులో నాలుగో వంతు) అడ్డుగా నిలిపారు. దీంతో 48 గేట్లు అమర్చినట్లు, ప్రాజెక్టు పూర్తైనట్లు భ్రమ కల్పించారు. చంద్రబాబు అమర్చిన గేటు అనంతరం గాలి ఉద్ధృతికి రెండు పియర్స్ నుంచి కిందకు పడిపోయింది. ప్రాజెక్టు వద్దకు బస్సు యాత్రలతో భజన చేయించుకునేందుకు ఏకంగా రూ.వంద కోట్లు మంచినీళ్లలా ఖర్చు చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక కరోనా తీవ్రతలోనూ, గోదావరి వరద



బాబు డొల్ల మాటలు.. ఇవీ వాస్తవాలు

ఉద్ధృతిలోనూ స్పిల్‌వేను పూర్తి చేసి 48 గేట్లను బిగించారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి వరదను అప్రోచ్ చానల్, స్పిల్‌వే, స్పిల్ ఛానల్ మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. దిగువ కాఫర్ డ్యామ్ పూర్తయ్యే దశకు చేరుకుంది. ఇప్పటివరకూ 12,060 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మొత్తమ్మీద ప్రాజెక్టు పనులు ఇప్పటిదాకా 47.94% పూర్తయ్యాయి.

3 పరిహారం.. ఫలహారం

చంద్రబాబు: న్యాయస్థానాల్లో దాఖలు కేసులను ఉపసంహరించుకునేలా రైతులతో చింతమనేని ప్రభాకర్ ద్వారా చర్చించి పోలవరం కుడి కాలువను పూర్తి చేశా..

వాస్తవం: దివంగత వైఎస్సార్ హయాంలోనే పోలవరం కుడి కాలువ 95% పూర్తైంది. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వారితో భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో కేసులు వేయించి కుడి కాలువ పనులను చంద్రబాబు అడ్డుకున్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక తాను కేసులు వేయించిన రైతులతో చింతమనేని ద్వారా మంతనాలు జరిపి ఎకరానికి గరిష్ఠంగా రూ.69 లక్షల చొప్పున రూ.720 కోట్ల మేర పరిహారాన్ని అందించి చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఆ తర్వాత మిగతా ఐదు శాతం పనులు చేశారు.

4 అవగాహనారాహిత్యంతో..

నాడు కమీషన్లు వచ్చే పనులకే చంద్రబాబు పచ్చ జెండా ఊపారు. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే నదీ గర్భంలో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టి నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక మధ్యలోనే వదిలేశారు. 2019 మే 29 నాటికి పరిస్థితి ఇదీ! 2019 జూన్ రెండో వారంలోనే గోదావరికి వరదలు వచ్చాయి. నదీ గర్భంలో కాఫర్ డ్యామ్‌లు అడ్డంకిగా ఉండటం వల్ల వరద ఉద్ధృతి పెరిగి ఖాళీ ప్రదేశాల గుండా ప్రవహించడంతో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. గత సర్కారు అవగాహనా రాహిత్యం, కమీషన్ల దాహమే పోలవరం పనుల్లో జాప్యానికి మూలకారణం.

బీసీల వెన్నెముక విరిచింది మరిచావా బాబూ..?

చంద్రబాబు: సీఎం జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు అన్యాయం చేశారు. జనాభాలో 50% ఉన్న బీసీలకు పదవులివ్వకుండా సామాజిక అన్యాయం చేశారు. సంక్షేమ పథకాల ద్వారా బీసీలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఈ పథకాలతో ఎంత ప్రయోజనం చేకూర్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా. టీడీపీకి బీసీలే వెన్నెముక.

వాస్తవం: బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదు.. సమాజానికి వెన్నెముకగా అభివృద్ధి చేస్తానని ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 17న ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జనలో ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని రీతిలో 25 మందితో కూడిన మంత్రివర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన పది మందికి స్థానం కల్పించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం లాంటి అత్యంత కీలకమైన శాఖలు అప్పగించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశం కల్పించారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీకి 8 రాజ్యసభ స్థానాలు దక్కితే అందులో 4 సీట్లు బీసీలకే ఇచ్చారు. స్థానిక సంస్థలలో బీసీలకు 33% రిజర్వేషన్లు కల్పించడంపై చంద్రబాబు టీడీపీ నేతలతో హైకోర్టులో సవాల్ చేయడంతో 24 శాతానికి తగ్గిపోయాయి. చంద్రబాబు కుట్ర వల్ల బీసీలకు రిజర్వేషన్లు తగ్గడంతో, గతంలో ఉన్న 33% కంటే ఎక్కువగా అవకాశం ఇస్తానని మాటిచ్చిన సీఎం జగన్ ఆ మేరకు సర్పంచ్‌లు, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ మేయర్లుగా సింహభాగం బీసీ వర్గాల వారినే నియమించారు. బీసీల కోసం శాశ్వత కమిషన్‌ను నియమించారు. బీసీ సామాజిక వర్గాల కోసం 56 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. నామినేటెడ్ పదవుల్లో సింహభాగం ఆ వర్గాలకే ఇచ్చారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో ఇప్పటిదాకా రూ.1,77,585.51 కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయగా ఇందులో బీసీ వర్గాలకే రూ.85,915.06 కోట్లు దక్కాయి. పరిపాలన భాగస్వామ్యం కల్పించడం, ఆర్థికంగా చేయూత, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా బీసీ వర్గాల సామాజిక సాధికారతకు సీఎం జగన్ బాటలు వేశారు.

తోకలు కత్తిరిస్తా.. తాటతీస్తా!

2014లో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తమ హక్కులను పరిరక్షించాలని కోరిన నాయీ బ్రాహ్మణులను తోక కత్తిరిస్తానంటూ బెదిరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థించిన మత్స్యకారులను తాట తీస్తానంటూ హెచ్చరించారు. నాడు చంద్రబాబు 25 మందితో కూడిన తన మంత్రివర్గంలో బీసీలకు ఆరు పదవులు మాత్రమే ఇచ్చారు. 2014–19 మధ్య చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపిన పాపాన పోలేదు.

5 కళ్లాల వద్దే కొనుగోళ్లు కనపడవా?

చంద్రబాబు: ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదు. దళారులతో కలిసి అధికారపార్టీ నేతలు రైతులను దోచుకుంటున్నారు.

వాస్తవం: ఆర్బీకేల ద్వారా కళ్లాల వద్దే రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. మూడున్నరేళ్లలో రూ.48,974 కోట్లతో రైతుల నుంచి 2.62 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం రైతులను దగా చేస్తుంటే చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు.

జీవనాడి జాప్యానికి బాబే కారణం

చంద్రబాబు: ప్రతి సోమవారాన్ని పోలవారంగా పరిగణించి సమీక్ష చేశా. నెలకు ఒకసారి ప్రాజెక్టు వద్దకే వెళ్లి సమీక్షించా. కేంద్రమే నిధులు ఇస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాశనం చేసింది. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడానికి నేనే కారణమంటున్నారు..

వాస్తవం: విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల దాహం, ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ నాడు చంద్రబాబు దక్కించుకున్నారు. 2013-14 ధరల ప్రకారం నిధులు ఇస్తే చాలని ఒప్పుకోవడంతో కేంద్రం రూ.20,398 కోట్లకే పరిమితం చేసింది. 2017-18 ధరల ప్రకారం పోలవరం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లు కాగా భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయమే రూ.33,168 కోట్లు అవుతుంది. ఇదే అంశాన్ని సీఎం జగన్ పలు దఫాలు కేంద్రానికి వివరించి సవరించిన అంచనా వ్యయం ప్రకారం నిధులిచ్చి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరుతూ వస్తున్నారు.

అరకొరగా ఫీజులు.. ఆపై బడాయిలు

చంద్రబాబు: నేను అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చా. సీఎం జగన్ కేవలం 11 లక్షల మందికే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. అదీ తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. విద్యార్థుల తండ్రులు ఆ డబ్బులు తీసుకుని మద్యం తాగుతున్నారు.

వాస్తవం: ఇంజనీరింగ్ కళాశాలలో గరిష్ఠంగా ఫీజు రూ.1.10 లక్షలు ఉంటే చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.35 వేలు మాత్రమే ఇచ్చింది. ఫలితంగా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. రూ.1,700 కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్ డబ్బులను ఎగ్గొట్టడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని చెల్లించి విద్యార్థులను ఆదుకుంది. సీఎం జగన్ అధికారంలోకి చేపట్టాక ఇంజనీరింగ్ సహా వివిధ కోర్సులకు ఎంత ఫీజు ఉంటే అంత ఫీజును ఏటా రెండు వాయిదాలలో రీయింబర్స్‌మెంట్ కింద తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తల్లులు కాలేజీలకు వెళ్లి తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకుని సదుపాయాలు, బోధనలో నాణ్యతను ఆరా తీయాలనే ఉద్దేశంతో వారి ఖాతాల్లో జమ చేస్తుంటే దారుణంగా అవమానించడం చంద్రబాబుకే చెల్లింది.

భారతి సిమెంట్స్‌కు ఎక్సలెన్సీ అవార్డు



మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సునీల్ చపర్‌వాల్

తిరుపతి ఎడ్యుకేషన్: సిమెంట్ రంగంలో పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికి భారతి సిమెంట్స్‌ను ఎక్సలెన్సీ అవార్డు వరించింది. ఎస్వీయూలో సుస్థిర వ్యర్థ నిర్వహణపై ఏర్పాటు చేసిన నాలుగు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా రెండో రోజు రాష్ట్ర విద్యుత్, అటవీ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోన్న సంస్థలకు అవార్డులందించారు. సిమెంట్ రంగంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వీ క్యాట్ గ్రూప్–కల్బుర్గి సిమెంట్ (భారతి సిమెంట్) ప్లాంట్ హెడ్ సునీల్ చపర్‌వాల్‌కు అవార్డును మంత్రి అందజేశారు.

ఏయూ అరుదైన ఘనత

'శోధ్‌గంగ'లో 9వ స్థానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీ మరో అరుదైన ఘనతను సాధించింది. యూనివర్సిటీ పరిధిలో చేసిన పరిశోధనల థీసిస్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో అద్భుత ప్రగతిని కనబరిచింది. శోధ్‌గంగ వెబ్‌సైట్‌లో కేవలం తొమ్మిది నెలల్లోనే 7,635 థీసిస్‌లను అప్‌లోడ్ చేసి 179వ స్థానం నుంచి 9వ స్థానానికి చేరుకుంది. ఏయూలో 1942 నుంచి చేసిన పరిశోధనలకు సంబంధించిన గ్రంథాలను కూడా శోధ్‌గంగలో పొందుపరించింది. తద్వారా విలువైన పరిశోధన పత్రాలు అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలో మరికొన్ని థీసిస్‌లు అప్‌లోడ్ చేయడానికి యూనివర్సిటీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఇదీ శోధ్‌గంగ లక్ష్యం...

దేశవ్యాప్తంగా పరిశోధన జ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉంచడానికి, భవిష్యత్ తరాల పరిశోధకులకు ఉపయుక్తంగా ఉండేందుకు ఇన్‌ఫ్లిబినెట్ సంస్థ శోధ్‌గంగ వెబ్‌సైట్‌ను రూపొందించింది. దేశంలోని 584 విశ్వవిద్యాలయాలు తమ పరిధిలోని పరిశోధన గ్రంథాలను ఎప్పటికప్పుడు దీనిలో పొందుపరుస్తున్నాయి. ఈ వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు 3,98,264 థీసిస్‌లు అప్‌లోడ్ చేశాయి. పరిశోధకులు కోర్సుల వారీగా తమకు అవసరమైన థీసిస్‌లను ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. వీటిని చదువుకోవడంతోపాటు రెఫరెన్స్‌గా కూడా ఉపయోగించుకునే అవకాశం ఉంది.

179 నుంచి 9వ స్థానానికి...

శోధ్‌గంగలో థీసిస్‌ల అప్‌లోడ్‌కు సంబంధించి ఏయూ మార్చి నెలలో 179వ స్థానంలో ఉంది. శోధ్‌గంగ ప్రాధాన్యతను గుర్తించిన ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి గ్రంథాలయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో యూనివర్సిటీలో దశాబ్దాలుగా ఉన్న 7,635 థీసిస్‌లను ఇప్పటివరకు శోధ్‌గంగలో అప్‌లోడ్ చేశారు. దీంతో ప్రస్తుతం తొమ్మిదో స్థానానికి చేరుకుంది. ఏయూ నుంచి అత్యధికంగా ఆర్ట్స్, కామర్స్ కోర్సులకు చెందిన 3,388, సైన్స్ కోర్సులకు చెందిన 2,316, ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించిన 1,270, ఫార్మసీ కోర్సులకు చెందిన 487, న్యాయవిద్యకు చెందిన 174 థీసిస్‌లు అప్‌లోడ్ చేశారు. గతంలో పరిశోధన గ్రంథాలను చేతితో రాసి, టైప్ చేసి సమర్పించేవారు. వీటితోపాటు దశాబ్దాల కిందట చేసిన పరిశోధనల పుస్తకాలను కూడా స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేశారు.



ఏయూలో థీసిస్‌లు భద్రపరిచిన విభాగం

తొలి ఐదు స్థానాల్లో నిలవడమే లక్ష్యం



ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శోధ్‌గంగలో తొలి ఐదు స్థానాల్లో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. యూనివర్సిటీలో జరిగే పరిశోధనల గ్రంథాలను శోధ్‌గంగలో ఉంచడం వల్ల దేశవ్యాప్తంగా పరిశోధకులకు అందుబాటులో ఉంటాయి. నూతన పరిశోధకులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా, మార్గదర్శకంగా నిలుస్తాయి. త్వరలో మరిన్ని థీసిస్‌లు స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేసి అప్‌లోడ్ చేసే దిశగా పనులు కొనసాగుతున్నాయి.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు,
చీఫ్ లైబ్రేరియన్, డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం, ఏయూ

సామాన్య భక్తులకు తగ్గిన నిరీక్షణ

- శ్రీవారి బ్రేక్ దర్శన సమయంలో చేసిన మార్పు అమల్లోకి..

తిరుమల: శ్రీవారి బ్రేక్ దర్శన సమయంలో చేసిన మార్పు గురువారం నుంచి అమలులోకి వచ్చింది. దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకొని.. వారికి త్వరితగతిన దర్శనం కల్పించేందుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. ముందుగా గురువారం ఉదయం 6.30 నుంచి సర్వ దర్శనం భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించింది. ప్రజాప్రతినిధుల సిఫార్సుపై బ్రేక్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు 8 గంటల నుంచి 10 గంటల వరకు అవకాశం కల్పించింది. 10.30 గంటల సమయంలో ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులను దర్శనానికి అనుమతించి, ఆ తర్వాత శ్రీవాణి ట్రస్టు టికెట్లు పొందిన భక్తులకు బ్రేక్ దర్శనం కల్పించారు. నెల పాటు ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసి.. ఫలితాలు చూసిన అనంతరం సమయ మార్పుపై టీటీడీ ఒక నిర్ణయం తీసుకోనుంది. కాగా, రాత్రి నుంచి కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు ఉదయాన్నే త్వరగా స్వామి దర్శనం కల్పించడం కోసం.. బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 8 గంటలకు మార్పు చేసినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొలి రోజు ఉదయాన్నే 8 వేల మంది సామాన్య భక్తులు స్వామిని దర్శించుకున్నారని చెప్పారు. సమయ మార్పు వల్ల రోజూ ఉదయం పూట 2 నుంచి 3 గంటల సమయం లభిస్తుందని, 15 వేల మంది సర్వదర్శనం భక్తులకు దర్శనం కల్పించవచ్చన్నారు. బ్రేక్ దర్శనానికి వచ్చే భక్తులు తిరుపతి నుంచి ఉదయం తిరుమలకు రావచ్చని, తద్వారా తిరుమలలో గదులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు.



ఆలయం వెలుపల జాన్వీ కపూర్

శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని సినీ నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి దర్శించుకున్నారు.

సేవలోనే సంతృప్తి ఉంటుంది

- విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర



స్వాములకు భిక్ష అందిస్తున్న స్వామీజీ

అనంతపురం కల్చరల్: నిస్వార్థంగా చేసే సేవలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని, మానవ సేవే మాధవ సేవగా అందరూ సమాజ హితం కోసం కృషి చేయాలని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతీ అన్నారు. స్వధర్మ వాహిని జైత్రయాత్రలో భాగంగా గురువారం అనంతపురానికి చేరుకున్న స్వామీజీకి వేదపండితులు స్వాగతం పలికారు. అశోక్‌నగర్‌లో హరిహరదేవాలయంలో సాయి ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన అయ్యప్ప మాలధారులకు నిత్య భిక్ష కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించారు. సమీపంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో దేవతామూర్తులకు అర్చనలు చేశారు. ఈ సందర్భంగా సాయి ట్రస్ట్ అధినేత విజయ్‌సాయికుమార్ బృందాన్ని స్వామీజీ అభినందించారు. రాత్రికి శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో స్వామీజీ పీఠ పూజలు, రాజశ్యామల ఆరాధన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి

- డీజీపీకి ఫిర్యాదు చేసిన గన్నవరం ఎమ్మెల్యే వంశీ
- సంకల్ప సిద్ధి స్కాంతో నాకు సంబంధం లేదు
- ఆధారాలుంటే టీడీపీ నేతలు బయటపెట్టాలి
- టీవీ 5, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, ఈనాడుపై పరువు నష్టం దావా వేస్తానని వెల్లడి



డీజీపీకి వినతిపత్రమిస్తున్న వల్లభనేని వంశీ

విజయవాడ స్పోర్ట్స్: సంకల్ప సిద్ధి ఈ కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ స్కాంలో తనకు ప్రమేయం ఉందంటూ అసత్య ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, పచ్చ మీడియా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ డీజీపీని కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ మీడియాతో మాట్లాడుతూ.. 'సంకల్ప సిద్ధి స్కాంలో ఓలుపల్లి రంగా ద్వారా నాకు, మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి సంబంధం ఉందని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ప్రెస్‌మీట్‌లో చెప్పారు. 3 నెలలుగా నేను గన్నవరంలో ఉండటంలేదని, హైదరాబాద్‌లో ఉంటూ రూ.600 కోట్లతో బెంగళూరులో కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టానంటూ నిరాధార ఆరోపణలు చేశారు. ఈ స్కాంలో వందల కోట్లు సంపాదించానంటూ పుకార్లు పుట్టించారు. ఈ అసత్య ప్రచారాన్ని టీవీ 5, ఏబీఎన్ ఛానళ్లు గత నెల 26, 27 తేదీల్లో లైవ్ టెలికాస్ట్‌గా, 27, 28 తేదీల్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు కథనాలుగా ఇచ్చాయి. గతంలోనూ గల్ఫ్‌లో కాసినోలు పెట్టించానని, చీకోటి ప్రవీణ్‌తో సంబంధాలున్నాయని టీడీపీ నేతలు ప్రచారం చేసి నా ప్రతిష్టకు భంగం కలిగించాలని విఫలయత్నం చేశారు. చీకోటి ప్రవీణ్ వ్యవహారంలో నాకు, కొడాలి నానికి ఎలాంటి ప్రమేయం లేదని ఈడీ తేల్చిన తరువాత తోక ముడిచారు. సంకల్ప స్కాంలో నాపై చేసిన ఆరోపణలకు వారి వద్ద ఉన్న ఆధారాలు వెంటనే బయటపెట్టాలి' అని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక అసత్య ప్రచారాలతో ప్రజలను నమ్మించేందుకు పచ్చ మీడియా పని చేస్తోందన్నారు. ఈ కేసులో తన అనుచరులు ఉంటే అరెస్ట్ చేయాలని, సీబీఐ, స్వతంత్ర సంస్థలతో విచారించాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తన ప్రతిష్టకు భంగం కలిగించిన టీవీ5, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, ఈనాడుపై పరువు నష్టం దావా వేస్తానని వెల్లడించారు.

'న్యాయవాదుల' సంఘం తాత్కాలిక కమిటీ

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రస్తుత కార్యవర్గ కాల పరిమితి ముగిసిన నేపథ్యంలో సంఘ కార్యకలాపాల నిర్వహణకు తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి హైకోర్టుకు నివేదించారు. కమిటీలో న్యాయవాదులు పి.శ్రీరఘురాం, వి.వేణుగోపాలరావు, న్యాయవాదులు పి.రాంగోపాల్‌రెడ్డి, పి.శ్రీరాములు నాయుడు, టీఎస్ రాయలు, జీవీ శివాజీ, జి.తుహిన్‌కుమార్ ఉంటారన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు తక్షణమే సంఘం కార్యవర్గ బాధ్యతలు చేపట్టాలని తాత్కాలిక కమిటీని ఆదేశించింది.

క్లుప్తంగా...

ఐసిస్ చీఫ్ హతం

వెంటనే కొత్త సారథిని ప్రకటించిన ఉగ్రసంస్థ

బీరుట్: ప్రపంచానికి పెను సవాలుగా మారిన అంతర్జాతీయ ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్ గ్రూప్(ఐసిస్)కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దాని ప్రస్తుత అధినేత అబూ అల్ హసన్ అల్ హషిమి అల్ ఖురేషి ఇటీవల జరిగిన దాడుల్లో మరణించారని ఐసిస్ అధికార ప్రతినిధి అబూ ఒమర్ అల్ ముహాజిర్ బుధవారం ప్రకటించారు. 'దేవుని శత్రువులతో పోరాడుతూ ఖురేషి మరణించారు' అంటూ ముహాజిర్ అధికారికంగా ఒక ఆడియో సందేశం విడుదలచేశారు. ఏ దేశ సైన్యం, ఎవరు చేసిన దాడుల్లో ఇతను హతమయ్యాడనే వివరాలు ఐసిస్ వెల్లడిచేయలేదు. ఏ రోజు, ఏ ప్రాంతంలో మరణించిందీ పేర్కొనలేదు. ఇరాక్‌కు చెందిన ఖురేషిని తామే చంపేశామని ఏ దేశమూ ఇంతవరకూ ప్రకటించుకోలేదు. సిరియా, ఇరాక్‌లలో భారీ స్థాయిలో దాడులకు తెగబడి ఆ దేశాల్లో మళ్లీ ఇస్లామిక్ రాజ్యస్థాపనకు సంసిద్ధమవుతున్నట్లు ఐసిస్ ప్రకటించుకున్న కొద్దిరోజులకే సంస్థ చీఫ్‌ను కోల్పోవడం గమనార్హం. అయితే, మరో నేతను తమ చీఫ్‌గా ఐసిస్ బుధవారం ప్రకటించింది. ఇకపై అబూ అల్ హుస్సేన్ అల్ హుస్సేనీ అల్ ఖురేషి తమ చీఫ్‌గా ఉంటారని తెలిపింది. 2019 అక్టోబర్‌లో ఐసిస్ వ్యవస్థాపక చీఫ్ అబూ బకర్ అల్ బాగ్దాదీని అమెరికా సేనలు అంతంచేశాక తదుపరి దాడుల్లో అంతమైన అగ్రనేతల్లో ఖురేషి మూడోవాడు.

భద్రతామండలి ప్రెసిడెంట్‌గా భారత్

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితిలోని శక్తివంతమైన భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. 15 దేశాల మండలిలో డిసెంబర్ నెలకు గాను అధ్యక్ష పీఠంపై ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ కొనసాగుతారు. ప్రెసిడెన్సీ సమయంలో చేపట్టాల్సిన ప్రాధాన్యాంశాలపై ఆమె ఇప్పటికే ఐరాస సెక్రటరీ గుటెరస్, జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు కసాబా కరోసితో చర్చలు జరిపారు. 2021 ఆగస్ట్ నెలలో కూడా మండలి అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహించింది. మండలిలో భారత్ రెండేళ్ల పదవీ కాలం ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది.

సుప్రీంకోర్టులో మరోసారి మహిళా ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మరోసారి మహిళా న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఆసీనులైంది. గురువారం జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ బేలా ఎం త్రివేదిల ధర్మాసనాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఏర్పాటు చేశారు. ఈ ధర్మాసనం 10 వైవాహిక బదిలీ, 10 బెయిలు పిటిషన్లు సహా 32 కేసులు విచారించింది. సుప్రీంకోర్టులో 2013లో జస్టిస్ జ్ఞాన సుధా మిశ్ర, జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌లతో కూడిన ధర్మాసనం తదనంతరం 2018లో జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఇందిరాబెనర్జీలతో కూడిన ధర్మాసనాలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టులో జస్టిస్ బీవీ నాగరత్న సహా ముగ్గురు మహిళా న్యాయమూర్తులున్నారు. జస్టిస్ బీవీ నాగరత్న 2027లో ప్రధాన న్యాయమూర్తి కానున్న విషయం విదితమే.

కాంగ్రెస్‌పై మోదీ 4 క్వింటాళ్ల తిట్లు

వడోదర: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మరోసారి విరుచుకుపడ్డారు. మోదీ కాంగ్రెస్‌ను నిత్యం 4 క్వింటాళ్ల తిట్లు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తమ పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీని ప్రధాని ప్రతిరోజూ దూషిస్తున్నారని ఆరోపించారు. తనను ఉద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. గుజరాత్ రాష్ట్రం వడోదర జిల్లా వఘోడియా పట్టణంలో ఖర్గే గురువారం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. పేదవాడినని మోదీ పదేపదే చెప్పుకుంటున్నారని, ఇంకా ఎన్నాళ్లు అదే చెబుతారని ప్రశ్నించారు. 13 ఏళ్లకుపైగా గుజరాత్ ముఖ్యమంత్రిగా, గత ఎనిమిదేళ్లుగా ప్రధానమంత్రిగా పని చేస్తున్న వ్యక్తి పేదవాడు ఎలా అవుతాడని నిలదీశారు. మరి మోదీ పేద అయితే దళితులు, గిరిజనుల పరిస్థితి ఏమిటని అన్నారు. కేవలం సానుభూతి కోసమే 'పేద' నాటకాలు ఆడుతున్నారని ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను తిట్టందే మోదీకి అన్నం అరగదని ఎద్దేవా చేశారు.

పుష్కర్ కేసులో ఢిల్లీ హైకోర్టుకు పోలీసులు

న్యూఢిల్లీ: తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ నేత శశిథరూర్ భార్య సునంద పుష్కర్ హత్యానుమరణం కేసులో థరూర్‌ను విముక్తుడిని చేస్తూ ఢిల్లీ సిటీ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును దాదాపు 15 నెలల తర్వాత ఢిల్లీ పోలీసులు సవాల్ చేశారు. ఆ కోర్టు తీర్పును సమీక్షించాలంటూ గురువారం ఢిల్లీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. దీంతో స్పందన తెలపాలంటూ థరూర్‌ను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడున విచారిస్తామని జడ్జి డీకే శర్మ తెలిపారు. 2014 జనవరి 17న ఢిల్లీలోని విలాసవంత హోటల్ గదిలో సునంద విగతజీవిగా కనిపించిన విషయం తెల్సిందే. ఈ కేసులో నిందితునిగా పేర్కొంటూ భర్త థరూర్‌పై కేసు నమోదై దాదాపు ఏడేళ్లు కేసు విచారణ కొనసాగింది. ఆత్మహత్యకు ఉసిగొల్పారంటూ పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసును ఢిల్లీ పోలీసులు దర్యాప్తుచేశారు. అయితే 2021 ఆగస్టు నెలలో ఢిల్లీ సిటీ ట్రయల్ కోర్టు శశిథరూర్‌ను నిర్దోషిగా పేర్కొంటూ తీర్పు చెప్పింది. దీనిపై ఢిల్లీ పోలీసులు దాదాపు 15 నెలలు మౌనంగా ఉండి తాజాగా గురువారం రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. పిటిషన్ చాలా ఆలస్యమైనందుకు మన్నించాల్సిందిగా ఢిల్లీ పోలీసుల తరఫు అదనపు స్టాండింగ్ కౌన్సిల్ రూపాలీ బంధోపాధ్యాయ కోర్టును కోరారు.

నన్ను అవమానించేందుకు పోటీ పడుతున్నారు

- కమలానికి ఓటేసి వారికి బుద్ధి చెప్పండి
- గుజరాత్ ప్రచార సభల్లో కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు
- అహ్మదాబాద్‌లో 30 కి.మీ.ల భారీ రోడ్‌షో



అహ్మదాబాద్ రోడ్ షోలో ప్రజలకు మోదీ అభివాదం

అహ్మదాబాద్: తనను అనుచిత మాటలతో దూషిస్తూ అవమానించేందుకు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ జరిగిన గురువారం సొంతరాష్ట్రంలో మోదీ సుడిగాలి పర్యటన చేశారు. రెండో దశ పోలింగ్ ఉన్న నియోజకవర్గాల్లో ప్రచార సభల్లో పాల్గొన్నారు. 13 నియోజకవర్గాలను కలుపుతూ నరోడా గ్రామం నుంచి అహ్మదాబాద్ మీదుగా ఏకంగా 30 కిలోమీటర్ల పొడవైన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. 'ఎక్కడ చూసినా మోదీ ఫొటోలే కనిపిస్తున్నాయి. మోదీకి ఏమైనా రావణుడిలా 100 తలలు ఉన్నాయా?' అంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సోమవారం విమర్శించడంపై పంచ్‌మహల్ జిల్లాలోని కలోల్ పట్టణంలో ర్యాలీలో సమాధానమిచ్చారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గేను నేను గౌరవిస్తాను. కానీ పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారమే ఆయన నన్ను ఇష్టమొచ్చినట్లు తిడుతున్నారు. కానీ కాంగ్రెస్ వాళ్లకు తెలీదనుకుంటా. గుజరాత్‌లో రావణాసురులు ఉండబోరు. ఈ రాష్ట్రం రామభక్తులకు నెలవు. రాముడు ఉన్నాడని ఏనాడూ ఒప్పుకోని వారు(కాంగ్రెస్ నేతలు) ఇప్పుడు రావణాసురుని ప్రస్తావన తెస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు నన్ను దూషించినందుకు వాళ్లెవరూ ఇంతవరకు పశ్చాత్తాపం చెందలేదు సరికదా కనీసం క్షమాపణ చెప్పలేదు. ఇప్పుడు ఏకంగా నన్ను తిట్టేందుకు పోటీలు పడుతున్నారు. దేశ ప్రధానిని దూషణలతో అవమానించడం వారి హక్కుగా భావిస్తున్నారు' అని అన్నారు. 'కాంగ్రెస్ కార్యకర్తలకు గాంధీల కుటుంబమే సర్వస్వం. వారికి దేశ ప్రజాస్వామ్యం పట్టదు. నన్ను అవహేళన చేయడమే పని. కుక్క చావు చస్తానని, హిట్లర్‌లా ఆత్మహత్య చేసుకుంటానని శాపనార్థాలు పెట్టారు. అవకాశమొస్తే చంపేస్తానని ఇంకొకరన్నారు. ఇంతలా దూషించడం గుజరాత్ ప్రజలను అవమానించడమే. ఎందుకంటే ఈ గడ్డ మీద గుజరాతీయుల మద్దతుతోనే ఇంతవాడినయ్యాను. కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలంటే ఒక్కటే మార్గం. డిసెంబర్ ఐదున ఈవీఎంలో కమలం గుర్తుకు ఓటేసి ఆ పార్టీకి బుద్ధి చెప్పండి. బురదలోకి ఎంతగా అణగతొక్కినా కమలం మళ్లీ స్వచ్ఛంగా పెద్దగా వికసిస్తుంది' అని మోదీ వ్యాఖ్యానించారు.

గరీబీ హఠావో అన్నా పేదరికం పెరిగింది

'కాంగ్రెస్ పార్టీ నినాదాలు ఇస్తుంది. కానీ ఆ నినాదానికి తగ్గట్లు నిర్మాణాత్మక కార్యాచరణ అస్సలు అమలుచేయదు. గతంలో గరీబీ హఠావో అన్నారు. కానీ పేదరిక నిర్మూలనకు చేసిందేమీ లేదు. అందుకే వారి హయాంలో పేదరికం పెరిగింది. వారు నినాదాలు మాత్రమే ఇస్తారు. జనాన్ని మభ్యపెడతారు. మా హయాంలోనే బ్యాంకుల జాతీయీకరణ జరిగిందంటారు. కానీ పేదలు కనీసం సొంతంగా బ్యాంక్ ఖాతాలు తెరవలేకపోయారు' అని మోదీ విమర్శించారు.

నిర్ణయాత్మకంగా జీ20 ఎజెండా

- ప్రపంచ దేశాలను ఏకం చేసేందుకు కృషి చేస్తాం: ప్రధాని మోదీ
- భారత్ 'జీ–20' అధ్యక్ష బాధ్యతలు ప్రారంభం



ఢిల్లీలోని కుతుబ్ మినార్‌కు విద్యుత్ కాంతులు.. జీ20 శిఖరాగ్రం 2023 లోగో

న్యూఢిల్లీ/వాషింగ్టన్: ప్రపంచంలో శక్తివంతమైన జీ–20(గ్రూప్–20) అధ్యక్ష బాధ్యతలను భారత్ గురువారం లాంఛనంగా చేపట్టింది. ఏడాది పాటు ఈ బాధ్యతలను నిర్వర్తించనుంది. జీ–20 అధినేతగా భారతదేశ లక్ష్యాలను వివరిస్తూ ప్రధాని మోదీ తాజాగా పత్రికలు, వెబ్‌సైట్‌లో ఒక ఆర్టికల్(వ్యాసం) విడుదల చేశారు. పలు ట్వీట్లు చేశారు. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' స్ఫూర్తితో ప్రపంచదేశాలను ఏకం చేసేందుకు కృషి చేస్తామని ఉద్ఘాటించారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి వంటివి నేడు మానవళికి అతిపెద్ద సవాళ్లుగా మారాయని, అందరం కలిసికట్టుగా వాటిని ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ప్రపంచంలో కొన్ని దేశాల కంఠశోషను ఎవరూ వినిపించుకోవడం లేదని ఆక్షేపించారు. జీ–20 దేశాలతోపాటు.. నిర్లక్ష్యానికి గురైన దేశాలను కూడా కలుపుకొని ముందుకెళ్తామని, అందరితో చర్చించి, తమ జీ–20 ప్రాధాన్యతలను నిర్ణయించుకుంటామని వివరించారు.

పాత ఆలోచనా ధోరణికి స్వస్తి

'మానవ కేంద్రీకృత ప్రపంచీకరణ'కు సంబంధించిన ఒక కొత్త నమూనా కోసం ప్రపంచ దేశాల ప్రజలంతా చేతులు కలిపి, ఉమ్మడిగా కృషి చేయాలని సూచించారు. ప్రపంచ దేశాల నడుమ ఆహారం, ఎరువులు, ఔషధ ఉత్పత్తుల సరఫరాను రాజకీయ కోణంలో చూడొద్దని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో మొత్తం మానవళికి మేలు కలిగేలా మన ఆలోచనా విధానం(మైండ్‌సైట్) మార్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కొరతకు, సంఘర్షణలకు కారణమయ్యే పాత ఆలోచనా ధోరణికి స్వస్తి పలకాలని చెప్పారు. కలిసికట్టుగా ఉంటూ, సవాళ్లను ఎదిరించడానికి గాను మన ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచి స్ఫూర్తిని పొందడానికి ఇదే సరైన సమయమని వివరించారు.


మనకు యుద్ధం అక్కర్లేదు

మొత్తం మానవ జాతికి కనీస అవసరాలను తీర్చగలిగే ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురాగల మార్గాలు ప్రపంచంలో ఉన్నాయని, మనుగడ కోసం ఒకరిపై ఒకరు పోరాటం చేయాల్సిన అవసరం లేదని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రస్తుతం మనకు యుద్ధం ఎంతమాత్రం అవసరం లేదని వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాల భద్రమైన జీవితాల కోసం సామూహిక జనన హనన ఆయుధాల నిర్మూలన దిశగా శక్తివంతమైన దేశాల నడుమ చర్చలకు చొరవ చూపుతామని వెల్లడించారు. ప్రపంచ శాంతి, రక్షణ కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తామన్నారు.

భారత్‌తో కలిసి నడుస్తాం: అమెరికా

జీ–20 కూటమి అధ్యక్ష హోదాలో ఉన్న భారత్‌కు మద్దతు ఇవ్వడానికి, కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అగ్రరాజ్యం అమెరికా పేర్కొంది. ఆహారం, ఇంధన భద్రత వంటి పెనుసవాళ్లను పరిష్కరించే విషయంలో భారత్‌తో కలిసి నడవాలని అమెరికా నిర్ణయించుకున్నట్లు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కెరైన్ జీన్–పియర్రీ చెప్పారు. జీ–20 దేశాల అధినేత శిఖరాగ్ర సదస్సు 2023 సెప్టెంబర్ 9, 10న ఇండియా రాజధాని ఢిల్లీలో జరుగనుంది.

గుజరాత్ తొలి దశలో 60% ఓటింగ్!



తొలి దశ ఎన్నికలు జరిగిన జిల్లాలు

అహ్మదాబాద్: గుజరాత్ శాసనసభ తొలి దశ ఎన్నికల్లో గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి సగటున 60.23 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను చేర్చలేదన్నారు. ఇంకా కొన్ని పోలింగ్ కేంద్రాల నుంచి సమాచారం అందలేదని పేర్కొన్నారు. తొలి దశలో భాగంగా సౌరాష్ట్ర–కచ్ ప్రాంతంలో 89 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. వివిధ పార్టీల నుంచి మొత్తం 788 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రారంభమయ్యింది. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 5 గంటల కంటే ముందు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని, వరుసల్లో నిల్చున్నవారికి ఆ తర్వాత కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని అధికారులు వెల్లడించారు. కొన్నిచోట్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) మొరాయించడంతో ఎన్నికల సిబ్బంది వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకల్లా అత్యధికంగా తాపీ జిల్లాలో 72.32 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఆ తర్వాత నర్మదా జిల్లాలో 68.09 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. తొలి దశ ఎన్నికల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్, రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నత్వానీ తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో దశ ఎన్నికలు 5న జరుగనున్నాయి. ఈ నెల 8న ఓట్ల లెక్కింపు చేపడతారు.

గ్యాస్ సిలిండర్లతో పోలింగ్ కేంద్రాలకు

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై గుజరాత్ ఓటర్లు తమదైన శైలిలో నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్లను మోసుకుంటూ పోలింగ్ స్టేషన్లకు తరలివచ్చారు. సురాత్‌కు చెందిన జాస్మిన్ మర్చంట్ వరచ్ఛా రోడ్ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ స్టేషన్‌కు సిలిండర్‌తో వచ్చాడు. 'వంట గ్యాస్ సిలిండర్ రాత్రి నాకు కలలో కనిపించింది. తనకు కూడా ఓటేయాలనుందని చెప్పింది. అందుకే తీసుకొచ్చా'అని అతడు వ్యంగ్యంగా అన్నాడు. పశుపోషణ ప్రధాన వృత్తిగా ఉన్న మాల్దారీ వర్గానికి చెందిన రంజిత్ ముంధ్వా తన ఆవు, దూడను తోలుకుని రాజ్‌కోట్(దక్షిణ) నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. లంపీ వైరస్ కారణంగా కలిగిన నష్టాన్ని వివరించడమే తన ఉద్దేశమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పరేశ్ ధనాని కూడా తన కూతురితో కలిసి వేర్వేరు సైకిళ్లపై సిలిండర్లతో అమ్రేలీ పోలింగ్ బూత్‌కు వచ్చారు. బీజేపీని ఓడించి పెరిగిపోయిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతికి అంతం పలకాలని ఆయన కోరారు. రాజ్‌కోట్ వెస్ట్ ఆప్ అభ్యర్థి దినేశ్ జోషి సిలిండర్, వంటనూనె డబ్బాతో పోలింగ్ స్టేషన్‌కు వచ్చారు.

ఒక్క ఓటర్ కోసం పోలింగ్ బూత్

గిర్ సోమనాథ్ జిల్లాలోని ఓ పోలింగ్ బూత్‌లో 100 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఉనా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మారుమూల అటవీ ప్రాంతంలోని బనేజ్ గ్రామంలో మహంత్ హరిదాస్‌జీ ఉదాసిన్ అనే ఒకేఒక్క ఓటర్ ఉన్నాడు. అతడి కోసం పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా, ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

జిల్లాల వారీగా ఓట్ల శాతం	
తాపీ	72.32
నర్మదా	68.09
నవ్‌సారి	65.91
డాంగ్	64.84
వల్సాద్	62.46
గిర్ సోమనాథ్	60.46
భావ్‌నగర్	51.34

- మిగతా జిల్లాల వివరాలు అందాల్సి ఉంది

తొలిదశలో గురువారం ఓటింగ్ జరిగిన జిల్లాల్లో 2017లో ఏ పార్టీకెన్ని సీట్లు వచ్చాయంటే...

జిల్లా	బీజేపీ	కాంగ్రెస్
కచ్	4	2
సురేందర్‌నగర్	1	4
మోర్బీ	0	3
రాజ్‌కోట్	6	2
జామ్‌నగర్	2	3
దేవభూమి ద్వారక	1	1
జునాగఢ్	1	4
గిర్‌సోమ్‌నాథ్	0	4
అమ్రేలి	0	5
భావ్‌నగర్	6	1
బొటాడ్	1	1
నర్మద	0	2
బరూచ్	3	2
సూరత్	15	1
తాపి	0	2
డాంగ్	0	1
నవ్‌సారి	3	1
వల్సాద్	4	1
పోర్‌బందర్	1	1 (ఇతరులు)

ఆ ఆవాల వెనుక బలమైన కారణం ఉందా?

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: జన్యుమార్పిడి చేసిన(జీఎం) ఆవాలను (హైబ్రిడ్ డీఎంహెచ్–11) మార్కెట్‌లో విడుదల చేయడం వెనుక బలమైన కారణం ఏమైనా ఉందా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో జన్యుమార్పిడి విత్తనాలపై నిషేధం విధించాలని కోరుతూ సామాజిక కార్యకర్త అరుణా రోడ్రిగ్స్, 'జీన్ క్యాంపెయిన్' అనే ఎన్జీవో దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. జన్యుమార్పిడి విత్తనాల గురించి మన దేశంలో రైతులకు పెద్దగా అవగాహన లేదని గుర్తుచేసింది. ఇలాంటి విత్తనాలతో నష్టాలు ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదనలు వినిపించారు. జన్యుమార్పిడి పంటలను సామాజిక కార్యకర్తలు, కొందరు నిపుణులు సిద్ధాంతపరమైన కారణాలతో వ్యతిరేకిస్తున్నారని, శాస్త్రీయ, హేతుబద్ధతతో కూడిన కారణాలతో కాదని చెప్పారు. అనంతరం తదుపరి విచారణను డిసెంబర్ 7వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. డీఎంహెచ్–11 ఆవాలను సెంటర్ ఫర్ జెనెటిక్ మ్యానిప్యులేషన్ ఆఫ్ క్రాప్ ప్లాంట్స్ అభివృద్ధి చేసింది.

వీడియోలు, గేమింగ్, సోషల్‌మీడియా

- మా పిల్లలు వీటికి అతుక్కుపోయారు
- పట్టణాల్లోని తల్లిదండ్రుల ఆవేదన



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఆటలు, సామాజిక మాధ్యమాలు, వీడియోల వ్యసనం పిల్లలకు బాగా ఎక్కువైందని పట్టణప్రాంతాల్లోని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆన్‌లైన్ వేదికగా సర్వేలు నిర్వహించే 'లోకల్‌సర్కిల్స్' సంస్థ చేపట్టిన ఓ సర్వేలో ఇలాంటి పలు అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది జనవరి–నవంబర్ కాలంలో దేశవ్యాప్తంగా 287 జిల్లాల్లో ఈ సర్వే నిర్వహించారు. సర్వే ఫలితాల ప్రకారం..

- తమ 9–17 ఏళ్ల వయసు పిల్లలు గేమింగ్, వీడియోలు, సోషల్‌మీడియాకు అతుక్కుపోయారని పట్టణ ప్రాంతాల్లోని తల్లిదండ్రుల్లో దాదాపు 40 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- తమ 13–17 వయసు పిల్లలు రోజూ సగటున 3 గంటలకుపైగా ఇదే పనిలో ఉంటున్నారని 62 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు
- 9–13 వయసు చిన్నారులు రోజూ కనీసం మూడు గంటలు సోషల్ మీడియా, వీడియోలు, గేమింగ్‌తోనూ గడుపుతున్నట్లు 49 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు
- సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ ఖాతాలు ఓపెన్ చేయాలంటే కనీసం 13 ఏళ్లు వయసుండాలని ఆయా సంస్థలు చెబుతున్నాయి. కానీ, 13 ఏళ్లలోపే అంటే 9–13 ఏళ్ల తమ పిల్లలు వీటిని చూస్తున్నారని 47 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు
- పట్టణప్రాంతాల్లోని 13–17 వయసు పిల్లల్లో ఈ సంస్కృతి మరీ ఎక్కువ ఉందని 44 శాతం మంది పేరెంట్స్ అభిప్రాయపడ్డారు
- సోషల్‌మీడియా ఖాతా తెరిచేందుకు కనీస వయసును 13 ఏళ్లకు బదులు 15 ఏళ్లుగా సవరించాలని 68 శాతం మంది తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.
- ఆన్‌లైన్ తరగతులు, కొత్త విషయాలను నేర్చుకోవడంతోపాటు వినోదం కోసం కోవిడ్ తర్వాత ఇంటర్నెట్‌ను వాడుతున్న పట్టణప్రాంత చిన్నారుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది.

ఎవరి దశ తిరుగుతుంది?





గుజరాత్ మొదటి దశ పోలింగ్ ముగిసింది. రెండో దశలో ప్రచారం ఉధృతంగా సాగుతోంది. గుజరాత్ మోడల్ పాలనతో సెంట్రల్ గుజరాత్ అభివృద్ధిలో దూసుకుపోయింది. అధికార పార్టీకి అడ్డాగా మారింది. ఉత్తర గుజరాత్ పలు రకాల సమస్యలతో బీజేపీకి సవాళ్లు విసురుతోంది. మధ్య గుజరాత్‌లో కాంగ్రెస్ హవా తగ్గిపోతే, ఉత్తరాన ఆప్ ఎక్కడా కనిపించడం లేదు. దీంతో రెండు ప్రాంతాల్లోనూ రెండు పార్టీల మధ్యే పోరు నెలకొంది. ఈ దశలో ఏ పార్టీ పట్టు బిగిస్తుంది?

గుజరాత్ రెండో దశ పోలింగ్ ఈ నెల 5న మొత్తం 93 స్థానాలకు జరగనుంది. మధ్య గుజరాత్‌లో 61 అసెంబ్లీ స్థానాలకు, ఉత్తర గుజరాత్‌లో 32 సీట్లకు పోలింగ్ జరుగుతుంది. మధ్య గుజరాత్‌లో ఆదివాసీలు, నగరీకరణ జరిగిన ప్రాంతాలతో నిండి ఉంది. మొత్తం ఎనిమిది జిల్లాల్లో అహ్మదాబాద్, వడోదరా, ఖేదాలో కొన్ని ప్రాంతాలు, ఎస్టీల ప్రాబల్యం కలిగిన పంచ్‌మహల్ జిల్లాల్లో బీజేపీకి పట్టు ఉంటే, మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతోంది.

ఎస్టీ ప్రాంతాల్లో ఎదురొడ్డుతున్న కాంగ్రెస్

గిరిజన ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉంది.ఈ సారి ఎన్నికలకి కాస్త ముందు కాంగ్రెస్‌లో ప్రముఖ ఎస్టీ నాయకుడు, ఛోటా ఉదేపూర్ నియోజకవర్గం నుంచి 10సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్‌సిన్హ్ రథ్వా బీజేపీలో చేరడం ఆ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగా మారింది. మోహన్ సిన్హాకున్న మంచిపేరు వల్ల మహిసాగర్, దాహోద్ జిల్లాల్లో ఓటర్లు బీజేపీకి మద్దతుగా ఉండే అవకాశాలున్నాయని బరోడా యూనివర్సిటీ ప్రొఫెసర్ అమిత్ ధోలకియా అభిప్రాయపడ్డారు. ఇక కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్న క్షత్రియ, హరిజన, ఆదివాసీ, ముస్లిం (ఖామ్) సామాజిక వర్గం ఓట్లు కూడా ఈ సారి గంపగుత్తగా ఆ పార్టీకి వచ్చే అవకాశాల్లేవని, ఆ వర్గాల్లో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకుడు రవీంద్ర త్రివేది వ్యాఖ్యానించారు.ఈ ప్రాంతంలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఆప్ వైపే ఓటర్లు చూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గుజరాత్ మోడల్ పాలనతో బాగా లబ్ధి పొందిన పట్టణాలు, నగరాల్లో బీజేపీ ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదు. ముస్లిం ఓట్లు కాంగ్రెస్, ఆప్ మధ్య చీలి బీజేపీ లాభపడే అవకాశాలైతే ఉన్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లో కాంగ్రెస్ కంటే ఆప్ పట్టు పెంచుకుంది. మొత్తమ్మీద మధ్య గుజరాత్ మరోసారి బీజేపీకే జై కొట్టే అవకాశాలున్నాయి.

ఉత్తరాన బీజేపీకి సవాళ్లు

ఈ ప్రాంతంలో చిన్ని చిన్న పట్టణాలు ఎక్కువగా ఉన్నాయి. చిరు వ్యాపారులు కరోనాతో భారీగా నష్టపోవడంతో పాటు నిరుద్యోగం అమాంతంగా పెరిగిపోయింది. అధిక ధరలతో సామాన్యులకు బతుకు భారంగా మారింది. ఇవన్నీ బీజేపీకి సవాళ్లుగా మారాయి. ఈ ప్రాంతంలో సామాజిక సమీకరణలు కూడా బీజేపీకి అంతగా అనుకూలంగా లేవు. ఠాకూర్ల ప్రాబల్యం అధికం. వీరంతా మొదట్నుంచి కాంగ్రెస్‌కే మద్దతుగా ఉన్నారు. పటేళ్లు, ఠాకూర్లు చెరో పార్టీకి మద్దతునివ్వడం ఆనవాయితీగా మారిపోయింది. దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతుల వారు మొదట్నుంచి బీజేపీ వెంట లేకపోవడం పార్టీకి ఆందోళన కలిగించే అంశమే. ఈ ప్రాంతం ఉద్యమాల ఖిల్లాగా కూడా పేరు పడింది. హార్దిక్ పటేల్ నేతృత్వంలో పటీదార్ ఆందోళన, అల్పేశ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఠాకూర్ల ఆందోళన, జిగ్నేష్ మేవానీ నేతృత్వంలో దళితుల ఆందోళనలు ఇక్కడ ఉధృతంగా జరిగాయి. అధికార పార్టీపై ఆ ఉద్యమాల ప్రభావం ఇంకా ఉండడం కమలనాథుల్ని కలవరపెడుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

రెండో దశలో సీట్లు			93
మధ్య గుజరాత్ స్థానాలు			61
ఎన్నికలు	బీజేపీ	కాంగ్రెస్	స్వతంత్రులు
2017	37	22	2
ఉత్తర గుజరాత్ స్థానాలు			32
ఎన్నికలు	బీజేపీ	కాంగ్రెస్	స్వతంత్రులు
2017	14	17	1

లవ్ జిహాద్‌ను వ్యతిరేకిస్తూ వీహెచ్‌పీ పోరు

దేశవ్యాప్తంగా జనచేతన కార్యక్రమం

న్యూఢిల్లీ: అక్రమ మతమార్పిడి, లవ్ జిహాద్‌లను తీవ్రంగా ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) కొత్త ప్రజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అనైతిక మత మార్పిడి, లవ్ జిహాద్‌లను అంతం చేసేందుకు మహిళలు, అమ్మాయిలు, యువతతో 'శక్తివంత సేన' ఏర్పాటే లక్ష్యంగా నెల రోజులపాటు దేశవ్యాప్తంగా 'జన్ జాగ్రణ్ అభియాన్' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. ఇందులోభాగంగా వీహెచ్‌పీ యువజన విభాగమైన బజ్‌రంగ్ దళ్ పదో తేదీ దాకా బ్లాక్ స్థాయిలో 'శౌర్య యాత్ర' కొనసాగించనుందని వీహెచ్‌పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ చెప్పారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో డిసెంబర్ 21 నుంచి 31 దాకా ధర్మ రక్షా అభియాన్ నిర్వహిస్తారు. మతమార్పిడి వలలో పడకుండా అవగాహన కల్పించేందుకు వీహెచ్‌పీ మహిళా విభాగం దుర్గావాహిని సైతం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా జైన్ మాట్లాడారు. అక్రమ మతమార్పిడిని నిరోధించేలా కేంద్రం చట్టం తెచ్చేలా మద్దతు కూడగట్టేందుకు ఈ కార్యక్రమాన్ని వీహెచ్‌పీ ఉపయోగించుకోనుంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 2 । డిసెంబర్ । 2022



ఏకమవుదాం.. అంతం చేద్దాం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గాంధీనగర్ ఏలూరు లాకుల సెంటర్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పీడీ జీఎస్ నవీన్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. సమాజ భాగస్వామ్యంతో ఎయిడ్స్ మహమ్మారిని అంతం చేద్దాం అంటూ నినదించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

-8లో▸

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో సినీ నటుడు తనికెళ్ల భరణి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సినీ నటుడు తనికెళ్ల భరణి గురువారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.

5న బాస్కెట్‌బాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ మహిళల పోటీలను ఈ నెల ఐదో తేదీన విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీలో నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ జసింత క్వాడ్రస్ తెలిపారు. ఆసక్తి ఉన్న ఆయా కళాశాలల క్రీడాకారులు తగిన ఆధారాలతో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు క్రీడా ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. పోటీల అనంతరం యూనివర్సిటీ జట్టును ఎంపిక చేస్తామన్నారు.

డిసెంబర్ నెలాఖరుకు తుది ఓటర్ల జాబితా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని, డిసెంబర్ నెలాఖరుకు తుది జాబితా ప్రకటిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో ముసాయిదా ఓటర్ల జాబితాపై సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 9వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించామన్నారు. ఈ జాబితాపై 14,789 అభ్యంతరాలు వచ్చాయని, వీటిలో 367 పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె. మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నుంచి జరగనున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ సీవీ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్ష పత్రం ద్వారానే ఎఫ్‌ఏ-2 పరీక్షలు జరుగుతాయన్నారు. ఫార్మాటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు పరీక్షలు, క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంలో ఓఎంఆర్ ద్వారా పరీక్షలు జరిగాయని, ప్రస్తుతం పాత విధానంలో నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లాలో 3.11 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షల షెడ్యూల్‌ను పాఠశాలలకు పంపినట్లు చెప్పారు. పరీక్ష పేపర్లు ఏరోజుకారోజు డీవైఈవోలు, ఎంఈవోల నుంచి మెయిల్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు చేరతాయన్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు.

కర్ర తిప్పి.. పతకం పట్టి..

కర్రసాముపై చిన్నారుల్లో పెరుగుతున్న ఆసక్తి
- పూర్వ వైభవం దిశగా ప్రాచీన యుద్ధ కళ
- ఆత్మరక్షణతో పాటు ఫిట్‌నెస్ కోసం ప్రయత్నం
- ప్రత్యేక శిక్షణతో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కర్రసాములో శిక్షణ పొందుతున్న చిన్నారులు

విజయవాడ స్పోర్ట్స్: ప్రాచీన యుద్ధ కళ కర్రసాము (సిలంబం)కు పూర్వవైభవం వస్తోంది. విజయవాడ నగరానికి చెందిన చిన్నారులు కర్రసాములో నిష్ణాతులై, క్రీడా వేదికలపై సత్తా చాటుతున్నారు. నిరంతర సాధనతో జాతీయ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. అంతరించిపోతున్న కళల జాబితాలో చేరిన విద్యను తాజాగా వెలుగులోకి తీసుకొస్తున్నారు.

విశిష్ట చరిత్ర..

క్రీస్తుకు పూర్వమే ఈ కర్రసాము విద్య పుట్టింది. అప్పటి జీవన విధానం, అందుబాటులోని వనరుల ఆధారంగా శత్రువులపై పైచేయి సాధించేందుకు తమిళనాడులో గాడ్ మురుగన్ సంప్రదాయ కర్రసామును ప్రపంచానికి పరిచయం చేశారు. తమిళంలో దీనిని 'సిలంబం' అని, తెలుగులో 'తాలింకానా' అని పిలిచేవారని చరిత్ర చెబుతోంది. కర్రలతో చేసే సాధనం కావడంతో కొన్నేళ్ల తరువాత 'కర్రసాము'గా తెలుగులో ప్రసిద్ధి కెక్కింది. కాలక్రమేణా కర్రసాము యుద్ధ ప్రాముఖ్యత తగ్గిపోయినా నేటికీ ఈ కళ కొన్ని గ్రామాల్లో సజీవంగానే ఉంది. అయితే నగర యువతకు ఈ విద్య గురించి పూర్తిగా అవగాహన ఉండదనేది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే కర్రసాము ఔన్నత్యాన్ని నగర యువతకు చాటేందుకు 'సంప్రదాయ కర్రసాము(ట్రెడిషనల్ సిలంబం)' పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. కర్రసాము సాధనతో ఆత్మరక్షణతో పాటు అధిక బరువు తగ్గడానికి, మడమలు, కీళ్ల, ఎముకల పటుత్వానికి, రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు, ఏకాగ్రత పెంచేందుకు ఉపయోగపడుతుందని కోచ్‌లు వివరిస్తున్నారు.

తొమ్మిది విభాగాల్లో పోటీలు..

ట్రెడిషనల్ సిలంబం పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్, స్వార్డ్, స్పియర్, సురుల్వార్, డీర్‌ఆరమ్స్, మ్యాన్ టు మ్యాన్, డ్యూయల్ ఈవెంట్, గ్రూప్ ఈవెంట్‌లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో మ్యాన్ టు మ్యాన్ విభాగంలో ఎదురెదురుగా ఇద్దరు యుద్ధం చేసినట్లు పోటీ పడతారు. మిగిలిన విభాగాలు కేవలం ప్రదర్శన మాదిరిగానే పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు 6 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేసిన కోర్టులో 70 సెకన్లలో ప్రదర్శన ముగించాల్సి ఉంటుంది. కర్ర తిప్పే స్పీడ్, స్టయిల్, సౌండ్, స్కిల్ ఆధారంగా మార్కులు వేస్తారు. వ్యక్తి శరీరానికి లేదా నేలకు కర్ర తాకితే నెగిటివ్ మార్కులు ఉంటాయి.



కర్రసాము చేసి చూపిస్తున్న చిన్నారి

జాతీయ క్రీడా వేదికపై..

చెన్నైలో గత నెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి ట్రెడిషనల్ సిలంబం పోటీల్లో విజయవాడకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-12 విభాగంలో ఎం.హియాజైన్ స్వర్ణం(డబుల్‌స్టిక్), ఎస్.యశస్వి స్వర్ణం(సింగిల్‌స్టిక్), కె.రిషికేష్ కాంస్యం(సింగిల్‌స్టిక్), అండర్-14 విభాగంలో జి.ఆరుష్ రజతం(సింగిల్ స్టిక్), అండర్-10 విభాగంలో ఎస్.క్యాష్ రజతం(సింగిల్‌స్టిక్), పి.శ్రీకారుణ్య రజతం(డబుల్‌స్టిక్), అండర్-8 విభాగంలో బి.మేఘనా రజతం(సింగిల్‌స్టిక్), కారుణ్య కాంస్య(సింగిల్‌స్టిక్) పతకాలు సాధించారు.

రెండు చోట్ల శిక్షణ కేంద్రాలు..

విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, యనమలకుదురులోని కృష్ణానది వద్ద ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో సుమారు 200 మంది చిన్నారులు కర్రసాములో శిక్షణ తీసుకుంటున్నట్లు కోచ్‌లు చెబుతున్నారు.

అంతర్జాతీయ పతకాలు సాధిస్తాం..



ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రాతినిధ్యం వహించాయి. మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రతి క్రీడాకారుడు పతకం సాధించాడు. రానున్న రోజుల్లో జరిగే ప్రపంచ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించేందుకు క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నాం.

– కె.సత్యశ్రీకాంత్, కోచ్

వచ్చే ఏడాది నుంచి స్కూల్ గేమ్స్‌లో..



సంప్రదాయ కర్రసాము క్రీడకు గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది (2023) స్కూల్ గేమ్స్‌లో చేర్చుతున్నట్లు ఇటీవల చేసిన ప్రకటన ఆనందాన్ని కలిగించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) ఈ క్రీడకు గుర్తింపు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)ను గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నాం.

– నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ట్రెడిషనల్ సిలంబం అసోసియేషన్ కార్యదర్శి

'అక్రమ అంతస్తులు'పై చర్యలు



పార్కింగ్ ప్రదేశంలో ఉన్న అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగర పరిధిలోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. గురువారం సాక్షి దినపత్రికలో 'అక్రమ అంతస్తులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. 62వ డివిజన్‌లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో కట్టిన షాపులు, గోడౌన్‌లను తొలగించామన్నారు. అయోధ్యనగర్-1లో భవన నిర్మాణం సంబంధించి ఉన్న డివియేషన్ల ప్రకారం అక్రమ కట్టడాన్ని తొలగించాలని భవన యజమానికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇందుకు బాధ్యులైన అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. సర్కిల్-2 పరిధిలో అక్రమ కట్టడాలపై వస్తున్న ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. చర్యలు తీసుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దళారుల మాట నమ్మొద్దు

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులు దళారుల మాటలు నమ్మకుండా.. తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్ముకుని గిట్టుబాటు ధర పొందాలని బందరు ఆర్డీవో ఐ. కిశోర్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 152 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. రైతులందరూ ఈ ఆర్బీకేల్లో తేమశాతాన్ని పరిశీలించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో గ్రామ వ్యవసాయాధికారి, వీఆర్వోలు అందుబాటులో ఉంటారని తగిన గోనె సంచులు ఇచ్చి మీ ధాన్యాన్ని ఏ తేదీన ఆర్బీకేకు తీసుకురావాలో టోకెన్ ద్వారా తెలియపరుస్తారన్నారు. ఆ తేదీన వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తారన్నారు. ప్రతి ఆర్బీకే వద్ద సిబ్బంది, గోనె సంచులు, రవాణా వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు వస్తే 9849903962, 9849903982లలో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

ఠంచన్‌గా పింఛన్

జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ తొలిరోజు 86.20 శాతం పూర్తయింది. మొత్తం 2,25,834 మంది పెన్షనర్లకు గాను మొదటి రోజు 1,94,667 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలోని జి.కొండూరు మండలంలో అత్యధికంగా 95.34శాతం, తిరువూరులో 93.29 శాతం, విజయవాడ రూరల్‌లో 92.75, ఏ. కొండూరులో 91.33, కంచికచర్ల మండలంలో 91.65 శాతం పంపిణీ జరిగింది.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)



నున్నలో భారతి అనే లబ్ధిదారుకి పెన్షన్ అందజేస్తున్న సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ హసీన

గురజాడ.. అభ్యుదయ భావాలకు అడుగుజాడ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజ అభివృద్ధికి దోహద పడే సాహిత్యాన్ని సృష్టించి అందించిన మహానుభావుడు గురజాడ అప్పారావు అని ఆంధ్రప్రదేశ్ మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి, శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం మధు చౌక్ సమీపంలోని ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) ఆవరణలో ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, ఫొటో ఇండియా, సీసీవీఏ, సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో 'పసివాడని సాహిత్యం– గురజాడ కథా మంజరి, ప్రకాశిక' రెండో వార్షిక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కథా సాహిత్యానికి గురజాడ అప్పారావు చుక్కాని వంటి వారని కొనియాడారు. మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అభ్యుదయ భావాలకు గురజాడ చిరునామా అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కల్చరల్ సెంటర్ సీఈవో శివనాగిరెడ్డి, ప్రకాశిక రెండో వార్షిక సంచిక ప్రధాన సంపాదకుడు, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు కొవ్వలి గోపాలకృష్ణ ప్రసంగించారు. సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కామన్‌వెల్త్‌లో పవర్ చూపిన..
మంగళగిరి బంగారం

- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 4 పసిడి పతకాలు
- స్ట్రాంగ్ ఉమన్ టైటిల్ కైవసం



పతకాలతో సాదియా అల్మాస్

తాడేపల్లిరూరల్: కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి క్రీడాకారిణి ప్రతిభ చూపింది. న్యూజిలాండ్ రాజధాని ఆక్లండ్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ పోటీల్లో పట్టణానికి చెందిన క్రీడాకారిణి సాదియా అల్మాస్ పసిడి పతకాల పంట పండించింది. పవర్ లిఫ్టింగ్ 57 కేజీల జూనియర్ విభాగంలో రాణించి, నాలుగు బంగారు పతకాలు సాధించింది. గురువారం ఆమె మంగళగిరికి రావడంతో స్థానికులు, క్రీడాకారులు అభినందించారు. కామన్ వెల్త్ జూనియర్స్ స్ట్రాంగ్ ఉమన్ టైటిల్‌తోపాటు మూడు న్యూ కామన్‌వెల్త్ రికార్డులు సాధించి చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది.



సాదియా సాధించిన 4 పతకాలు

ముగిసిన షష్ఠి కల్యాణోత్సవాలు



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో షష్ఠి కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేక పల్లకీలో స్వామి వారు, అమ్మవార్లకు ద్వాదశ ప్రదక్షణ నిర్వహించి, ఆలయ వేద పండితులు, అర్చకులు స్వామివారికి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన షష్ఠి కల్యాణోత్సవాలు ముగిశాయని ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ తెలిపారు. ఆలయ పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో కాలభైరవాష్టమి పూజలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా దేవాలయంలోని కాలభైరవస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకులు కైతేపల్లి సుధీర్‌శర్మ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమరేశ్వరాలయానికి చేరుకుని రెండో ప్రాకారంలో ఉన్న కాలభైరవస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం అమరేశ్వరున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విద్యార్థులు ప్రయోగాల్లో రాణించాలి

కృష్ణా వర్సిటీ వీసీ చంద్రశేఖర్

మచిలీపట్నం: విద్యార్థులు ప్రయోగాల్లో రాణించేలా తోడ్పాటు అందించేందుకు సైన్స్ ప్రయోగశాలను అభివృద్ధి చేస్తున్నామని కృష్ణా వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా తగిన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వర్సిటీ క్యాంపస్ కాలేజీల్లో అన్నిరకాల మౌలిక సౌకర్యాలు పెంపొందిస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టి విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు, కాలేజీ ప్రిన్సిపాల్ మారుతి, డాక్టర్ లంకా సుశీల తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగశాలను ప్రారంభించిన వీసీ చంద్రశేఖర్

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ కేంద్రం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఈ వ్యాక్సిన్ కేంద్రంలో పనిచేసేందుకు ముగ్గురు వైద్యులు, ఇద్దరు స్టాఫ్ నర్సులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఆషిక, డాక్టర్ రవిపాల్‌లతో పాటు, స్టాఫ్‌నర్సు శ్రీవాణి, మరొకరు శిక్షణ కోసం విశాఖపట్నంలోని పోర్టు హాస్పిటల్‌కు ఇక్కడి నుంచి గురువారం వెళ్లారు. అక్కడ ఎల్లో ఫీవర్‌కు వ్యాక్సినేషన్, అనంతరం వచ్చే దుష్ఫలితాలు, చికిత్స వంటి అంశాలపై వారు పూర్తిస్థాయిలో శిక్షణ పొందనున్నారు. రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లే వారికి ఈ ఎల్లోఫీవర్ వ్యాక్సిన్‌ను వేయనున్నట్లు తెలిసింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేయనున్న వ్యాక్సినేషన్ కేంద్రంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారికి వ్యాక్సిన్ వేస్తారు. వైద్యులు, సిబ్బంది శిక్షణ పూర్తయిన తర్వాత ప్రభుత్వం వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

వివాహితపై హత్యాయత్నం కేసులో జీవిత ఖైదు

విజయవాడ స్పోర్ట్స్: మహిళపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ విజయవాడ అడిషనల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి పి.భాస్కరరావు గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ భవానీపురంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న వివాహిత అదే ప్రాంతానికి చెందిన తాపీమేస్త్రి నూరే శ్రీనుతో పరిచయమై సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయంపై ఇరు కుటుంబాల్లో గొడవలు రేగడంతో వివాహిత శ్రీనుతో దూరంగా ఉంది. తనను దూరం పెట్టిన వివాహితపై కక్ష పెంచుకున్న శ్రీను కత్తితో ఆమెపై 2018 ఆగస్టు 18వ తేదీన దాడి చేసి గాయపర్చాడు. ఇంతలో చుట్టుపక్కల వారు రావడంతో శ్రీను అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే సమీప వ్యక్తులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదే రోజు భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితురాలి తరఫున ఏపీపీ వై.పుల్లారెడ్డి వాదనలు వినిపించారు. తొమ్మిది మంది సాక్షులను న్యాయమూర్తి విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనుకు జీవిత ఖైదుతో రూ.10 వేలు జరిమానాగా విధించారు.

ఏకమవుదాం...అంతం చేద్దాం

- రాష్ట్రాన్ని ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేద్దాం
- ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, చిత్రంలో డాక్టర్ సమరం తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజ భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని ఎయిడ్స్ రహిత ప్రదేశ్‌గా చేద్దామని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యుడు మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం, మందుల పంపిణీతో పాటు జగనన్న అమ్మ ఒడి, ఇళ్ల స్థలాలు అందించటంలో వారిని భాగస్వాములను చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది ఎయిడ్స్ డే థీమ్ అయిన 'సమానత్వం'(అసమానతలను అంతం చేయడానికి ఏకమవుదాం) అనే ప్రచార కార్యక్రమానికి సంబంధించి తొలి సంతకం చేశారు. అలాగే 'హెచ్‌ఐవీ/ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించడం, నివారణలో పాలు పంచుకుంటామని' అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన, నియంత్రణకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందచేశారు.

ఎయిడ్స్ నియంత్రణలో ఏపీ అగ్రగామి

ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీఎస్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందన్నారు. హెచ్‌ఐవీపై యువతీ యువకుల్లో అవగాహన కల్పించడం కోసం 'సేఫ్ లైఫ్' ప్రచార కార్యక్రమాన్ని అన్ని విద్యా సంస్థల్లో ప్రారంభించామన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణ, అవగాహనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. తొలుత గిరిజన పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన థింసా నృత్యం, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ వేసిన వీధి నాటకం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్, ప్రెసిడెంట్స్ ఎమర్జన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ ఏపీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఐసీటీసీ అండ్ డీటీఎస్ జేడీ డాక్టర్ కిషోర్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్‌రావు, లెప్రసీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాస్మిన్, చెస్ట్ ప్లస్ రేణుక, ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, డాక్టర్ జూపూడి ఉషారాణి, జిల్లా గిరిజన సంస్థ అధికారి రుక్మాంగదయ్య, జీవనరేఖ మహిళా సంఘం మున్నీసా, పీడీ అర్చన, కృష్ణా యువజన సంక్షేమ సంఘం కిరణ్, వాలంటరీ హెల్త్ సర్వీసెస్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కార్యక్రమానికి ముందుగా ఏలూరు లాకుల సెంటర్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పీడీ జీఎస్ నవీన్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఎన్‌సీసీ జూనియర్ వారెంట్ ఆఫీసర్ అజిత్ సింగ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ డాక్టర్ అపరాజితసింగ్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మండల పరిధిలోని సుల్తానగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం కొనుగోలు విధానాన్ని దగ్గరుండి పరిశీలించారు. దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు జరుగుతున్నదీ లేనిదీ రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు విషయంలో ఏవైనా అవకతవకలు జరుగుతున్నట్లు అనిపిస్తే ధైర్యంగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. రైతులు పలువురు ధాన్యం కోసిన వెంటనే ఆరబెట్టుకునే పరిస్థితి లేకుండా కొనుగోలు చేసేలా సిబ్బందికి సూచించాలని కోరగా ఆమె ప్రభుత్వ షరతుల మేరకు కొనుగోలు కేంద్రాల సిబ్బంది పనిచేస్తారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిస్సంకోచంగా ఫిర్యాదులు చేయవచ్చని రైతులతో ఆమె చెప్పారు. అవకతవకలకు పాల్పడితే సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీతో పాటు జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు, మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్, బందరు తహసీల్దార్ డి.సునీల్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గర్భం దాల్చిన మైనర్ బాలిక

కోనేరుసెంటర్(మచిలీపట్నం): బందరు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక(12) గర్భం దాల్చింది. ఇటీవల బాలిక ఆరోగ్యం క్షీణించటంతో వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లగా అసలు విషయం బయటికి పొక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపట్నం గ్రామానికి చెందిన మైనర్ బాలికను పెడనకు చెందిన 14 సంవత్సరాల వయసు గల ఆమె సమీప బంధువు (వరుసకు మేనమామ) నత్తలవేటకు వెళ్లిన సమయంలో పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం బాలిక ఆరోగ్యం బాగోకపోవటంతో తల్లిదండ్రులు పరీక్షల నిమిత్తం గురువారం బందరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలిక ఆరు నెలల గర్భవతిగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న బందరు రూరల్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాలిక నుంచి వివరాలు సేకరించారు. బాలిక తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మధుర స్వరాల కంఠశాల ఘంటసాల

- డిసెంబరు 4 ఘంటసాల శతజయంతి
- ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేడుకలు
- ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

ఆ స్వరం వింటే చాలు తెలుగు వారు పులకించి పోతారు. ఆ పేరు విన్నా.. తలచినా.. పాట మురిసి పోతుంది. పద్యం పరవశించి పోతుంది. జానపదాల నుంచి జావళీల దాకా భక్తి గీతాల నుంచి అష్టపదుల దాకా ఆయన ముద్ర కనిపిస్తుంది. ఇంతింతై వటుడింతై అన్నట్టు కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని చౌటపల్లిలో పుట్టిన ఒక సామాన్యమైన వ్యక్తి తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారంటే స్వరస్వతీ దేవి ఆయన నాలుక మీద బీజాక్షరాలు రాయబట్టే. ఆయనే తెలుగువారంతా గర్వంగా చెప్పుకునే ఘంటసాల వెంకటేశ్వరరావు. డిశంబరు 4 ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం.


విజయనగరం మహారాజా కళాశాల ఆవరణలో ఘంటసాల విగ్రహం

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని చౌటపల్లిలో 1922 డిసెంబరు 4 వ తేదీన సామాన్య కుటుంబంలో జన్మించిన ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం వడ్డించిన విస్తరి కాదు. బాల్యంలో బాలారిష్టాలతో గడిచింది. 1936లో తన 14వ ఏట తన దగ్గరున్న బంగారు ఉంగరాన్ని అమ్మి సంగీతం నేర్చుకోవడానికి విజయనగరం చేరుకున్నారు. విజయనగరం రాజులు కళా పోషకులు కావడంతో అనేక విద్యాలయాలను ప్రారంభించారు. వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు ప్రోత్సాహంతో పాట్రాయని సీతారామశాస్త్రి వద్ద శాస్త్రీయ సంగీతం అధ్యయనం చేశారు. 1941లో విద్వాన్ పట్టాతో కళాశాల నుంచి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. 1944లో మేనమామ కుమార్తెను వివాహం చేసుకున్నారు. అదే సంవత్సరం మద్రాసు ప్రయాణమైన ఘంటసాల సినీ ప్రస్థానం 1974 ఫిబ్రవరి 11న ముగిసింది.



సినీ ప్రస్థానం:

ఘంటసాల మాస్టారి సమీప బంధువైన సినీరంగ ప్రముఖుడు సముద్రాల రాఘవాచారి ఆశీస్సులతో 1944లో మద్రాసు చేరుకున్నారు. అవకాశాల కోసం ఏడాది పాటు ఎదురు చూశారు. 1945లో తొలిసారిగా ఆయన స్వరం గాజులపిల్ల పాట(స్వర్గసీమ) ద్వారా తెలుగు వారికి పరిచయమైంది. ఇక ఆయన వెనక్కు తిరిగి చూసుకునే అవసరం లేక పోయింది. వేలాది గీతాలు పాడారు. భక్తి గీతాలు, విషాద గీతాలు. సోలో ఇలా... పాట ఏదైనా మాస్టారి పాటలకు మంత్రముగ్ధులు కాని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి లేదు. ఘంటసాల కేవలం సినీ గాయకుడే కాదు...స్వాతంత్ర్య సమరయోధుడు, సినీ నిర్మాత, సంగీత దర్శకుడు. పలు భాషల్లోని చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. తన జీవిత చరమాంకంలో ఘంటసాల గానం చేసిన భగవద్గీత ఆయనకు శాశ్వత కీర్తిని సంపాదించి పెట్టింది. విదేశాలలో సహితం అక్కడున్న తెలుగువారికి గాన విందు పంచి పెట్టారు ఘంటసాల. సినిమాలో ఆయన తొలి పారితోషికం 116 రూపాయలు. అప్పటి సినీ నేపథ్యగాయకులు, గాయనీమణులు దాదాపుగా ఆయనతో కలసి పాటలు పాడారు. హెచ్‌ఎంవీ సంస్థ తొలి దశలో ఆయన స్వరం రికార్డులకు పనికి రాదంది. తరువాత వారే ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

ఘంటసాల పేరుతో పోస్టల్ స్టాంప్

ఘంటశాల మరణానంతరం 2003లో ఆయన పేరుతో తపాలా శాఖ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసి ఆయన పట్ల తన భక్తిని చాటుకుంది. అభిమానులు ఊరూరా ఘంటసాల విగ్రహాలను ఏర్పాటు చేసుకుని తమ అభిమానం చాటుకున్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు నాలుగవ తేదీన ఘంటసాల శత జయంతి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆయన అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు.

పద్మశ్రీ పురస్కారం

1970 లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది.1972లో రవీంద్రభారతిలో కచేరీ నిర్వహిస్తూ ఉండగా ఆయనకు తొలిసారిగా గుండెనొప్పి రావడంతో ఆసుపత్రిలో చేరారు.1974లో ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అదే ఏడాది ఫిబ్రవరి 11న మద్రాస్‌లోని విజయా హాస్పిటల్‌లో తెలుగు ప్రేక్షకుల హృదయాలను విడిచి ఆయన గంధర్వలోకానికి తరలిపోయారు.

టేకుపల్లిలో 4న ఘంటసాల కళామండపానికి శంకుస్థాపన


కుటుంబ సభ్యులతో ఘంటసాల వెంకటేశ్వరరావు

టేకుపల్లి(మోపిదేవి): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తండ్రి సూర్యనారాయణ స్వగ్రామం కృష్ణాజిల్లా మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామం. ఘంటసాల గుడివాడ సమీపంలోని చౌటపల్లిలో మేనమామ ర్యాలీ పిచ్చిరామయ్య ఇంటి వద్ద జన్మించారు. తండ్రి సూర్యనారాయణ స్థానిక రామేశ్వరస్వామివారి ఆలయంలో పూజారిగా ఉండేవారు. పేదరికం వల్ల తండ్రి మృదంగం వీపున కట్టుకుని, గ్రామాల్లో భగవత్ కీర్తనలు ఆలపిస్తుండగా ఘంటసాల నృత్యం చేస్తుండేవారు. 11వ ఏటనే తండ్రిని కోల్పోవడంతో చౌటపల్లిలో మేనమామ వద్దనే పెరిగారు. ఘంటసాల స్వగ్రామమైన టేకుపల్లిలో ఆయన శత జయంతి సందర్భంగా ఈ నెల 4వ తేదీన ఘంటసాల పేరుతో కళా మండపానికి శంకు స్థాపన చేయనున్నారు.

ఘంటసాల పాటల చరిత్ర భావితరాలకు అందాలి

అమరగాయకుడు ఘంటసాల గాన చరిత్ర భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఘంటసాల పాటలను సేకరించడం మొదలు పెట్టాను. వందలాది పాటలతో పుస్తక రూపంలోకి తీసుకువచ్చాను. నేను సేకరించిన ఘంటసాల సంపూర్ణ తెలుగు పాటలను శతవర్ష ఘంటసాల పేరుతో వచ్చిన పుస్తకాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఆవిష్కరించారు.

–చల్లా సుబ్బారాయుడు
ఘంటసాల పాటల సేవకుడు

క్రమశిక్షణ, అంకితభావం అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యార్థులకు క్రమశిక్షణ, అంకితభావం ఎంతో అవసరమని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు అన్నారు. వైద్య కళాశాలలో 2022–23 సంవత్సరానికి గాను కొత్తగా చేరిన మొదటి ఏడాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్‌రావు మాట్లాడుతూ వైద్య విద్యలో చేరిన విద్యార్థులంతా ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. వైద్య వృత్తి అంటే సేవాభావంతో కూడకున్నదని, భావి వైద్యులుగా ఉన్నత ఆశయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రొఫెసర్లు చెప్పినవి వింటూ ఎంబీబీఎస్ స్థాయిలోనే రోగులతో ఇంటరాక్ట్ కావాలని చెప్పారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వెంకటకృష్ణ, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ సూర్యశ్రీలతో పాటు, పలువురు సీనియర్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

వాగులో పడి యువకుడి మృతి

తిరువూరు: తిరువూరు శివారు పీటీకొత్తూరుకు చెందిన గంధ్రాతి సాయిరెడ్డి(20) గురువారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద పడమటివాగులో దిగి వరద ఉధృతికి మునిగిపోయి ప్రాణాలు విడిచాడు. కల్లూరులో మార్బుల్ పనికి వెళుతూ బహిర్భూమి నిమిత్తం వాగు వద్దకు వెళ్లిన సాయిరెడ్డి ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడ్డాడు. అతనితో వెళ్లిన స్నేహితుడు రక్షించడానికి యత్నించినా ఫలించలేదు. సాయిరెడ్డి తండ్రి ఇటీవల మరణించాడు. మృతుడు అవివాహితుడు. ఇతనికి తల్లి, ఒక సోదరి ఉన్నారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజయవాడ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డికి తెలిపారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్ల పై కృష్ణా, ఎన్టీఆర్, చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 4వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు ఢిల్లీ నుంచి బయలు దేరి ఉదయం 10.15 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని పోరంకి మురళి రిసార్టులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం రాజ్ భవన్‌కు చేరుకుని, రాష్ట్రపతి గౌరవార్థం గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ఇచ్చే విందులో పాల్గొంటారన్నారు. తదుపరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకుంటారన్నారు. రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొనే కార్యక్రమాలపై రాజ్‌భవన్ అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

కృష్ణా వర్సిటీ జూడో జట్ల ఎంపిక


కృష్ణా విశ్వవిద్యాలయం జూడో స్త్రీ, పురుషుల జట్లు

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా విశ్వవిద్యాలయం జూడో స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు విజయవాడ సప్తగిరి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.డి.శ్రీదేవి తెలిపారు. విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల జూడో స్త్రీ, పురుషుల పోటీలు విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో గురువారం జరిగాయి. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన కె.కల్యాణ్‌కుమార్(సప్తగిరి డిగ్రీ కాలేజీ), ఎం.వరప్రసాద్(ప్రభాస్ డిగ్రీ కాలేజీ), పి.అభిషేక్(వి.ఎస్.ఆర్.జి.డి.సి మొవ్వ), వై.వంశీ (ఎస్.ఆర్.ఆర్.సి.వి.ఆర్.జి.డి.సి.విజయవాడ), ఎస్.చందు(వి.ఎస్.ఆర్.జి.డి.సి మొవ్వ)లను యూనివర్సిటీ పురుషుల జట్టుకు ఎంపిక చేశారు. వై.లక్ష్మీలావణ్య(కె.వి.ఎస్.కాలేజీ), ఎ.నాగ సురేఖ(ఎ.ఎం.మోడ్రన్ డిగ్రీ కాలేజీ, విజయవాడ), జి.ఉషశ్రీ(వి.ఎస్.ఆర్.జి.డి.సి మొవ్వ), టి.అరుణ నాగదుర్గ(కె.బి.ఎస్.కాలేజీ)లను మహిళల జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు 2023 జనవరి రెండో తేదీ నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. జట్ల ఎంపిక కమిటీ సభ్యులుగా డాక్టర్ బి.యుగంధర్, ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ప్రతినిధి నామిశెట్టి వెంకట్, టోర్నమెంట్ కార్యదర్శిగా డాక్టర్ ఆర్.రఘురామ్ వ్యవహరించారన్నారు.

బాలికపై లైంగికదాడి

గుడివాడరూరల్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుడివాడ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్టీఆర్ కాలనీకి చెందిన మైనర్‌బాలిక(16)పై అదే కాలేజీలో పనిచేస్తున్న ఎన్టీఆర్ కాలనీకి చెందిన అన్నం సత్యనారాయణ లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్‌ఐ గౌతమ్‌కుమార్ కేసు నమోదు చేయగా సీఐ గోవింద రాజులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచారం చేయిస్తున్న ఆర్ఎంపీ వైద్యురాలు అరెస్ట్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఆర్ఎంపీ వైద్యం చేస్తూ యువతులతో వ్యభిచారం చేయిస్తున్న మహిళపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భవానీపురం స్వాతిరోడ్‌కు చెందిన రామటెంకి రాధిక భర్త ఆర్ఎంపీగా చేస్తూ కరోనాతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ఇంటి వద్దనే వైద్యం చేస్తోంది. దాంతో పాటు వాట్సాప్ ద్వారా పార్టీలను బుక్ చేసుకుని వారికి అమ్మాయిలను పంపిస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఓ వ్యక్తి రూ.10వేలకు ఓ అమ్మాయిని బుక్ చేసుకున్నాడు. అతనిని గొల్లపూడి స్కూల్ వద్దకు రమ్మని అతని నుంచి రూ.5వేలు తీసుకుని, మిగిలిన డబ్బులు యువతికి ఇవ్వమని ఒప్పందం కుదుర్చుకుంది. స్కూల్ సమీపంలోని బే లీవ్స్ హోటల్‌లో రూమ్ నంబరు 101 లో ఉన్న ఆ యువతి వద్దకు అతనిని పంపింది. సమాచారం తెలుసుకున్న భవానీపురం సీఐ ఒమర్ సిబ్బందితో హోటల్‌కు వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచారం చేయిస్తున్న రాధికను అరెస్ట్ చేశారు. బాధితురాలిని హోమ్‌కు తరలించారు.

క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పశ్చిమ నియోజకవర్గ నివాసి షేక్ షకీలా షుగర్‌తో బాధపడుతూ మొగల్రాజపురంలోని వీజీఆర్ డయాబెటీస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే వారి ఆర్థిక ఇబ్బందులపై సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు స్పందించిన ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి సహకారంతో ఆమె చికిత్సకు రూ.25 వేలు అందజేశారు. మొగల్రాజపురంలోని ఆస్పత్రికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని ఇచ్చారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ఎండీ కరీమున్నీసా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీలోని ఆయా డివిజన్లలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు గురువారం వీఎంసీ, ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సూర్యారావుపేటలోని ఐవీ ప్యాలెస్‌లో జరిగిన క్యాంపులో కార్మికులకు బీపీ, షుగరు, గుండె పరీక్షలు, గైనిక్ విభాగ పరీక్షలు నిర్వహించారు. వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ రత్నావళి మాట్లాడుతూ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ ఆదేశాలతో నిర్వహిస్తున్నామని, ఏటా కార్మికులకు ఇలాంటి క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపులో వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల హాకీ, జూడో టోర్నమెంట్‌లో సత్తాచాటిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థులు జి.సురేంద్ర, వై.వంశీ చక్కటి ప్రదర్శనలతో యూనివర్సిటీ టీమ్‌కు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. మిగతా విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులు, డాక్టర్లు ఎం.కోటేశ్వరరావు, డి.యుగంధర్, అధ్యాపకులు పి.శైలజ, కేఎల్‌సీ దేవి తదితరులు విజేతలను అభినందించారు. యూనివర్సిటీ పోటీల్లో కూడా సత్తాచాటి కళాశాల పేరు ఇనుమడింపజేయాలని కోరారు.

7న కలశజ్యోతి మహోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన కలశజ్యోతి మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని దుర్గగుడి ఈఓ భ్రమరాంబ పేర్కొన్నారు. 7వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో దేవస్థాన ప్రచార రథం ముందుకు సాగుతూ నగర వీధుల్లో ఊరేగింపు కొనసాగుతుందని చెప్పారు. పలుప్రాంతాల్లో తిరిగి దుర్గగుడికి చేరుతుందని పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర శివారు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రహదారుల నిర్మాణాలను చేపట్టడంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్‌లోని జమ్మిచెట్టు ప్రాంతంలో రూ.5.33 లక్షల వ్యయంతో చేపట్టిన మెటల్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. శివారు ప్రాంతాల్లో రహదారులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన రోడ్లు వేస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆయన అందిస్తున్న సహకారంతో నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇంజినీరింగ్ ఏఈ మౌసామి, సచివాలయ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



భారతీనగర్ ఏడో సచివాలయం పరిధిలోని రోడ్డు నెం 14లో గడపకు గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నాలుగో డివిజన్ పరిధిలోని భారతీనగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల బతుకులు రోడ్డున పడ్డాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయని వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చడానికి ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు.

ఎమ్మెల్యే గద్దె ఇంటికే పరిమితం..

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి గద్దె రామ్మోహన్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఇంటికే పరిమితమయ్యారని దేవినేని అవినాష్ విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తామే చేస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక తమ పార్టీ నాయకుల పై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, నాలుగో డివిజన్ ఇనాచార్జి గల్లా పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు మీర్ హుస్సేన్, జేజే సింగ్, వెంకటేశ్వరరావు, గల్లా రవి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బండ్ల పంపిణీ

పేదలకు తోడ్పాటునందించడానికి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు అవినాష్ తెలిపారు. నాలుగో డివిజన్‌కు చెందిన ఊటుకూరి దుర్గారావు, గొర్ల నాగమణి జీవనోపాధికి 35వేల ఖరీదైన టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. దేవినేని నెహ్రూ ట్రస్ట్ ద్వారా నగరంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ క్రిమిటోరియం ప్రారంభం

- రూ. 1.30 కోట్లతో ఏర్పాటు
- మేయర్ రాయన భాగ్యలక్ష్మి



శ్మశానవాటికలో గ్యాస్ క్రిమిటోరియం ఫర్నేస్ స్విచ్ ఆన్ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అధునాతన సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన గ్యాస్ ఆధారిత క్రిమిటోరియాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. గట్టు వెనుక ప్రాంతం 38వ డివిజన్ పరిధిలోగల పున్నమి ఘాట్ (పిండ ప్రదాన రేవు) వద్ద ఉన్న విద్యాధరపురం హిందూ శ్మశానవాటికలో 14వ ఆర్థిక సంఘం, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎల్‌పీజీ గ్యాస్ క్రిమిటోరియాన్ని ఆమె స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి గురువారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి గ్యాస్ దహన వాటికకు సంబంధించిన ఫర్నేస్‌ను స్విచ్ ఆన్ చేసి దహన ప్రక్రియను పరిశీలించారు.

నగరంలో మూడు క్రిమిటోరియాలు

ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో టీడీపీ నాయకులు ఈ శ్మశానవాటికను కబ్జా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి, స్థానిక పార్టీ శ్రేణులు వారి యత్నాలను తిప్పి కొట్టి శ్మశానాన్ని కాపాడారని గుర్తు చేశారు. ఫలితంగా ఈ గ్యాస్ క్రిమిటోరియం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. విజయవాడ నగరంలో ఈ తరహా గ్యాస్ క్రిమిటోరియాలు మూడింటిని నిర్మించామని తెలిపారు. వీటితో వాతావరణ కాలుష్య సమస్య ఉండదన్నారు. ఈ శ్మశానవాటికలో స్థలాభావం కారణంగా ఖనన ప్రక్రియను నిలిపివేశామని చెప్పారు. రానున్న రోజుల్లో గ్రీనరీ అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నామన్నారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, తదనుగుణంగా నిధులు కూడా మంజూరు చేస్తున్నారని మేయర్ భాగ్యలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు.. వచ్చిన తరువాత చూసుకుంటే నగరం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అయినా ప్రతిపక్షాలు సీఎం జగన్ ప్రభుత్వంపై బురద చల్లటమే పనిగా పెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, గుడివాడ నరేంద్ర రాఘవ, పడిగపాటి చైతన్యరెడ్డి, మైలవరపు రత్నకుమారి, నాయకులు షేక్ హయాత్ షరీఫ్, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, మైలవరపు దుర్గారావు, బొమ్ము మధు, ఎస్‌కే నజీర్, డీవీ రెడ్డి, నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, ఈఈ(ప్రాజెక్ట్స్) వెంకటేశ్వరరెడ్డి, డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజమే లక్ష్యం

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు దుప్పట్లు, దుస్తులు అందజేస్తున్న సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి



వాసవ్య మహిళా మండలిలో జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు



అవగాహన కార్యక్రమంలో కళాకారులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): హెచ్‌ఐవీ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు వాడుతున్న బాధితులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం న్యూట్రిషియన్ ఫుడ్‌తో పాటు, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ నేడు యువతలో హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నట్లు అధ్యయనాల్లో తేలిందన్నారు. హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం ఖరీదైన మందులను ఏఆర్‌టీ సెంటర్లలో ఉచితంగా అందిస్తోందని చెప్పారు. వారికి ఇతర వ్యాధులు సోకకుండా వైరల్ లోడ్ పరీక్ష చేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీపై యువతను జాగృతం చేయాలని, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ శోభ, ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తదిరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

గుణదల (విజయవాడ తూర్పు): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డాక్టర్ పి.నిఖిల్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా గురువారం ఆంధ్ర లయోల కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ప్రాణాంతకమైనదని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ వ్యాధికి మెడిసిన్ కనుగొనే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని సమాజంలో ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బీవీ గురునాథ్, డాక్టర్ శేఖర్, డాక్టర్ జాన్, కరెస్పాండెంట్ సహాయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎయిడ్స్ డే పురస్కరించుకుని రాణిగారితోటలోని వైట్‌హౌస్ సెంటర్‌లో గైడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన జిల్లా ఎయిడ్స్ నివారణ అండ్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో గురువారం హెచ్‌ఐవీ–ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.శేఖర్‌బాబు, వీధినాటిక బృందం కళాకారులు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, కుష్టు నివారణ, క్షయ నివారణ, ఆరోగ్య విషయాలపై, ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ కేంద్రాలపై వీధి నాటికలు ప్రదర్శించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, జానపద కళాకారులు శేఖర్‌బాబు, తిరుపతికుమార్, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): హెచ్‌ఐవీ సోకకుండా నివారణ మార్గాలపై యువత అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని బెంజిసర్కిల్‌లోని వాసవ్య మహిళా మండలిలో చిన్నారులతో అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఢిల్లీరావు తొలుత పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ సోకకుండా రక్షించుకునే మార్గాలపై అవగాహన పెంచుకోవాలని, వైరస్ సోకకుండా ఉండేందుకు మందుల తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎస్టీఐ ఇన్‌ఫెక్షన్స్ వస్తున్నాయని, నివారణ మార్గాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి, కార్యదర్శి రశ్మి తదితరులు పాల్గొన్నారు.

ఇ గవర్నెన్స్‌పై అవగాహన అవసరం

కలెక్టర్ ఢిల్లీరావు



పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన శరత్‌చంద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇ గవర్నెన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, గుడ్‌గవర్నెన్స్‌పై పుస్తకాలు చాలా అరుదుగా ఉంటాయని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. శరత్ చంద్ర అకాడమీ రూపొందించిన పాలిటీ అండ్ గవర్నెన్స్ టెస్ట్ పుస్తకాన్ని గురువారం కలెక్టర్ ఢిల్లీరావు తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ, సివిల్స్ పరీక్షలో పాలిటీ సబ్జెక్టు ఎంతో కీలకమైందన్నారు. అడ్మినిస్ట్రేషన్‌లో కూడా భారత రాజ్యాంగంపై పట్టు ఎంతో అవసరమని తెలిపారు. మారుతున్న ఐఏఎస్ పరీక్షా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ప్రిపరేషన్ స్ట్రాటజీని మార్చుకుంటూ కృషి చేయాలన్నారు. శరత్ చంద్ర అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ శరత్‌చంద్ర తోట మాట్లాడుతూ కలెక్టర్ ఢిల్లీరావు ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాలో పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఐఏఎస్ కావాలనుకునే వారికి ఢిల్లీరావు ఒక ప్రేరణ అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

● వైఎస్సార్ పెన్షన్ పంపిణీ



వన్‌టౌన్ 50వ డివిజన్ 169వ వార్డు సచివాలయం పరిధిలోని చలమల వెంకటరెడ్డికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీరు అలేఖ్య



నాలుగో డివిజన్ భారతీనగర్ ఏడో సచివాలయం పరిధిలోని నిర్మల గంగమ్మకు వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్న వార్డ్ వలంటీర్ రమావత్ మధు

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పాస్‌పోర్ట్, వీసా మోసాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ ప్రశాంతి

విజయవాడ స్పోర్ట్స్: పాస్‌పోర్ట్, వీసా, విదేశీ ప్రయాణ పత్రాల మోసాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ డీసీపీ మేరీప్రశాంతి పోలీస్ అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్, వీసా, విదేశీ ప్రయాణ పత్రాల మోసాలపై విజయవాడ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో అవగాహన సదస్సు(ఓవర్‌వ్యూ ఆఫ్ ఓవర్సీస్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్) గురువారం జరిగింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అమెరికా ఫెడరల్ పోలీస్ స్పెషల్ ఏజెంట్ ఎరిన్‌ఫిశ్చర్ నకిలీ పాస్‌పోర్ట్ పుస్తకాలను ఏ విధంగా గుర్తించాలి, యూఎస్ వీసాలు ఏ విధంగా ఉంటాయనే అంశాలతో పాటు ప్రయాణ పత్రాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న పోలీస్ అధికారులకు యూఎస్ డిప్లొమాటిక్ సెక్యూరిటీ సర్టిఫికెట్‌లను అందజేశారు. అనంతరం ఎరిన్‌ఫిశ్చర్‌ను డీసీపీ ప్రశాంతి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో క్రిమినల్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు చేతన్ బండారి, బోడవరపు స్వాతి పాల్గొన్నారు.

చిత్రకారుల్లోని ప్రతిభను గుర్తించాలి



చిత్రకారుడు పోచం ఏల్పులను సత్కరిస్తున్న విజయవాడ ఆర్టిస్ట్ సొసైటీ సభ్యులు కళాసాగర్, గిరిధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: చిత్రకారుల్లోని ప్రతిభను గుర్తించాలని చిత్రకారుడు కళాసాగర్ అన్నారు. విజయవాడ ఆర్టిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సంస్థ కార్యాలయంలో తెలంగాణలోని చెన్నూరుకు చెందిన చిత్రకారుడు పోచం ఏల్పుల అభినందన సభను నిర్వహించారు. కళాసాగర్ మాట్లాడుతూ.. చిత్రకారుడు పోచం భారతీయ సాంస్కృతిక వైభవం అధ్యయనం చేయాలనే సంకల్పంతో చిత్రకళాయాత్రను ప్రారంభించారన్నారు. 15 రాష్ట్రాలను సందర్శించారని, ఎ గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజల జీవన విధానం అధ్యయనం చేసి లైవ్ డ్రాయింగ్ చిత్రాలు గీశారని తెలిపారు. భారతీయ జనజీవన విధానాన్ని తెలియజేస్తున్న చిత్రకారుడు పోచంను విజయవాడ ఆర్టిస్ట్ సొసైటీ అధ్యక్షుడు రాంబాబు అభినందించారు. చిత్రకారుడు పోచం మాట్లాడుతూ.. యాత్రానుభవాల సమయంలో గమనించిన ప్రజల జీవనశైలిని చిత్రాలతో కూడిన పుస్తకాన్ని ప్రచురిస్తానని తెలిపారు. కార్యక్రమంలో చిత్రకారుడు గిరిధర్, విజయవాడ ఆర్టిస్ట్ సొసైటీ సభ్యులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవించడం అందరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): మానవ సృష్టికి మూలమైన స్త్రీలను గౌరవించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 25వ తేదీ నుంచి ఈనెల 10వ తేదీ వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మధురానగర్ రమాదేవి నగరపాలక సంస్థ పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను గౌరవించడం ద్వారా హింసను అరికట్టే అవకాశం ఉందన్నారు. తల్లి, చెల్లి, భార్య ఇలా కుటుంబ వ్యవస్థకు ప్రతి రూపమైన స్త్రీని పవిత్రమైన స్థానంతో ఆరాధించాలని చెప్పారు. మహిళల రక్షణ ఐకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ వారిపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. హింసను ఎదుర్కొనే మహిళలు నిర్భయంగా ముందుకు వచ్చి హెల్ప్‌లైన్–181, డయల్ 100 లేదా 112, చైల్డ్‌లైన్ 1098 వంటి హెల్ప్‌లైన్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలను నివారించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ ద్వారా కూడా రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం మహిళలు, బాలికలపై హింస, దోపిడీ, అత్యాచారాలు, లైంగిక వేధింపులను వ్యతిరేకిస్తామని అంగన్‌వాడీ టీచర్లు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు లక్ష్మీదేవి, మేరీ సుజాత, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హిందూ హైస్కూల్ యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగే స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపేట హిందూ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్‌లో వివిధ జిల్లాల్లో జరిగే అంతర జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రేణిగుంటలో జరిగే అండర్ –19 రెజ్లింగ్ పోటీలకు ఎస్.శ్రీను, షేక్ అబ్దుల్ సలాం, సీహెచ్ తేజ, మణికంఠ, ఎం.లక్ష్మీనారాయణ, ఎస్.అశోక్‌కుమార్‌లు ఎంపికయ్యారని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 17 నుంచి శ్రీకాకుళంలో జరిగే అండర్–17 హ్యాండ్ బాల్ పోటీలకు విజయకుమార్, అల్తాఫ్, బి.పుష్ప, వరలక్ష్మి, గీతశ్రీలు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు అనంతపురం జిల్లా కదిరిలో జరిగే అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.మాధురి, టి.జస్వంత్‌లు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు కర్నూల్ జిల్లా ఆత్మకూరులో జరిగే జూనియర్ అంతర జిల్లాల ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు జి.బిల్లహరి, సాయిబాబు, గంటా మోనికాలు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను, వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మి, ఎంవీ సత్యప్రసాద్‌లను పాఠశాల కమిటీ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కార్యదర్శి కేఎల్వీ మోహనరావు, కోశాధికారి జి.బాబావిజయకుమార్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

5 నుంచి పారుపల్లి జయంతి ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో సంగీత కళానిధి పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 139వ జయంతి ఉత్సవాలను ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘ సభ్యుడు మోదుమూడి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో 5వ తేదీ సోమవారం సాయంత్రం మల్లాది సూరిబాబుకు సునాదసుధానిధి పురస్కారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

● చురుగ్గా పార్కు, నెట్ ప్రాక్టీస్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు



క్రికెట్ ప్రాక్టీస్‌కు ఏర్పాటు చేసిన నెట్, పక్కనే వాకింగ్ ట్రాక్



ఇక్కడే ఆట వస్తువులు, గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు

రాణిగారితోటలోని 18వ డివిజన్‌లో వారధి వెంట ఖాళీ స్థలంలో సుమారు రూ.35 లక్షల వ్యయ అంచనాతో పార్కు, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఇవి చురుగ్గా జరుగుతున్నాయి. వీటి కోసం కార్పొరేటర్ సత్యనారాయణ చొరవతో నిధులు మంజూరయ్యాయి. పార్కులో చిన్నారుల ఆట వస్తువులు, గ్రీనరీని ఏర్పాటు చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

– కృష్ణలంక(విజయవాడ తూర్పు)

దత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోటలోని శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ఆలయకమిటీ ఆధ్వర్యాన దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత బాబాకు ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీర మోహనరావు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వాములు, భవానీలు, భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేకల హనుమంతరావు యాదవ్

అమరావతి : అలవికాని హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ వాటిని అమలుచేయకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేకల హనుమంతరావు యాదవ్ ఆరోపించారు. పల్నాడు జిల్లా అమరావతిలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014లో గెలుపు కోసం గ్రామ పంచాయతీల తలసరి ఆదాయ గ్రాంట్‌ను రూ.4 నుంచి రూ.15కు పెంచుతానని, మండల పరిషత్‌లకు రూ.8 నుంచి రూ.20కు, జిల్లా పరిషత్‌లకు రూ.4 నుంచి రూ.10కి పెంచుతానని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. కానీ, ప్రస్తుతం వార్డు మెంబరు హోదా కూడాలేని టీడీపీ నేత రాజేంద్రప్రసాద్ తానే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఉద్ధరిస్తాననడం.. అలాగే, ఇష్టారాజ్యంగా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తే తగిన శాస్తి తప్పదని హనుమంతరావు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 10శాతం కూడా టీడీపీ బలపరిచిన సర్పంచ్‌లు గెలవలేదని.. అలాంటిది ఆయన సర్పంచ్‌ల హక్కుల సాధనకు పోరాటం చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు.

జిల్లాకో వృద్ధాశ్రమం ఏర్పాటు బాధ్యత ప్రభుత్వానిదే: హైకోర్టు

సాక్షి, అమరావతి: తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమం, నిర్వహణ చట్టనిబంధనల ప్రకారం జిల్లాకో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని హైకోర్టు పేర్కొంది. ఆయా జిల్లాల్లో స్వచ్ఛందసంస్థలు వృద్ధాశ్రమాలను నిర్వహిస్తున్నాయన్న నెపంతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోజాలదని తెలిపింది. చట్టనిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చట్టం ప్రకారం ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది రాపోలు ఆనందభాస్కర్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం సీజే ధర్మాసనం మరోసారి విచారించింది. పిటిషనర్ న్యాయవాది వి.రఘు వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంలో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిందని, అందులో రాష్ట్రంలో 72 వృద్ధాశ్రమాలు ఉన్నట్లు తెలిపిందని చెప్పారు. అయితే వాటిలో 70 వృద్ధాశ్రమాలను స్వచ్ఛందసంస్థలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రభుత్వ న్యాయవాది టి.ఎస్.ఎం.రంగారావు వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం సొంతగా లేదా స్వచ్ఛందసంస్థల సాయంతో వాటిని నిర్వహించవచ్చని చెప్పారు.


శ్రీసత్యసాయి జిల్లా తాటిమానుగుంతలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి


ఏలూరు జిల్లా చనుబండ గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

గడప గడపకు మన ప్రభుత్వం


విజయనగరం పూల్‌బాగ్ కాలనీలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


గుంటూరు జిల్లా చక్రాయపాలెం గ్రామంలో మహిళకు సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

సీమ ప్రగతికి మరో 'హైవే'

- రూ.1,500.11 కోట్లతో రేణిగుంట– కడప 4లేన్ల రహదారి
- గతిశక్తి ప్రాజెక్టులో భాగంగా నిర్మాణానికి కేంద్రం నిర్ణయం

సాక్షి, అమరావతి: రాయలసీమ ప్రగతి పథానికి మరో జాతీయ రహదారి దోహదపడనుంది. కడప-రేణిగుంట మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716)ని నిర్మించాలని కేంద్ర రవాణా–జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ నిర్ణయించింది. దేశంలోని పశ్చిమ–తూర్పు ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించనున్న షోలాపూర్–చెన్నై ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర రవాణా–జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ గురువారం ట్వీట్ ద్వారా వెల్లడించారు.



120 కి.మీ.. రహదారి

దేశంలో మౌలిక సదుపాయాల అనుసంధానానికి కేంద్రం ప్రారంభించిన గతి శక్తి ప్రాజెక్టులో భాగంగా కడప నుంచి తిరుపతి సమీపంలోని రేణిగుంట కూడలి మధ్య నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మిస్తారు. రూ. 1,500.11 కోట్లతో 120 కి.మీ. రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఈ హైవే నిర్మాణానికి అవసరమైన 1,066 ఎకరాల సేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వేగవంతం చేసింది. రెండు ప్యాకేజీల కింద టెండర్ల ప్రక్రియ నిర్వహించి 2024 నాటికి హైవేను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

పోర్టుల అనుసంధానం..

ఈ నాలుగు లేన్ల రహదారి ప్రధానంగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలను రేణిగుంట విమానాశ్రయంతో అనుసంధానిస్తుంది. ఈ రహదారి నిర్మాణంతో నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు, చెన్నై పోర్టుల నుంచి షోలాపూర్ పారిశ్రామిక ప్రాంతానికి సరుకు రవాణా సులభతరం కానుంది. దీంతో ఈ మధ్య ప్రాంతంలో ఉండే రాయలసీమలో అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయి. ప్రస్తుతం రోజూ సగటున 18 వేల వాహనాలు ప్రయాణిస్తున్న ఈ మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు లేన్ల జాతీయ రహదారితో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో ఆధ్యాత్మిక టూరిజం కూడా అభివృద్ధి చెందనుంది.

• తెలంగాణ

జైల్లో పెడతమంటే పెట్టుకోండి..!

- ఎమ్మెల్సీ కవిత • ఎన్ని చేసినా తెలంగాణలో బీజేపీ గెలుపు సాధ్యం కాదు

సాక్షి, హైదరాబాద్:'అది చేస్తం.. ఇది చేస్తం.. జైలులో పెడతామంటే.. పెట్టుకో.. ఏమైతది? భయపడేదేముంది? ఎక్కువలో ఎక్కువ ఏం చేస్తారు? ఉరి ఎక్కిస్తరా? జైల్లో పెడతరు అంతే కదా. పెట్టుకోండి..'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్ చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం నిందితుడు అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో కవిత పేరు ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో.. గురువారం ఉదయం ఆమెను కలిసేందుకు టీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈడీ తన పేరును ప్రస్తావించడంపై తీవ్రంగా స్పందించారు. 'ప్రజల అండ ఉన్నంతకాలం ఎవరికీ ఏ ఇబ్బంది ఉండదు. బీజేపీ ఎన్ని చేసినా ప్రజా సేవను విరమించేది లేదు. బీజేపీ వైఫల్యాలను ఎండగట్టడాన్ని ఆపబోము..' అని కవిత స్పష్టం చేశారు. 'భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుపై సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన భారతీయ జనతా పార్టీని గడగడలాడించింది. బీఆర్ఎస్ స్థాపనను జీర్ణించుకోలేక చౌకబారు రాజకీయాలకు తెరతీసింది. తెలంగాణ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రను భగ్నం చేసి ప్రజల ముందు పెట్టినందుకు కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది' అంటూ నిప్పులు చెరిగారు.

వచ్చే ఏడాది ఎన్నికల దృష్ట్యానే..

'ప్రధాని మోదీ తన రాజకీయ పంథాను మార్చుకోవాలి. ఈడీ, సీబీఐని ప్రయోగించి గెలవడం తెలంగాణలో బీజేపీకి సాధ్యం కాదు. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చిన ఈ 8 ఏళ్లలో 9 రాష్ట్రాల్లో ప్రజాస్వామికంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను బీజేపీ పడగొట్టింది. అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చింది. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నిక జరిగినా కూడా ఓ ఏడాది ముందు ఈడీ, ఆ తర్వాత మోదీ వస్తారు. వచ్చే ఏడాది తెలంగాణలో ఎన్నికలు ఉన్నందునే రాష్ట్రానికి మోదీ కంటే ముందు ఈడీ వచ్చింది. నాతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల మీద ఈడీ, సీబీఐ కేసులు పెట్టడం బీజేపీ హీనమైన, నీచమైన రాజకీయ ఎత్తుగడకు ఉదాహరణ. ఈ విషయంలో ఎటువంటి విచారణ ఎదుర్కోడానికైనా నా సిద్ధం. దర్యాప్తు సంస్థలకు సహకరిస్తాం. వారడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తాం. కానీ మీడియాలో లీకులు ఇచ్చి నాయకుల పేరును చెడగొట్టే బీజేపీ చౌకబారు ఎత్తుగడలు, ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొడతారు..'అని కవిత స్పష్టం చేశారు.

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి జీతాన్ని ఎందుకు జప్తు చేయకూడదు

- ప్రశ్నించిన హైకోర్టు • వివరాల సమర్పణకు ఆదేశం

సాక్షి, అమరావతి: కోవిడ్ సమయంలో వైద్యసేవలు అందించిన కాంట్రాక్ట్ వైద్యులకు జీతాల చెల్లింపునకు సంబంధించిన కేసులో పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమకు ఇప్పటివరకు జీతాలు చెల్లించలేదంటూ కాంట్రాక్ట్ వైద్యులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టు విచారించింది. జీతాలు చెల్లించనందుకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి నవంబర్ నెల జీతాన్ని ఎందుకు జప్తుచేయరాదో చెప్పాలని ప్రశ్నించింది. విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కోవిడ్ సమయంలో సేవలు అందించినప్పటికీ, తమకు ఇప్పటివరకు జీతాలు చెల్లించలేదంటూ కాంట్రాక్ట్ వైద్యులు డాక్టర్ గీత్ సత్యసాయిస్వరూప్, మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరి న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపిస్తూ.. జీతం చెల్లించాలంటూ పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది రమేష్ వాదనలు వినిపిస్తూ.. బకాయిల విడుదల కోసం ఆర్థికశాఖకు జాతీయ ఆరోగ్యమిషన్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పలుమార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశించారు.

2030 లోపుఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ఏపీ

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

సాక్షి, అమరావతి: ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించడానికి 2030 సంవత్సరంలోగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు సూచించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శ్యాక్స్), వైద్య, ఆరోగ్య శాఖ గురువారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమానికి విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, నివారణలో పాలు పంచుకుంటామని అందరిచేత మల్లాది విష్ణు ప్రమాణం చేయించారు. ఈ ఏడాది థీమ్ అయిన సమానత్వం 'అసమానతలను అంతం చేయడానికి ఏకమవుదాం' అనే ప్రచార కార్యక్రమాన్ని ఆయన తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. గిరిజన సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఆరుగురు వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున చెక్‌లను అందజేశారు. ఏపీ శ్యాక్స్ పీడీ జి.ఎస్. నవీన్ కుమార్, డాక్టర్ సమరం తదితరులు మాట్లాడారు. ఏపీ శ్యాక్స్ ఏపీడీ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, ప్రెసిడెంట్స్ ఎమర్జెన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ ఏపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, జేడీ డాక్టర్ కిషోర్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్ రావు, లెప్రసీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాస్మిన్, ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు. కాగా, కార్యక్రమానికి ముందుగా.. 'ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ర్యాలీ'ని పీడీ నవీన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.

ఎమ్మెల్యేలకు ఎర కేసులో.. నిందితులు ముగ్గురికి బెయిల్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసులో ముగ్గురు నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిందితులు రామచంద్ర భారతి, నందుకుమార్, సింహయాజీ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై గురువారం జస్టిస్ చిల్లకూర్ సుమలత విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. 'ఒక్కొక్కరు రూ.3 లక్షల పూచీకత్తుతో పాటు ఇద్దరు షూరిటీ సమర్పించాలి. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల మధ్య సిట్ ఎదుట విచారణకు హాజరుకావాలి. ముగ్గురి పాస్‌పోర్టులను పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేయాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ దేశం విడిచి వెళ్లరాదు. ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడకూడదు. సాక్ష్యాలను తారుమారు చేసే, సాక్షులను బెదిరించే ప్రయత్నం చేయకూడదు. కోర్టుకు ఆదేశించినప్పుడు విధిగా హాజరుకావాలి. ఫోన్‌నంబర్లు, ఈ–మెయిల్ అడ్రస్, ఇంటి చిరునామాతో అఫిడవిట్లు కోర్టుకు సమర్పించాలి. తుది ఉత్తర్వులు వచ్చే వరకు వీటిలో ఏం మారినా తెలియజేయాలి. ఈ షరతులను పాటించని పక్షంలో బెయిల్ రద్దు చేయడానికి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది'అంటూ న్యాయమూర్తి ఉత్తర్వులు వెల్లడించారు. దర్యాప్తు ప్రారంభమై దాదాపు నెల దాటింది. మెటీరియల్ సీజ్ చేయడం అంతా దాదాపు పూర్తయింది. నిందితులు కూడా నెల కంటే ఎక్కువ సమయం జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం అనుమతిస్తోంది.

చదరంగం పోటీలను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్), ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన జరిగే శాప్ లీగ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలను విజయవంతం చేద్దామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. ఈ నెల 4వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే ఈ పోటీల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ సాధన మేధోశక్తిని పెంచుతుందని, విద్యార్థి దశ నుంచే చెస్ శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు చురుగ్గా ఉంటారన్నారు. జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడులను తట్టుకునేందుకు చెస్ దోహదపడుతుందన్నారు. ది విజయవాడ చెస్ అసోయేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ మాట్లాడుతూ 1500 లోపు రేటింగ్ గల క్రీడాకారులు www.apchess.org/ www.sports.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న చెస్ ఆర్బిటర్ ఎన్.సాహితితో ఎమ్మెల్యే విష్ణు చెస్ ఆడి అక్కడున్న క్రీడాకారులను ఉత్తేజపరిచారు.


చదరంగంలో ఆర్బిటర్ సాహితితో పోటీ పడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఉత్సాహంగా జగనన్న క్రీడా సంబరాలు

విజయవాడ స్పోర్ట్స్: జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా స్థాయి క్రికెట్ పురుషుల, కబడ్డీ, వాలీబాల్ స్త్రీ, పురుషుల పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. విజయవాడ సింగ్‌నగర్ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీలను సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించాయి. కబడ్డీ పురుషుల పోటీల్లో విజయవాడ సెంట్రల్ మొదటి స్థానాన్ని సాధించగా, విజయవాడ ఈస్ట్, తిరువూరు జట్లు రెండు, మూడు స్థానాలను దక్కించుకున్నాయి. కబడ్డీ మహిళల పోటీల్లో జగయ్యపేట, విజయవాడ సెంట్రల్, తిరువూరు జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. వాలీబాల్ పురుషుల పోటీల్లో విజయవాడ సెంట్రల్, తిరువూరు, నందిగామ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను, మహిళల విభాగంలో జగ్గయ్యపేట ప్రథమ స్థానాన్ని సాధించింది. క్రికెట్ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్, డీఎస్ఏ, శాప్ కోచ్‌లు పర్యవేక్షించారు.


కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి

5 పైసల ఐడియా అదిరింది

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): 'కేవలం ఐదు పైసలకే రాజస్థానీ భోజనం'. మీరు చదివింది నిజమే కానీ.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం రెవెన్యూ కాలనీలో గురువారం ఒక్క రోజే ఈ ఆఫర్ నడిచింది. ఓ రెస్టారెంట్ యజమాని ప్రచారంలో భాగంగా ఈ ఆఫర్ ప్రకటించాడు. వివరాల్లోకి వెళితే.. మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ఎదురుగా ఉన్న రాజ్‌భోగ్ రాజస్తానీ రెస్టారెంట్‌ను నూతనంగా ప్రారంభించారు. గురువారం ఐదు పైసలు తెచ్చిన వారికి రాజస్థానీ భోజనం అని సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. ఇంకేముంది గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐదు పైసల నాణెంతో భారీ ఎత్తున జనం రెస్టారెంట్ ముందు క్యూ కట్టారు. కొందరు ద్విచక్ర వాహనాలపైన.. ఇంకొందరు కార్లలో సైతం వచ్చారు. రెస్టారెంట్ తెరిచిన వెంటనే నిర్వాహకులు ఐదు పైసల నాణెం తెచ్చిన తొలి 50 మందికి టోకెన్లు అందచేశారు. ఆ తర్వాత వచ్చిన వారికి భోజనం (రూ.420)లో 50 శాతం రాయితీ ఇచ్చారు. ఐదు పైసల ఐడియా వర్క్ అవుట్ కాగా.. మొత్తానికి 270 మంది భోజనం చేశారు.



మొగల్రాజపురంలోని రెస్టారెంట్ ముందు క్యూ కట్టిన భోజన ప్రియులు

విధి రాతకు ఎదురీత

ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది లేదు... పట్టుదలతో శ్రమిస్తే ఎంతటి కార్యమైనా తలవంచి తీరుతుంది.. ఇదే విషయాన్ని నిరూపించాడు ఈ దివ్యాంగ యువకుడు... వైకల్యమనే విధిరాతను తానే తిరగ రాసుకున్నాడు. పోలియో మిగిల్చిన క'న్నీటి'లోనే విన్యాసమాడాడు.. చచ్చుబడిన కాళ్లతోనే ఈత కొలనులో పతకాల పంట పండిస్తూ విజయ తీరాలకు చేరాడు. అందరితోనూ భళా 'లక్ష్మణ' అనిపించుకుంటున్నాడు.

భళా... లక్ష్మణ!

- ఈత కొలనులో దివ్యాంగుడి రికార్డుల మోత
- జాతీయ స్థాయిలో పతకాల పంట
- ఏపీ ఎలక్షన్ కమిషన్ ఐకాన్‌గా నియామకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని 60వ డివిజన్ వాంబేకాలనీకి చెందిన అన్నపురెడ్డి సాంబిరెడ్డి, సుశీల దంపతులకు నలుగురు కొడుకులు సంతానం. రెండోసారి సంతానంలో కవలలు జన్మించారు. వీరిలో ఒక్కరైన లక్ష్మణరావుకు నాలుగేళ్ల వయస్సులో కాళ్లు చచ్చు పడిపోయాయి. తల్లిదండ్రులు ఎన్ని ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలియో బారిన పడిన అతను అదే వ్యాధితో జీవిత పోరాటాన్ని సాగిస్తున్నాడు.

కాళ్లు ఆడించమని నదిలోకి దింపితే.. ఏకంగా ఈదేశాడు..

లక్ష్మణరావు కాళ్లు బాగుపడాలని అతని తల్లిదండ్రులు ఎంతో శ్రమించారు. ఎంత ప్రయత్నించినా తమ కుమారుడి కాళ్లు బాగు పడకపోవడంతో ఓ వైద్యుడి సలహా మేరకు అతన్ని బందరు లాకుల వద్ద కృష్ణానది కాలువ ఒడ్డున కూర్చోబెట్టి నీళ్లలో కాళ్లు కొట్టించడం నేర్పించేవారు. రోజూ ఇదే పనిగా వెళ్లి ప్రయత్నించే లక్ష్మణరావుకు అక్కడ ఈత కొడుతున్న యువకులను చూసి ఈతపై ఆసక్తి పెరిగింది. ఎలా అయినా తాను కూడా ఈత నేర్చుకోవాలనే పట్టుదలతో ఈదటం నేర్చేసుకొని ఆ కాలువలో అటూ ఇటూ ఈత కొట్టేసేవాడు.

తిరుమలయ్య కుమార్ సాయంతో పోటీల్లోకి:

బందరు లాకుల వద్ద అతని ఈతను చూసిన ఓ స్నేహితుడు రైల్వే విభాగంలో పని చేసే తిరుమలయ్యకుమార్ అనే వ్యక్తికి లక్ష్మణరావు సంగతి చెప్పాడు. దీంతో లక్ష్మణరావును పిలిపించుకున్న అతను విజయవాడ గాంధీనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో అతనికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి ఈత పోటీల్లో పాల్గొనేలా చేశాడు.


చిన్నారులకు ఈతలో మెలకువలు నేర్పుతున్న లక్ష్మణరావు



లక్ష్మణరావును అభినందిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోటీల్లోకి దిగితే పతకం కొట్టాల్సిందే...:

ఈత పోటీల్లోకి మన లక్ష్మణరావు దిగితే ఏదో ఒక పతకం వచ్చి తీరాల్సిందే. నగర, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలతో పాటుగా బెంగళూరు, కలకత్తా, ముంబాయి, అసోం, రాజస్థాన్, గుజరాత్‌లలో జరిగిన పలు జాతీయస్థాయి పోటీలు, మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొని ఆయన అనేక అవార్డులను సాధించారు.


తనకొచ్చిన కొన్ని అవార్డులు చూపుతూ..

విద్యాభ్యాసం.. : అన్నపురెడ్డి లక్ష్మణరావు పదో తరగతి వరకూ రాణిగారితోటలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో చదివారు. సప్తగిరి జూనియర్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీ కట్టి మధ్యలోనే చదువును ఆపేశారు.

పది వేల మందికి పైగా శిక్షణ

లక్ష్మణరావు తాను ఈతలో ప్రావీణ్యం, మెడల్స్ సాధించడమే కాకుండా గాంధీనగర్ స్విమ్మింగ్ పూల్‌లో 2010వ సంవత్సరంలో కోచ్‌గా చేరి అప్పటి నుంచి నేటి వరకూ సుమారు 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఈతలో శిక్షణ ఇచ్చి అనేక అవార్డులను సాధించేలా చేశారు.

ఒలింపిక్స్‌లో నెగ్గాలన్నదే ఆశయం

ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో అనేక అవార్డులను సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నాకు సహకరించిన కుటుంబ సభ్యులకు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఏషియన్, ఒలింపిక్స్‌లో ఆడి గెలవాలనేది నా జీవిత ఆశయం. 2023లో చైనాలో జరిగే ఏషియన్ గేమ్స్, 2024లో పారిస్‌లో జరిగే ఒలంపిక్స్‌కు వెళ్లాలనే పట్టుదలతో ఉన్నాను. దాతలు సహకారం అందిస్తే కచ్చితంగా ఈ పోటీల్లో పాల్గొని మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకొస్తాను.


- లక్ష్మణరావు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఐకాన్‌గా నియామకం..

ఈతలో అనేక అవార్డులను సాధిస్తున్న ఈ విజేతను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవలే తమ ప్రచారకర్తగా నియమించింది. రాష్ట్రం నుంచి మొత్తం ఐదుగురిని (వైజాగ్–2, నెల్లూరు–1, రాజమండ్రి–1) కాగా విజయవాడ నగరం నుంచి లక్ష్మణరావు ఎలక్షన్ కమిషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు.

ఛాయాచిత్రాలు.. చరిత్రకు సాక్ష్యాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చరిత్రకు సాక్ష్యాలు ఛాయా చిత్రాలేనని ఆంధ్రప్రదేశ్ మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) ఆవరణలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (న్యూఢిల్లీ), ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 130వ వరల్డ్ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు గురువారం సాయంత్రం జరిగాయి. వి.లక్ష్మణరెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో ఒకనాడు చరిత్ర తెలుసుకోవాలంటే శిలా శాసనాలు ఉపయోగపడేవని, 1839 తర్వాత కెమెరా అందుబాటులోకి వచ్చిన తర్వాత ఫొటోగ్రాఫర్లు ప్రజల జీవన విధానాన్ని అధ్యయనం చేసి మంచి చిత్రాలను ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. శాసన సభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఎప్పుడో గడిచిపోయిన క్షణాలను ఎప్పటికీ సజీవంగా మన ముందు ఉంచేవి ఫొటోలేనన్నారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, కల్చరల్ సెంటర్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కళాత్మక ఛాయాచిత్ర ప్రదర్శనలో భారతీయులదే అగ్రస్థానం పేరుతో ముద్రించిన కరపత్రాన్ని అతిథులు ఆవిష్కరించారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.


ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తున్న మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 2-12-2022

ఫ్యాషన్







వెచ్చని వేడుక

చల్లని దీవెనలతో పెళ్లిళ్ల సీజన్ గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతోంది. బ్రైడల్ కలెక్షన్ పై ఫోకస్ పెరిగింది. డిజైనర్ స్టైల్స్ ఎలాగూ ఉన్నాయి. ఎంపికలే అటూ ఇటుగా మారుతుంటాయి. కాలానికి తగినట్టు డ్రెస్సింగ్ ఉంటే ఫ్యాషనబుల్ పేరుతో పాటు సౌకర్యంగా సందడిలో పాల్గొనవచ్చు. అందుకు లాంగ్ స్లీవ్స్, లాంగ్ జాకెట్స్ శారీస్ మీదకు బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తున్నాయి.

పట్టు చీరల రెపరెపలు ఎలాగూ గ్రాండ్‌గా ఉంటాయి. వాటిని ప్లెయిన్ బ్లౌజ్‌తో జత చేయాలా, ఎంబ్రాయిడరీ దారాలతో మెరిపించాలా అని ఆలోచించేవారికి లాంగ్ స్లీవ్స్ సరైన ఎంపిక అవుతుంది.



ఈ డాక్టర్లకు ఆల్ ది బెస్ట్


● డాక్టర్ రూత్ జాన్‌పాల్

హైదరాబాద్‌లో ఇద్దరు డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నియామకం పొందారు. అదేం పెద్ద విశేషం? విశేషమే. ఎందుకంటే వీరిద్దరూ ట్రాన్స్‌జెండర్లు. గత కొంతకాలంగా దేశంలో తమ ఆత్మగౌరవం కోసం, ఉపాధి కోసం, హక్కుల కోసం పోరాడుతున్న 'ఎల్‌జిబిటి' సమూహాలకు ఈ నియామకం ఒక గొప్ప గెలుపు. అందుకే వీరికి ఆల్ ది బెస్ట్ చెప్పాలి.


● డాక్టర్ ప్రాచీ రాథోడ్

గత వారం ప్రాచీ రాథోడ్ (30), రూత్ జాన్ పాల్ (28) ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో హెచ్.ఐ.వి రోగులకు చికిత్స అందించే ఏ.ఆర్.టి విభాగంలో వైద్యాధికారులుగా నియమితులయ్యారు. వీరు రాష్ట్రంలో డాక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన తొలి ట్రాన్స్‌జెండర్లు కావడం విశేషం. కొత్త చరిత్రకు నాంది పలికిన వీరు 'సాక్షి' తో తమ అనుభవాలు పంచుకున్నారు.

మా కమ్యూనిటీకి విజయమిది...

ఈ ఇద్దరిలో డాక్టర్ రూత్‌ది ఖమ్మం. డాక్టర్ ప్రాచీ రాథోడ్‌ది ఆదిలాబాద్ జిల్లా. చిన్న వయసులోనే డాక్టర్లు కావాలని కలలు కన్నప్పటికీ, కుటుంబ సభ్యుల మద్దతు కరువై, స్కూల్లో తోటి విద్యార్థుల వేధింపులు, సమాజంలో చిన్నచూపు వంటివి ఎదుర్కొంటూనే లక్ష్యాన్ని సాధించగలిగారు. తమలాంటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ప్రభుత్వ రంగంలో భాగస్వామ్యం కోసం పోరాడుతున్న ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీకి ఇదొక చారిత్రాత్మక విజయం అని వీరు అంటున్నారు.

అర్హత ఉన్నా... తిరస్కరించారు...

'మల్లారెడ్డి వైద్య విజ్ఞాన సంస్థలో 2018లో వైద్యవిద్య పూర్తి చేసినప్పటి నుంచి ఉద్యోగం కోసం విఫలయత్నాలు ఎన్నో చేశా. సిటీలో కనీసం 15–20 ఆసుపత్రులు ఉద్యోగ దరఖాస్తులను తిరస్కరించాయి. దీనికి కారణం మా జెండర్ అని ముఖం మీద చెప్పలేదు. కానీ అది మాకు అర్థమైంది' అన్నారు డా.రూత్.. తొలుత ఓ ఆసుపత్రిలో ఇన్‌టర్న్‌షిప్ చేస్తున్నప్పుడు తనకు ఏ సమస్యా రాలేదనీ లింగ మార్పిడి విషయం బయటపెట్టిన తర్వాతే తనకు ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారామె. తన అర్హతలను కాకుండా జెండర్‌నే చూశారన్నారు.

తెలిశాక... వద్దన్నారు...

డాక్టర్ ప్రాచీ రాథోడ్ రిమ్స్ నుంచి డిగ్రీ పూర్తి చేసి ప్రైవేట్‌రంగంలో పనిచేస్తూ కెరీర్ ప్రారంభించారు. సిటీలో ఓ ఆస్పత్రిలో పని చేస్తూనే ఎమర్జెన్సీ మెడిసిన్‌లో డిప్లొమా చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూడేళ్లపాటు పని చేశారు. తన మార్పిడి గురించి తెలిశాక.. రోగులరాకకు ఇబ్బంది అవుతుందని ఆసుపత్రి భావించడంతో ఉద్యోగం పోగొట్టుకున్నారు.

ఒకే తరహా కష్టం కలిపింది స్నేహం

అనేకానేక బాధాకరమైన అనుభవాల తర్వాత బతుకుదెరువు వేటలో భాగంగా వీరు ఇద్దరూ వేర్వేరుగా గత ఏడాది నారాయణగూడలో ఎన్.జి.ఓ ఆధ్వర్యంలో ప్రారంభమైన ట్రాన్స్‌జెండర్ క్లినిక్ 'మిత్ర్'లో చేరారు. మంచి స్నేహితులయ్యారు. ఒకే తరహా సమస్యల మధ్య ఏర్పడిన తమ స్నేహం వేగంగా దృఢమైన బంధంగా బలపడిందనీ ఒకరికొకరు తోడుగా, తోడబుట్టిన అక్కచెల్లెళ్లను మించి సాగుతోందని వీరు చెప్పారు. ప్రతీ సందర్భంలోనూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్నామంటున్నారు.

ఏపీలో పెన్షన్ బెస్ట్

'ఉస్మానియాలో సహ వైద్యులు, రోగులు బాగా సహకరిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడం సంతోషంగా ఉంది' అని వీరు చెప్పారు. పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ట్రాన్స్‌జెండర్లకు పింఛనుగా ఏటా రూ.10 వేలు ఇస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ అలాంటి ప్రత్యేక సహాయ సహకారాలు అన్ని చోట్లా మొదలు కావాలని ఆశిస్తున్నామన్నారు.

'మేమిద్దరం ట్రాన్స్‌ఉమెన్‌గా నీట్ పీజీ పరీక్షలను రాశాము, అయితే థర్డ్ జెండర్‌ను గుర్తించి అడ్మిషన్‌ను మంజూరు చేసేందుకు వీలు కల్పించిన 2014 నాటి సుప్రీం కోర్ట్ తీర్పుకు అనుగుణంగా రిజర్వ్‌డ్ సీట్లు పొందలేదు' అని చెప్పారు. తమ కమ్యూనిటీకి జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తుతామని, సమాజంలో సమాన హక్కులకై పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేస్తున్నారు.

దేశంలోనూ అక్కడక్కడ

వైద్య రంగంలో కెరీర్ ఎంచుకుంటున్న ట్రాన్స్‌జెండర్స్ దేశంలో మరికొన్ని ప్రాంతాల్లోనూ కనిపిస్తున్నారు. కర్ణాటకలో త్రినేత్ర హల్దార్ గుమ్మరాజు ట్రాన్స్ డాక్టర్‌గా, యాక్టివిస్ట్‌గా జాతీయస్థాయిలో పేరొందారు. అలాగే కేరళకు చెందిన వి.ఎస్.ప్రియ కూడా లింగ మార్పిడి చేయించుకున్న తొలి వైద్యురాలిగా రాణిస్తున్నారు. ఇప్పటికే రెండు ట్రాన్స్‌జెండర్ క్లినిక్స్ ప్రారంభించిన తొలి నగరంగా సిటీ నిలిచింది. ఇద్దరు ట్రాన్స్ డాక్టర్లకు చిరునామాగా నిలిచిన ఘనతను కూడా తన సొంతం చేసుకుంది.

– ఎస్.సత్యబాబు
సాక్షి, సిటీబ్యూరో

కథలు చెప్తే డబ్బులొస్తాయి

ప్రతి నెలా బెంగళూరులో టికెట్ షోస్ జరుగుతాయి. అందరూ టికెట్‌లు కొంటారు. సినిమా చూసేందుకు కాదు. కథ వినేందుకు. అరవై దాటిన వారికి ఒక షో. 15 నుంచి 25 ఏళ్ల లోపు వారికి ఒక షో. 10 ఏళ్ల పిల్లలకు ఒక షో. 44 ఏళ్ల అపర్ణ జైశంకర్ తన ఎదురుగా ఉన్న శ్రోతలను బట్టి కథలను ఎంచుకుని వారికి ఆసక్తి ఉండేలా చెబుతుంది. అన్నీ మహా భారతం నుంచే. వింటే భారతం వినాలి అన్నారు కదా. మన దేశం కథల పుట్ట. బాల్యంలో కథలు వినే సంస్కారం నేర్చుకుంటాం. ఇవాళ కథలు చెప్పేవారు లేరు. ఆ బాధ్యత తలకెత్తుకొని ప్రొఫెషనల్ స్టోరీటెల్లర్‌గా ఉపాధి పొందుతోంది అపర్ణ.


స్టోరీ టెల్లర్
● అపర్ణ

'మా ఇంట్లో మా బామ్మ అన్ని కథలూ చెప్పేది. కాని భారతం చెప్పేది కాదు. ఇంట్లో మహాభారతం చెప్పుకుంటే ఇంటి సభ్యుల మధ్య కుమ్ములాటలు వస్తాయని ఆమె నమ్మేది' అని నవ్వుతుంది అపర్ణా జయశంకర్. చిత్రంగా అపర్ణ ఇప్పుడు మహాభారతంలోని కథలనే చెబుతూ తిరుగుతోంది.

బెంగళూరులో ఉండే ఈ మౌఖిక కథకురాలు సొంతంగా ఒక్క కథా అల్లదు. సొంతంగా ఒక్క కథా రాయదు. కాని సాంస్కృతిక పరంపరలో ఉన్న కథలు, ముఖ్యంగా భారత కథలన్నీ భిన్న కోణాల నుంచి చెప్పి శ్రోతలను ఆకట్టుకుంటుంది. 'మన దేశంలో ప్రతి వంద కిలోమీటర్లకు ఒక రామాయణం ఉంటుంది. వంద భారతాలు ఉంటాయి. భారతంలో ఏ ఒక్క కథా ఒక్కలా ఉండదు. ప్రతి కథకు ఎన్నో పార్శ్వాలు ఉంటాయి' అంటుంది అపర్ణ.

ఎం.ఏ. సోషల్ వర్క్ చేసి ఆ తర్వాత హెచ్.ఆర్. రంగంలో పదేళ్లపాటు పని చేసిన అపర్ణా జయశంకర్ జీవితం కళాత్మకంగా ఉండాలని ఉద్యోగం వదిలేసింది. కథాత్మకంగా మార్చుకుని స్టోరీ టెల్లర్ అయ్యింది. ప్రస్తుతం మన దేశంలో 'స్టోరీ టెల్లర్స్', 'టేల్ టెల్లర్స్' మంచి సంఖ్యలో ఉన్నారు. బెంగళూరులో 'స్టోరీ టెల్లర్స్ సొసైటీ' ఉంటే హైదరాబాద్‌లో 'స్టోరీ టెల్లర్స్ అసోసియేషన్' ఉంది. వీరంతా 'బతుకంతా కథలాగా సాగిపోవాలి' అనుకునేవారే.

'అంతరించి పోతున్న కళల్లో కథలు చెప్పడం ఒకటి. దానిని కాపాడుకోవాలి. ఒకప్పుడు కథలు చెప్పేవారు, కథలు వినేవారు కోకొల్లలుగా ఉండేవారు. ఇవాళ ఇద్దరూ తగ్గిపోయారు' అంటుంది అపర్ణ. అయితే అపర్ణలో విశేషమేమంటే మన దేశంలోని భిన్న భారతాలలోని కథలన్నీ సందర్భానుసారం చెబుతుంది. చారిత్రక కోణం ఇవ్వడానికి చూస్తుంది. 'దుర్యోధనుడు పూర్తిగా చెడ్డవాడైతే ఇవాళ్టికీ కేరళలో, ఉత్తరాఖండ్‌లో అతనికి గుడులెందుకున్నాయ్' అని ప్రశ్నిస్తుంది. 'వర్ణ వివక్షను అతడు రూపుమాపాడు. అందుకే జనానికి ఆరాధన' అని చెబుతుంది. కథతో పాటు ఒక లోతైన పరిశీలనకు శ్రోతలను పురిగొల్పడం ఆమె ప్రత్యేకత. 16 నుంచి 25 ఏళ్ల లోపు యువతీ యువకులకు కథలు చెప్పేటప్పుడు తప్పకుండా సైరంధ్రీ–కీచకుడు, అర్జునుడు–ఊర్వశీ కథలు చెబుతుంది. కీచకుడి వాంఛను సైరంధ్రి నిరాకరించింది. అలాగే ఊర్వశిని అర్జునుడు నిలువరించాడు. 'ఈ కథలు చెప్పడం వల్ల ప్రేమ, లైంగిక చర్య పరస్పర అంగీకారంతో మాత్రమే జరగాలని ఈ తరానికి చెప్పడం సులువవుతుంది. వారి అవగాహన పెరుగుతుంది' అంటుందామె.

'గాంధారి చీమల మీద వేడినీళ్లు పోయడంతో రాణి చీమ శాపం ఇచ్చిందని తెలుగు ప్రాంతంలో ఒక కథ ప్రచారంలో ఉంది. అలాగే సముద్రం వొడ్డున గవ్వకాయలు ఆడుతుంటే గుడ్లు పెట్టే చోటు పాడు చేసినందుకు తాబేలు ఆగ్రహానికి గురయ్యింది. ఇలాంటి మరుగున పడిన కథలు శ్రోతలకు ఆసక్తిగా ఉంటాయి' అంటుంది అపర్ణ.

కథలు చెప్పడమే కాదు... కథలు వినడం కూడా ఒక అవసరమే అని అపర్ణ వంటి స్టోరీ టెల్లర్లు భావిస్తున్నారు. వీరిలో కొందరు 'ఇండియన్ స్టోరీటెల్లర్స్ హీలింగ్ నెట్‌వర్క్' (ఐ.ఎస్.హెచ్.ఎన్) మొదలుపెట్టి తమ జీవిత కథలను మొర పెట్టుకుని బరువు దించుకుని స్వస్థత పొందాలనుకునే బాధితుల కథలను వింటూ ఉంటారు. మొర వినడం కూడా ఒక మందే అని వీరి విశ్వాసం.

'కథలు చనిపోవు. కథలతో ముడిపడిన మనుషులు మాత్రమే చనిపోతారు' అని ధర్మరాజు భారతంలో అన్నాడట. అపర్ణ ఆ మాటనే చెప్పి 'కథలు బతకాలని చూస్తున్నాయి. బతికించే పని మనదే' అంటుంది.

విని బతికిద్దాం. లేదా చెప్పయినా బతికిద్దాం.

వంటిల్లు

జ్యూస్‌లే కొంచెం కారంగా

పోషకాలు సమృద్ధిగా అందడం కోసం గర్భిణి రోజూ ఫ్రూట్ జ్యూస్ తాగాలి. అలాగని చలి కాలంలో రోజూ చల్లగా తియ్యగా జ్యూస్ తాగడం కొంచెం కష్టమే. అందుకే కొంచెం స్పైసీగా ఉండే తాజా పళ్ల రసాలను ట్రై చేస్తారా?... అవి ఎలా చేయాలో ఈ 'వంటిల్లు' చూడండి.



బ్లడీ డ్రైవర్

కావలసినవి: పండిన టొమాటోలు – 4 పెద్దవి; నిమ్మకాయలు–4 ; కమలాపండ్లు–6 ; పుదీన ఆకులు–2 (ఇష్టమైతేనే).

తయారీ: ● టొమాటోలను మిక్సీలో వేసి రసం తీసి వడపోయాలి. ● కమలాపండ్లు కూడా రసం తీసుకుని టొమాటో రసంలో కలపాలి. ● చివరగా నిమ్మకాయలను రసం తీసి కలపాలి. ● టొమాటోలు, కమలా పండ్ల రసం తీసేటప్పుడు అవసరాన్ని బట్టి (రుచి తగ్గకుండా) నీటిని వేసుకోవాలి. ● పుదీనా ఆకులతో గార్నిష్ చేయాలి. నిల్వ ఉంచకుండా తాజాగా తాగాలి.



స్పైస్‌డ్ ఫ్రూట్ పంచ్

కావలసినవి: కమలాపండ్ల రసం – 100 ఎమ్ఎల్ ; ఆపిల్ జ్యూస్ – 100 ఎమ్ఎల్ ; జామ పండు రసం– 100ఎమ్ఎల్ ; నీరు – పావు కప్పు ; అల్లం తురుము – అర టీ స్పూన్ ; యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క పొడి– అర టీ స్పూన్ (అభిరుచిని బట్టి).

తయారీ: ● స్టవ్ మీద సాస్ పాన్ పెట్టి అన్ని జ్యూస్‌లు, నీరు, అల్లం తురుము వేసి కలుపుతూ సన్నమంట మీద గోరు వెచ్చగా చేయాలి (పోషకాలు కోల్పోయే స్థాయిలో మరిగించరాదు). ● ముందుగా వేడి చేసుకున్న గ్లాసులో పోసుకుని సుగంధద్రవ్యాల పొడి చల్లి తాగాలి. ● శీతాకాలంలో చల్లటి జ్యూస్ తాగడానికి సయించనప్పుడు, రోజూ తియ్యటి జ్యూస్‌లు తాగి జిహ్వ హితవు పోయినప్పుడు ఇలాంటి స్పైసీ జ్యూస్ చక్కటి రుచినిస్తుంది.



బనానా పైనాపిల్ లస్సీ

కావలసినవి: బాగా పండిన అరటిపండు – ఒకటి (ముక్కలు చేయాలి) ; పైనాపిల్ ముక్కలు – అర కప్పు ; మీగడ లేని పెరుగు – కప్పు ; దాల్చిన చెక్క పొడి– పావు టీ స్పూన్ ; చక్కెర– 2 టీ స్పూన్‌లు లేదా రుచికి తగినంత.

తయారీ: ● అరటి పండు, పైనాపిల్ ముక్కల్లో పెరుగు, చక్కెర వేసి మిక్సీలో మెత్తగా బ్లెండ్ చేయాలి. ● గ్లాసులో పోసి పైన దాల్చిన చెక్క పౌడర్‌తో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



కోకోనట్ డ్రీమ్

కావలసినవి: పచ్చి కొబ్బరి తురుము – 200 గ్రా ; మంచి నీరు – పావు లీటరు ; పండిన అరటిపండ్లు – 4 ; నిమ్మకాయ – 1.

తయారీ: ● కొబ్బరి తురుమును మిక్సీలో వేసి నీటిని పోస్తూ బ్లెండ్ చేయాలి. బ్లెండ్ చేసే కొద్దీ కొబ్బరిలోని క్రీమ్ పైకి తేలుతుంది. ● ఈ పాలను మరొక పాత్రలోకి వంపి, పైకి తేలిన క్రీమ్ తిరిగి కొబ్బరి పాలలో కలిసి పోయే వరకు పక్కన ఉంచాలి. వడపోయవద్దు. ● కొబ్బరి కోరు పూర్తిగా మెదగకుండా కొంత ఉండిపోయినప్పటికీ అలాగే తాగడం ఆరోగ్యకరం. ● అరటి పండు గుజ్జును మెత్తగా బ్లెండ్ చేసి అందులో నిమ్మరసం కలపాలి. ● ఈ మిశ్రమాన్ని కొబ్బరి పాలలో పోసి సమంగా కలిసే వరకు బాగా కలపాలి.



10-4

- '10-4' అనేది 'మెసేజ్ రిసీవ్' లేదా 'ఒకే' చెప్పడానికి ఉపయోగిస్తారు. రేడియో కమ్యూనికేషన్‌లలో దీన్ని వాడే వారు.
- **డ్యాన్స్ విత్ డెవిల్:** రిస్క్ చేసే సందర్భాల్లో ఉపయోగించే మాట ఇది. ముఖ్యంగా రాజకీయాల్లో
- **ఐ లవ్ యూ టు ది మూన్:** ఒకరి పట్ల మన అపారమైన ప్రేమను వ్యక్తం చేయడానికి ఉపయోగించే మాట. ప్రసిద్ధ పిల్లల పుస్తకం 'గెస్ హౌ మచ్ ఐ లవ్ యూ' నుంచి ఇది పాపులర్ అయింది.
- **యూ ఆర్ సో సౌండ్:** ఆరోగ్యంగా ఉన్నప్పుడు, ఆర్థికంగా మంచి స్థాయిలో ఉన్నప్పుడు, అందంగా కనిపించినప్పుడు, తెలివిగా వ్యవహరించినప్పుడు, నిజాయితీగా ప్రవర్తించినప్పుడు... మొదలైన సందర్భాల్లో ఉపయోగించే మాట.

● గేమింగ్ నేడే విడుదల

ఛాన్సే లేదు తప్పించుకోలేవు!



సర్వైవల్ హారర్ నెరేటివ్–డ్రివెన్ వీడియోగేమ్ 'ది కాలిస్టో ప్రొటోకాల్' నేడు విడుదలైంది. 2320 సంవత్సరంలో జూపిటర్స్ మూన్‌లో జాకబ్‌లీ, అతడి పార్ట్‌నర్ మాక్స్ కేంద్రంగా జరిగే కథ ఇది. బ్లాక్ ఐరన్ జైలు నుంచి జాకబ్‌లీ తప్పించుకోవడానికి చేసే ప్రయత్నాలు ఆటలో ఆసక్తికరం. ఈ గేమ్ డైరెక్టర్ గ్లె స్కోఫీల్డ్‌కు 'హారర్ ఇంజినీరింగ్'లో మంచి పట్టు ఉంది. 2008లో విడుదలైన థర్డ్ పర్సన్ సర్వైవల్ హారర్ గేమ్‌కు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. వీడియో గేమ్ ఆర్టిస్ట్, డిజైనర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ అనుభవం సంపాదించిన స్కోఫీల్డ్ హారర్ గేమ్స్‌ను ఇష్టపడే గేమర్స్ నాడి తెలిసిన దర్శకుడు. **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● సక్సెస్ స్టోరీ

'మ్యూజిక్ కూడెదుతుందా!' అని ఆ తల్లిదండ్రులు ఎప్పుడూ తిట్టలేదు. తమ కలల రెక్కలను కుమారుడికి తొడిగే ప్రయత్నం చేయలేదు. ఆ రకంగా రిత్విజ్ శ్రీవాస్తవ అదృష్టవంతుడు. అయితే కష్టాన్ని తప్ప అదృష్టాన్ని ఎప్పుడూ నమ్ముకోలేదు శ్రీవాస్తవ. కష్టాన్ని, ఇష్టాన్ని జత చేసి ఎలక్ట్రానిక్ మ్యూజిషియన్‌గా చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నాడు రిత్విజ్ శ్రీవాస్తవ....

సమ్మోహన స్వరసాగరం



పంథొమ్మిది సంవత్సరాల వయసులో 'ఉడ్ గయే' అనే వీడియో సాంగ్‌తో అంతర్జాల సంచలనంగా మారాడు రిత్విజ్ శ్రీవాస్తవ. ఆ తరువాత వచ్చిన 20 సాంగ్స్ కూడా సూపర్, డూపర్ హిట్స్.

మన దేశానికి చెందిన ఇడియం–క్లాసికల్ ఫ్యూజన్ జానర్‌కు చెందిన అరుదైన సంగీతకారులలో ఒకడిగా ప్రశంసలు అందుకుంటున్న రిత్విజ్ శ్రీవాస్తవ ఎవరు?

పుణె (మహారాష్ట్ర)కు చెందిన శ్రీవాస్తవ సంగీతంతో చెలిమి చేస్తూ పెరిగాడు. తల్లి గాయని. తండ్రి తబలా ప్లేయర్. పండిట్ ఉదయ్ బావల్కర్ దగ్గర పది సంవత్సరాల వయసు నుంచే సంగీతాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. వేకువజామునే నిద్ర లేచే శ్రీవాస్తవ ఆ ప్రశాంత ఉదయంలో సంగీత సాధన చేసేవాడు. పదకొండు సంవత్సరాల వయసులో తొలి పాటకు స్వరకల్పన చేసి అందరినీ అబ్బురపరిచాడు. టీనేజ్‌లో హిప్–హాప్ మ్యూజిక్ వైపు మొగ్గు చూపినప్పటికీ దేశీయ సంగీత మూలాలను ఎప్పుడూ మరవలేదు శ్రీవాస్తవ. 'నా వ్యక్తిగత అనుభవాల నుంచే నా మ్యూజిక్ పుడుతుంది. నాలో ప్రతి చలనాన్ని నా సంగీతం ప్రతిఫలిస్తుంది' అంటున్న శ్రీవాస్తవ ఇప్పటి వరకు నాలుగు అల్బమ్‌లు తీసుకువచ్చాడు.

మ్యూజిక్ ప్రొడ్యూసర్, కంపోజర్, సాంగ్ రైటర్, సింగర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నప్పటికీ దేశీయ సంగీత మూలాలు ఎప్పుడూ మరవలేదు.

'మనకు గర్వించదగిన సంగీత సంపద ఉంది. పాశ్చాత్య సంగీతాన్ని ఎంత అభిమానించినా మన సంగీతానికి మాత్రం ఎప్పుడూ దూరం కాలేదు' అంటున్న శ్రీవాస్తవకు హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం ఉంది.

'మనసును తాకే సంగీతం ఎక్కడి నుంచి వస్తుంది?' అనే ప్రశ్నకు శ్రీవాస్తవ చెప్పే జవాబు ఇది...

'మనసును తాకే సంగీతం మనసు నుంచే పుడుతుంది. మనసు తెల్ల కాగితంలా ఉన్నప్పుడు, ఎలాంటి అలజడి లేకుండా ప్రశాంత సరోవరంలా ఉన్నప్పుడు మంచి సంగీతం దానికదే పుడుతుంది' అంటాడు శ్రీవాస్తవ.


రిత్విజ్ శ్రీవాస్తవ

'మనదేశంలోని ప్రతిభావంతులైన సంగీతకారులలో రిత్విజ్ శ్రీవాస్తవ ఒకరు. సంగీతాన్ని చూసే విధానం, వినే విధానం భిన్నంగా ఉంటుంది. అదే సంగీతంలో తనదైన శైలిని సృష్టించుకునేలా చేసింది' అంటున్నాడు డీజేగా ప్రసిద్ధుడైన ఉదయన్ సాగర్.

ప్రయాణాలు అంటే పెద్దగా ఇష్టపడని శ్రీవాస్తవ తన ఇంటి గదినే ప్రపంచంగా చేసుకున్నాడు. తనలో తానై, తానే ప్రపంచమై కొత్త సంగీతాన్ని కల కన్నాడు. సాధన చేశాడు. ఇంటర్నెట్ మ్యూజిక్ సెన్సేషన్‌గా గుర్తింపు పొందిన శ్రీవాస్తవపై విమర్శలు కూడా లేకపోలేదు.

'అన్నీ గీతాలు ఒకేలా ఉంటాయి' అంటూ శ్రీవాస్తవను సోషల్ మీడియాలో వెక్కిరించేవాళ్లతో పాటు 'మనసు పెట్టి వినండి. ప్రతి పాటలోని ప్రత్యేకతను ఆస్వాదించండి' అని గట్టిగా సమర్థించే వాళ్లు కూడా ఉన్నారు.

వీటి గురించి ఎలా ఉన్నా 'సంగీతం అనేది నాకు కెరీర్ కాదు. జీవితం' అనే శ్రీవాస్తవ మాట అందరినీ ఆకట్టుకుంది!

● సేవాపథం

'మనిషి మనసులో దయాగుణం అనే చిన్న విత్తనం పడితే, అది చెట్టుగా మారి విలువైన ఫలాలను ఇస్తుంది' అంటారు పెద్దలు. మానవత్వానికి అద్దం పట్టిన ఎందరో మహనీయుల గురించి చిన్న వయసులోనే తల్లి ద్వారా తెలుసుకుంది. 'నేను సైతం' అంటూ సేవాపథంలో పయనిస్తోంది పౌలోమి శుక్లా.

వారి కలలకు రెక్కలు ఇచ్చింది


పౌలోమి శుక్లా

గుజరాత్‌లోని భుజ్‌లో 2001లో భూకంపం వచ్చిన సమయంలో పౌలోమి శుక్లా తల్లి జిల్లా మెజిస్ట్రేట్‌గా పనిచేస్తోంది. ఆనాటి విలయంలో ఎంతోమంది పిల్లలు అనాథలయ్యారు. వారిని హరిద్వార్‌లోని అనాథాశ్రమాలలో చేర్పించడంలో శుక్లా తల్లి ముఖ్యమైన పాత్ర పోషించింది.

తల్లితో పాటు అనాథాశ్రమాలకు వెళ్లేది శుక్లా. పిల్లలతో స్నేహం చేసేది. వారి బాధలను అర్థం చేసుకునేది. అప్పటి నుంచి తాను సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ఉన్న ఇప్పటి వరకూ అనాథల చెయ్యి ఎప్పుడూ విడవలేదు శుక్లా.

ఎంతోమంది అనాథలకు ఎన్నో రకాలుగా సహాయపడుతూనే ఉంది. ఇదంతా ఒక ఎత్తయితే అనాథలపై రాసిన పుస్తకం మరో ఎత్తు.

అనాథల గురించి తెలుసుకుంటున్న క్రమంలో శుక్లాకు అర్థమైన విషయం ఏమిటంటే, మన దేశంలో ఎంతమంది అనాథలు ఉన్నారు. అనే విషయంలో పక్కా సమాచారం లేదు. దీంతో పాటు అనాథల్లో ఎక్కువ మంది ప్రభుత్వపథకాలకు నోచుకోవడం లేదు.


ఎన్నో రకాలుగా అధ్యయనం చేసి మన దేశంలోని అనాథలపై ఎన్నో కోణాల్లో 'వీకెస్ట్ ఆన్ ఎర్త్: ఆర్ఫన్స్ ఆఫ్ ఇండియా' పేరుతో పుస్తకం రాసింది శుక్లా. ఈ పుస్తకం ఎంతో చర్చను రేకెత్తించింది.

'అనాథల్లో ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారు. అయితే ఉన్నతచదువుల విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు' అంటున్న శుక్లా అనాథలకు విద్యా,ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలంటూ కోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేసింది.

'శుక్లా మా స్కూల్ స్టూడెంట్ అని చెప్పుకోవడానికి గర్విస్తున్నాం. ఎన్నో రాష్ట్రాలలో విధానపరమైన మార్పులు రావడానికి ఆమె సంకల్పబలమే కారణం' అంటున్నారు లక్నోకు చెందిన సిటీ మాంటిసోరీ స్కూల్ ఫౌండర్ మేనేజర్ జగదీష్ గాంధీ.

''మన కెరీర్ గురించి ఆలోచించడంలో ఎలాంటి తప్పు లేదు. అయితే ఇదే సమయంలో సమాజం గురించి కూడా ఆలోచించండి. లోతుగా విశ్లేషించండి. 'మాకంటూ ఎవరూ లేరు' అనే వారికి అండగా నిలవండి. సాటి మనిషికి ఉపయోగపడే మంచి పనిచేస్తే మనకు ఎంతో శక్తి వస్తుంది'' అని ఢిల్లీలోని ఒక కాలేజీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించింది ఇరవై ఎనిమిది సంవత్సరాల శుక్లా.

ఆమె స్ఫూర్తితో ఎంతోమంది సేవాపథంలో పయనిస్తారనడంలో సందేహం లేదు.



'మాకంటూ ఎవరూ లేరు' అనే వారికి అండగా నిలవండి. సాటి మనిషికి ఉపయోగపడే మంచి పనిచేస్తే మనకు ఎంతో శక్తి వస్తుంది.
– పౌలోమి శుక్లా

వాట్సాప్‌లో సెల్ఫ్ మెసేజ్

వాట్సాప్ 'మెసేజ్ యువర్ సెల్ఫ్' అనే కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చారు. దీని వల్ల ఉపయోగం ఏమిటి? షాపింగ్ జాబితా సిద్ధం చేసుకోవచ్చు. రిమైండ్స్ ప్లాన్ చేసుకోవచ్చు. నోట్స్ ప్రిపేర్ చేసుకోవచ్చు. ఈ ఫీచర్ కోసం...1. చాట్ మెసేజ్ ఆప్షన్–క్లిక్ చేయాలి 2. కాంటాక్ట్ లిస్ట్‌లో బ్రాకెట్‌లో కనిపించే 'యూ' క్లిక్ చేసి సెల్ఫ్ మెసేజ్ చేయవచ్చు.



జియోలో షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్

వినోదాన్ని ఇష్టపడే ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకొని షార్ట్ వీడియో ఫార్మాట్ యాప్‌ని ప్రకటించింది జియో. క్రియేటర్స్, సింగర్స్, మ్యూజిషియన్స్, డాన్సర్స్, ఫ్యాషన్ డిజైనర్స్...మొదలైన వారికి ఉపయోగపడే ఈ యాప్ జనవరి 2023లో అందరికీ అందుబాటులోకి రానుంది.

నోకియా ఎక్స్30



డిస్‌ప్లే: 6.43 అంగుళాలు
పిక్సెల్ రిజల్యూషన్: 1080×2400
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్
256జీబి 8జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 12
ఫ్రంట్ కెమెరా: 16ఎంపీ
బ్యాటరీ: 4200 ఎంఏహెచ్



ఓటీటీకి ఛత్రీవాలి


● రకుల్

బాలీవుడ్‌లో బిజీగా ఉన్న రకుల్‌ప్రీత్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఛత్రీవాలి'. తేజస్ ప్రభ విజయ్ దేవాస్కర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. 'ఛత్రీవాలి' సినిమాను డైరెక్ట్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం (డిసెంబరు 1) సందర్భంగా ప్రకటించారు మేకర్స్. అయితే స్ట్రీమింగ్ తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. ''హర్యానా బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుంది. ఓ కండోమ్ ఫ్యాక్టరీలో క్వాలిటీ హెడ్‌గా పని చేసే పాత్రలో రకుల్‌ప్రీత్ సింగ్ నటించారు. ఆరోగ్యకరమైన శృంగారం గురించిన కొన్ని అంశాలను మా సినిమాలో చూపించాం. అలాగే ఎయిడ్స్ వ్యాధి, సెక్స్ అంశాలపై అవగాహన కలిగించేలా సందేశాత్మకంగా కూడా మా సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

అప్పుడు నేను బోల్తా పడలేదు

– అడివి శేష్

''నువ్వు అలాంటి పాత్రలు చేయొద్దు, ఇలాంటి కథలు ఎంచుకోవద్దు.. అంటూ కొందరు చెప్పిన సలహాలు పాటించి బోల్తా పడ్డాను (ఫ్లాప్ సినిమాలను ఉద్దేశిస్తూ). కానీ, నన్ను నేను నమ్ముకుని స్వతహాగా కథలు ఎంచుకుని చేస్తున్నప్పుడు బోల్తా పడలేదు (హిట్ సినిమాలను ఉద్దేశిస్తూ)'' అని హీరో అడివి శేష్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్ 2'. అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా నటించారు. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అడివి శేష్ చెప్పిన విశేషాలు.



● నేను కథ వినేటప్పుడు ఓ ప్రేక్షకునిగా ఆలోచిస్తాను. ఎక్కడైనా బోర్ కొడుతుంటే మొహమాటం లేకుండా చెప్పేస్తాను. 'హిట్ ది ఫస్ట్ కేస్'లో విశ్వక్ సేన్ నటించాడు. 'హిట్ ది సెకండ్ కేస్'లో నన్ను చేయమని శైలేష్ అడిగినప్పుడు.. 'నేనే ఎందుకు చేయాలి' అన్నాను. కృష్ణదాస్ అనే పోలీసాఫీసర్ పాత్రకి మీరు కరెక్టుగా సరిపోతారని చెప్పాడు. 'ఈ విషయం విశ్వక్ సేన్‌కి తెలుసా?' అని శైలేష్‌ని అడిగితే.. 'తెలుసు' అన్నాడు. అప్పుడు 'హిట్ 2' కథ వినేందుకు ఒప్పుకున్నాను. పైగా నానీగారు కూడా ఫోన్ చేసి కథ వినమన్నారు. స్క్రిప్ట్ వినగానే నచ్చింది. నా గత ఐదు చిత్రాల్లో నాలుగింటి స్క్రిప్ట్‌లో ఇన్‌వాల్వ్ అయ్యాను. కానీ, 'హిట్ ది సెకండ్ కేస్' స్క్రిప్ట్‌లో మాత్రం ఇన్‌వాల్వ్ కాలేదు. శైలేష్ బాగా రాశాడు. నేను ఒక నటుడిగా మాత్రమే పని చేశాను.

● సమాజంలోని చాలా ముఖ్యమైన అంశాలను, కొందరు కిల్లర్స్‌గా ఎందుకు మారుతున్నారు? అనే విషయాలను ఈ సినిమాలో చర్చించాం. 'మేజర్' సినిమా బయోపిక్ కావడం, పైగా ఆర్మీ నేపథ్యంలో ఉండటంతో చాలా ఒత్తిడి ఉండేది. కానీ, 'హిట్ 2'కి ఎలాంటి ఒత్తిడి లేదు. ప్రీమియర్ చూసిన వారందరూ చాలా బాగుందని చెప్పడం హ్యాపీ. ఈ చిత్రాన్ని హిందీ, కన్నడలో డబ్ చేస్తున్నాం. ఈ నెల 13న హిందీలో విడుదలవుతుంది.

● థ్రిల్లర్ నేపథ్యంలో నేను నటించిన 'క్షణం' చిత్రంతో నాకు మంచి పేరు వచ్చింది. అలాగే 'గూఢచారి' కమర్షియల్ సక్సెస్ ఇచ్చింది. నా ఫేవరెట్ టాప్ టెన్ చిత్రాల్లో చిరంజీవిగారి 'ఖైదీ', కార్తీగారి 'ఖైదీ' ఉన్నాయి. 'హిట్ 2' చిత్రం కమల్ హాసన్‌గారి 'విక్రమ్'లా హిట్ కావాలనుంది.

'హిట్' ఫ్రాంచైజీలో లాస్ట్ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఉంటుంది. నేను ముద్దు సన్నివేశాల్లో నటించినప్పుడు అమ్మ తిట్టింది. ఫైట్స్, డ్యాన్స్‌లా అది కూడా నటనలో భాగమని అమ్మకి చెప్పాను. నాకు ఓ మంచి కామెడీ సినిమా చేయాల నుంది. 'హిట్ 3'లో నేను కూడా ఉంటాను. ఆస్కార్ అవార్డు పొందిన ఓ హాలీవుడ్ మూవీని రీమేక్ చేయనున్నాం. అందులో నా పాత్ర రఫ్‌గా ఉంటుంది.

నేను అమెరికాలో ఉన్నప్పుడు గంటన్నర ప్రయాణం చేసి మరీ వెళ్లి మహేశ్‌బాబుగారి 'మురారి' సినిమా చూశాను. నేను అభిమానించిన హీరోలు మహేశ్‌బాబు ('మేజర్' సినిమా నిర్మాత), నానీ (హిట్ 2) గార్లతో పని చేయడం చాలా సంతోషంగా ఉంది. నాలోని నిజాయతీ, నా ప్యాషన్‌ని మహేశ్, నానీగార్లు నమ్మారు కాబట్టే నాతో సినిమాలు నిర్మించారు.

ఊహకందని చిత్రం


● ప్రియ, విశ్వక్ సేన్, అయేషా, వికాస్

వికాస్ వశిష్ఠ, ప్రియ వడ్లమాని, చైతన్యా రావ్, అయేషా ఖాన్ ప్రధాన పాత్రల్లో విశ్వక్ సేన్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ముఖచిత్రం'. 'కలర్ ఫొటో' దర్శకుడు సందీప్ రాజ్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన ఈ సినిమాతో గంగాధర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్‌కేఎన్ సమర్పణలో ప్రదీప్ యాదవ్, మోహన్ యల్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఓ నిర్మాతగా నిర్మాతల కష్టాలు నాకు తెలుసు. కొత్త కంటెంట్ ఉందని తెలిసి ఈ సినిమాలో కీ రోల్ చేశాను. ఈ సినిమా షూటింగ్ చేసిన రెండు రోజులు ఓ వైబ్రేషన్‌లో ఉండిపోయాను'' అన్నారు. ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టర్‌ను చేయగలనని నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు వశిష్ఠ. ''చిన్న చిత్రంగా మొదలైన మా సినిమా విశ్వక్ సేన్ రాకతో పెద్ద సినిమా అయింది'' అన్నారు గంగాధర్. ''నేను తప్ప 'కలర్ ఫొటో' చిత్రానికి పని చేసినవాళ్లందరూ ఈ సినిమాలో ఉన్నారు. సందీప్ రాజ్ మరోసారి ఓ క్లాసిక్ మూవీ చేశాడని ఆశిస్తున్నాను. దర్శకుడు గంగాధర్‌కు ఆల్ ద బెస్ట్'' అన్నారు దర్శకుడు సాయి రాజేష్. ''ఈ సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు సందీప్ రాజ్. ''ప్రేక్షకుల ఊహకు అందని మల్టీజానర్ ఫిల్మ్ ఇది'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కాలభైరవ పాల్గొన్నారు.

బాగా నటించడం నా బాధ్యత

– నవీన్ చంద్ర



''సరికొత్త థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'రిపీట్'. తమిళనాడులో జరిగిన వాస్తవ ఘటనలతో శ్రీనివాసన్ అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని హీరో నవీన్ చంద్ర అన్నారు. అరవింద్ శ్రీనివాసన్ దర్శకత్వంలో పీజీ ముత్తయ్య, విజయ్ పాండే నిర్మించిన తమిళ చిత్రం 'దెజావు'. నవీన్ చంద్ర లీడ్ రోల్‌లో నటించిన ఈ చిత్రంలో మధుబాల, 'సత్యం' రాజేష్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని 'రిపీట్' పేరుతో తెలుగులోకి అనువదించారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో గురువారం నుంచి ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ–''ఇందులో ట్రైనీ ఐపీఎస్ విక్రమ్ పాత్ర చేశాను. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఈ సినిమా ఎంగేజింగ్‌గా ఉందని చూసినవాళ్లు చెబుతుంటే సంతోషంగా ఉంది. ప్రస్తుతం బాలకృష్ణగారి 'వీర సింహా రెడ్డి', రామ్‌చరణ్– శంకర్‌గారి మూవీతో పాటు మరికొన్ని సినిమాలు చేస్తున్నాను. సినిమా, ఓటీటీ.. మీడియం ఏదైనా నటుడిగా బాగా నటించడమే నా బాధ్యత'' అన్నారు.


● రవికుమార్, రాజ్ తరుణ్, శివకుమార్

తిరగబడరా సామి!

'యజ్ఞం, పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాల ఫేమ్ ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో 'తిరగబడరా సామి' అనే సినిమా ఆరంభమైంది. రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సురక్ష ఎంటర్‌టైన్మెంట్ మీడియాపై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కేఎస్ రామారావు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. మరో నిర్మాత పోకూరి బాబూరావు స్క్రిప్టును ఏఎస్ రవికుమార్‌కి అందించారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, దర్శకులు వీరశంకర్, రాజా వన్నెం రెడ్డి, నిర్మాతలు టి.ప్రసన్న కుమార్, బెక్కెం వేణుగోపాల్, డీయస్ రావు, నటి-నిర్మాత జీవితా రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి, సంగీతం: జేబీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత. బెక్కెం రవీందర్.

పోలీస్ ఆక్రోశం


● అరుణ్ విజయ్

అరుణ్ విజయ్ హీరోగా జీఎస్ఆర్ కుమారవేలన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'సినమ్'. యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ అండ్ ఎమోషనల్ రివెంజ్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబరులో విడుదలైంది. ఈ సినిమా తెలుగులో 'ఆక్రోశం' పేరుతో ఈ నెల 9న విడుదల కానుంది. తెలుగులో విడుదల చేస్తున్న నిర్మాతలు సి.హెచ్. సతీష్ కుమార్, ఆర్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ – ''ఒక పోలీసాఫీసర్ కథ ఇది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా అరుణ్ విజయ్ అద్భుతంగా నటించారు. గతంలో మేం 'ఏనుగు' అనే సినిమా రిలీజ్ చేశాం. ఇప్పుడు మరో మంచి కథతో రూపొందిన 'ఆక్రోశం'తో వస్తున్నాం'' అన్నారు.

అరుదైన వ్యాధితో....


● పూనమ్ కౌర్

అరుదైన ఫైబ్రో మయాల్జియా వ్యాధితో బాధపడుతున్నారు పూనమ్ కౌర్. ఈ వ్యాధికి సంబంధించి ఆమె కేరళలో చికిత్స చేయించుకున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, నిద్ర లేమి, కండరాల నొప్పి, త్వరగా అలసిపోవడం .. అనేవి ఈ వ్యాధి లక్షణాలు. అయితే ప్రస్తుతం పూనమ్ కౌర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త యర్రమాద వెంకన్న. ''నవంబర్ 10న మాతో కలిసి సూరత్ గాంధీ పార్కులో చేనేతపై జీఎస్టీ పన్ను ఎత్తివేయాలన్న నిరసన కార్యక్రమంలో, 11న సబర్మతి ఆశ్రమ మౌన దీక్షలో పాల్గొన్నారు పూనమ్ కౌర్. 12న ఢిల్లీలో బ్రహ్మకుమారీస్ కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఆమెకు వెన్నునొప్పి రావడంతో కేరళ వెళ్లారు. 18న ఆమెకు ఫైబ్రో మయాల్జియా వ్యాధి నిర్ధారణ అయ్యింది. కేరళలో చికిత్స అనంతరం మహారాష్ట్రలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది'' అని వెల్లడించారు వెంకన్న.

తండ్రీకొడుకుల యాక్షన్

శాంతి చంద్ర హీరోగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. దీపికా సింగ్, శిమ్రితీ బతీజా, నిక్కీషా రంగ్‌వాలా హీరోయిన్లు. ఆడారి సాయి దర్శకత్వంలో జీఎస్‌బాబు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ని దర్శకుడు నక్కిన త్రినాథరావు రిలీజ్ చేసి, ''ఈ సినిమాకు 'డర్టీ ఫెలో' యాప్ట్ టైటిల్'' అన్నారు. ''ఓ తండ్రి తన కొడుకును సరైన మార్గంలో పెంచకపోతే ఆ కొడుకు సమాజానికి ఏ విధంగా హానికరం అవుతాడనే నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. తండ్రీకొడుకుల మధ్య సాగే యాక్షన్ డ్రామా ఇది'' అన్నారు శాంతి చంద్ర, ఆడారి సాయి.


● శాంతి చంద్ర

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
185	54
63,284	18,813

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,464	▽	4
డోజోన్స్	34,331	▽	258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,558	▽	15
డాక్స్	14,490	▲	93
షాంఘై	3,165	▲	14
నికాయ్	28,226	▲	257

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	53,181	▲	404
బంగారం (99.5 స్వచ్ఛత)	52,968	▲	402
వెండి (కేజీ)	62,203	▲	1,303

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.35	82.02
€	యూరో	ఒకటి	83.15	86.16
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	96.49	99.74
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.41	60.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.11	56.47
S$	సింగపూర్ డాలర్	ఒకటి	58.81	60.76
SAR	సౌదీ రియాల్	ఫారిన్ కరెన్సీ	20.66	22.33
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారిన్ కరెన్సీ	21.22	23.01
¥	చైనా యువాన్	ఫారిన్ కరెన్సీ	10.34	12.37

తయారీ బాగుంది..!

నవంబర్‌లో పీఎంఐ 55.7గా నమోదు



న్యూఢిల్లీ: తయారీ రంగానికి సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) నవంబర్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. సూచీ 55.7గా నమోదయ్యింది. అక్టోబర్‌లో ఈ సూచీ 55.3 వద్ద ఉంది. గడచిన మూడు నెలల్లో సూచీ ఈ గరిష్ఠ స్థాయిల్లో నమోదు కావడం ఇదే తొలిసారి. సూచీ 50పైన ఉంటే వృద్ధిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన పీఎంఐ వరుసగా 17 నెలల నుంచి వృద్ధి బాటనే పయనిస్తోంది. సూచీకి సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పొలియానా డీ లిమా తెలిపిన సమాచారం ప్రకారం, నవంబర్‌లో కొత్త ఆర్డర్లు, ఎగుమతులు పెరిగాయి. వ్యయ ఒత్తిడులు కొంత తగ్గాయి. ఆయా అంశాల నేపథ్యంలో నిర్వహణా పరిస్థితులు మెరుగుపడ్డాయి. వృద్ధి అవకాశాలు, ఉపాధి కల్పన పట్ల సంస్థలు ఆశావహ దృక్పథంతో ఉన్నాయి. ఇలాంటి సానుకూల అభిప్రాయం నెలకొనడం ఎనిమిదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. వరుసగా తొమ్మిదవ నెల ఉపాధి అవకాశాల్లో పటిష్టత నమోదయ్యింది. . దాదాపు 400 మంది తయారీదారుల ప్యానల్‌లో కొనుగోళ్లు జరిపే మేనేజర్లకు పంపిన ప్రశ్నాపత్రం, ప్రతిస్పందనల ఆధారంగా ఈ సూచీ కదలికలను నమోదుచేయడం జరుగుతుంది.

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.46 లక్షల కోట్లు

- నవంబర్‌లో 11 శాతం వృద్ధి
- రూ.1.4 లక్షల కోట్లు దాటడం ఇది వరుసగా తొమ్మిదవ నెల



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) భారీ వసూళ్లు కొనసాగుతున్నాయి. వినియోగ వ్యయాల దన్నుతో నవంబర్‌లో 11 శాతం పెరిగి (2021 నవంబర్‌తో పోల్చి) రూ.1,45,867 కోట్లుగా నమోదయ్యాయి. జీఎస్‌టీ వసూళ్లు రూ.1.4 లక్ష కోట్లు దాటడం ఇది వరుసగా తొమ్మిదవ నెల. ఇందులో రెండు నెలలు రూ.1.50 లక్షల కోట్లు దాటాయి. కాగా, ఆగస్టు తర్వాత తక్కువ వసూళ్లు జరగడం నవంబర్‌లోనే మొదటిసారి. ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలు విభాగాల వారీగా..

- సెంట్రల్ జీఎస్‌టీ రూ.25,681 కోట్లు
- స్టేట్ జీఎస్‌టీ రూ.32,651 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.77,103 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.38,635 కోట్లుసహా).
- సెస్ రూ.10,432 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.817 కోట్లతో సహా)
- 'ఒకే దేశం- ఒకే పన్ను' నినాదంతో 2017 జూలైలో పలు రకాల పరోక్ష పన్నుల స్థానంలో ప్రారంభమైన జీఎస్‌టీ వ్యవస్థలో 2022 ఏప్రిల్‌లో వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.1,67,650 కోట్లుగా నమోదయ్యాయి.

2022 నుంచి ఇలా...

నెల	జీఎస్‌టీ ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి 2022	1,40,986
ఫిబ్రవరి	1,33,026
మార్చి	1,42,095
ఏప్రిల్	1,67,650
మే	1,40,885
జూన్	1,44,616
జూలై	1,48,995
ఆగస్టు	1,43,612
సెప్టెంబర్	1,47,686
అక్టోబర్	1,51,718
నవంబర్	1,45,867

నవంబర్‌లోనూ రయ్.. రయ్

మారుతీ, హ్యుందాయ్, టాటా, మహీంద్రా అమ్మకాలు జూమ్



ముంబై: దేశీయంగా వ్యక్తిగత రవాణా గిరాకీ పుంజుకోవడంతో నవంబర్‌లో వాహన విక్రయాలు దూసుకెళ్లాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రా కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని నమోదుచేశాయి. కియా ఇండియా, హోండా కార్స్, స్కోడా, ఎంజీ మోటార్స్ సంస్థలు సైతం చెప్పుకోదగిన స్థాయిలో అమ్మకాలు జరిపాయి. దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ మొత్తం 1,59,044 వాహనాలు విక్రయించింది. గతేడాది నవంబర్ నాటి 1,39,184 అమ్మకాలతో పోలిస్తే ఇవి 14 శాతం అధికం. డిసెంబర్‌తో కలుపుకొని ఈ ఏడాదిలో మొత్తం 38 లక్షల కార్ల విక్రయాలను అంచనా వేస్తున్నట్లు కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీవాస్తవ తెలిపారు. హ్యుందాయ్ మోటార్ ఇండియా నవంబర్ విక్రయాలు 36 శాతం పెరిగి 64,004 యూనిట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో కంపెనీ 46,910 వాహనాలను అమ్మింది. టాటా మోటార్స్ మొత్తం విక్రయాలు 62,192 నుంచి 21 శాతం పెరిగి 75,478కు చేరాయి. కియా ఇండియా మొత్తం అమ్మకాలు 69 శాతం పెరిగి 24,025 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇక ద్విచక్ర వాహనాల గణాంకాలను పరిశీలిస్తే.., హీరో మోటోకార్ప్ అమ్మకాలు నవంబర్‌లో 12 శాతం పెరిగి మొత్తం 3.90 లక్షల యూనిట్లను విక్రయించినట్లు ఆ కంపెనీ తెలిపింది. బజాజ్ ఆటో విక్రయాలు 19 శాతం మేర క్షీణించాయి.

కంపెనీ	నవంబర్ 2022	నవంబర్ 2021	క్షీణత/వృద్ధి(%)
మారుతీ సుజుకీ	1,59,044	1,39,184	(+)14
హ్యుందాయ్	64,004	46,910	(+)36
టాటా	75,478	62,192	(+)21
ఎంఅండ్ఎం	30,392	19,458	(+)56
హోండా కార్స్	7,051	5,457	(+)29
ఎంజీ మోటార్స్	4,079	2,481	(+)64
స్కోడా ఆటో	4,433	2,196	(+)102
టయోటా	11,765	13,003	(+)10
కియా	24,025	14,214	(+)69
నిస్సాన్	6,746	5,605	(+)20
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,06,552	3,79,276	(−)19
హీరో మోటో	3,90,932	3,49,393	(+)12
సుజుకీ	79,359	63,156	(+)27
టీవీఎస్	2,77,123	2,72,693	(+)2
రాయల్ ఎన్‌ఫీల్డ్	70,766	51,654	(+)86
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	4,093	4,085	(+)4
అశోక్ లేలాండ్	14,561	10,480	(+)39
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	7,960	7,116	(+)12
మహీంద్రా	30,528	27,681	(+)10

రామ్‌కో సిమెంట్స్‌కు సీఎస్‌ఆర్ బాక్స్ ఇంపాక్ట్ అవార్డులు



హైదరాబాద్: రామ్‌కో సిమెంట్స్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) కింద రెండు విభాగాల్లో సీఎస్‌ఆర్‌బాక్స్ ఇంపాక్ట్ అవార్డులు దక్కించుకుంది. అరియలూర్ ప్లాంట్‌కు వాటర్ శానిటైషన్ అండ్ హైజీన్(వాష్) అవార్డు, ఆర్ఆర్ నగర్ ప్లాంట్‌కు ఎంప్లాయి వాలంటీరింగ్ ఇనీషియేటివ్ అవార్డులు లభించాయి. సీఎస్‌ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజంలో మెరుగైన ఫలితాలను సాధించే కంపెనీలను సీఎస్‌ఆర్‌బాక్స్ ఈ అవార్డుల ద్వారా ప్రోత్సహిస్తుంటుంది. సీఎస్‌ఆర్‌ను నిర్బంధంగా కాకుండా ఓ బాధ్యతగా రామ్‌కో సిమెంట్స్ భావిస్తుందని సీఈవో ఏవీ ధర్మకృష్ణన్ తెలిపారు. గత 60 ఏళ్లగా కంపెనీ స్థాపించిన నాటి నుంచి సీఎస్‌ఆర్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

రికార్డుల పరంపర

- తాజా గరిష్ఠాలకు సూచీలు
- ఎనిమిదో రోజూ అదే జోరు
- ఫెడ్ వడ్డీరేట్ల పెంపు వేగం తగ్గింపు ఆశలు




ముంబై: ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్ల పెంపు వేగాన్ని తగ్గిస్తుందనే ఆశలతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ ఎనిమిదో రోజూ కొనసాగింది. సానుకూల పీఎంఐ గణాంకాలు సెంటిమెంట్‌ను బలపరిచింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. మిడ్ సెషన్ తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ర్యాలీ వేగం తగ్గింది. ముఖ్యంగా ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లు రాణించడంతో గురువారం సెన్సెక్స్ 185 పాయింట్లు లాభపడి 63,284 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 483 పాయింట్లు ఎగిసి 63,583 వద్ద తాజా జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 54 పాయింట్లు పెరిగి 18,813 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 130 పాయింట్లు దూసుకెళ్లి 18,888 వద్ద కొత్త గరిష్టాన్ని నెలకొల్పింది. ఇంధన, ప్రైవేట్ బ్యాంక్స్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ అరశాతం ర్యాలీతో 1.36 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.289.86 కోట్లకు చేరింది. డిసెంబర్ తొలి ట్రేడింగ్ సెషన్‌లోనూ విదేశీ ఇన్వెస్టర్లు రూ.1566 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 2665 కోట్ల షేర్లను కొన్నారు. డిసెంబర్‌లో వడ్డీ రేట్ల పెంపుపై నెమ్మదిస్తామని ఫెడ్ రిజర్వ్ ప్రకటన తర్వాత ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ ఎనిమిది పైసలు బలపడి 81.22 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సిమెంట్ షేర్లలో గురువారం ర్యాలీ చోటు చేసుకుంది. ఇన్‌పుట్ వ్యయాలు తగ్గడంతో పాటు వర్షాకాలం ముగియడంతో డిమాండ్ పుంజుకొని కంపెనీల మార్జిన్లు పెరగవచ్చనే అంచనాలతో ఈ రంగ షేర్లకు డిమాండ్ లభించింది. దాల్మియా భారత్, బిర్లా కార్పొరేషన్, జేకే సిమెంట్, ఇండియా సిమెంట్, జేకే లక్ష్మీ సిమెంట్, అంబుజా సిమెంట్స్, రామ్‌కో సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు 1-5 శాతం ర్యాలీ చేశాయి.
- జొమాటో షేరు రెండున్నర శాతం పెరిగి రూ.67 వద్ద స్థిరపడింది. ఆలీబాబాకు చెందిన ఆలీపే సింగపూర్ హోల్డింగ్ సంస్థ బుధవారం జొమాటోకు చెందిన 3.07 శాతం వాటా విక్రయించింది. దీంతో గడచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు ఆరుశాతం ర్యాలీ చేసింది.

విలువలో రిలయన్స్ ఇండస్ట్రీస్ నంబర్ 1

- తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- హురూన్ ఇండియా 500 కంపెనీల జాబితా



ముంబై: దేశంలో అత్యంత విలువైన (మార్కెట్ విలువ ఆధారితంగా) లిస్టెడ్ కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో నిలిచింది. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. '2022 బర్గండి ప్రైవేట్ హురూన్ ఇండియా 500' కంపెనీల జాబితా గురువారం విడుదలైంది. 500 కంపెనీల ఉమ్మడి విలువ రూ.226 లక్షల కోట్లుగా ఉంది. రిలయన్స్ మార్కెట్ విలువ రూ.17.25 లక్షల కోట్లు. రెండో స్థానంలో ఉన్న టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.11.68 లక్షల కోట్లుగా ఉంది. రూ.8.33 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానంలో నిలిచింది. ఇన్ఫోసిస్ (రూ.6.46 లక్షల కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.6.33 లక్షల కోట్లు), ఎయిర్‌టెల్ (రూ.4.89 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ (రూ.4.48 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.4.32 లక్షల కోట్లు), అదానీ టోటల్ గ్యాస్ (రూ.3.96 లక్షల కోట్లు), అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.3.81 లక్షల కోట్ల విలువతో టాప్-10లో ఉన్నాయి.

అదానీ కంపెనీలు ఎనిమిది..

''గౌతమ్ అదానీకి సంబంధించి ఏడు కంపెనీలు ఇందులో ఉన్నాయి. అంబుజా సిమెంట్స్ కొనుగోలుతో ఎనిమిదో కంపెనీ వచ్చి చేరింది. ఉపఖండంలో అత్యంత సంపన్నుడు కావడంతో ఇదేమీ ఆశ్చర్యాన్నివ్వలేదు. టాటా సన్స్ నుంచి ఆరు కంపెనీలు, సంజీవ్ గోయెంకా నుంచి మూడు, కుమార మంగళం బిర్లా నుంచి మూడు చొప్పున కంపెనీలు జాబితాలో ఉన్నాయి''అని హురూన్ ఇండియా ఎండీ అనాస్ రెహమాన్ జునైద్ తెలిపారు. లిస్టులో తెలంగాణ సంస్థల సంఖ్య రెండు పెరిగి 31కి చేరింది. టాప్ 10 యంగెస్ట్ కంపెనీల జాబితాలో సువెన్ ఫార్మా, మెన్సా బ్రాండ్స్ చోటు దక్కించుకున్నాయి.

క్వార్టర్స్‌లో జ్ఞాన దత్తు



నొంతబురి (థాయ్‌లాండ్): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-15 బాలుర సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ కుర్రాడు జ్ఞాన దత్తు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్ఞాన దత్తు 21-15, 18-21, 21-6తో కొనుకె యామవాకి (జపాన్)పై గెలిచాడు. అండర్-15 బాలికల డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన తన్వీ రెడ్డి-దుర్గా ఇషా జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తన్వీ-దుర్గా ద్వయం 21-15, 21-12తో నఫీనా-రిస్పినా (ఇండోనేసియా) జోడీపై గెలిచింది. అండర్-17 బాలికల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన ఉన్నతి హుడా కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి 21-11, 21-19తో నుత్‌చవీ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. అండర్-17 బాలికల డబుల్స్‌లో వెన్నెల- శ్రియాన్షి వలిశెట్టి జోడీ రెండో రౌండ్‌లో ఓడిపోయింది.

ఒక్క రోజే 506

- ఇంగ్లండ్ జట్టు ప్రపంచ రికార్డు
- పాక్‌తో తొలి టెస్టులో తొలి రోజే పరుగుల వరద
- 112 ఏళ్ల రికార్డు బద్దలు
- నలుగురు బ్యాటర్ల సెంచరీలు

మ్యాచ్‌కు ముందు రోజు ఇంగ్లండ్ జట్టులోని పలువురు క్రికెటర్లు వైరల్ ఇన్ఫెక్షన్ బారిన పడటంతో... తొలి టెస్టు నిర్ణీత సమయానికి మొదలవుతుందో లేదోనని సందేహం. అయితే గురువారం ఉదయం గం. 7:30కు తుది జట్టులో ఆడేందుకు 11 మంది కోలుకున్నారని ఇంగ్లండ్ టీమ్ మేనేజ్‌మెంట్ పాకిస్తాన్ బోర్డుకు సమాచారం ఇచ్చింది. దాంతో నిర్ణీత సమయానికి ఇంగ్లండ్, పాకిస్తాన్ మధ్య తొలి టెస్టు మొదలైంది. మ్యాచ్ మొదలయిందో లేదో ఇంగ్లండ్ జట్టు తొలి ఓవర్ నుంచే పరుగుల వరద పారించింది. టెస్టు మ్యాచ్‌లో టి20 మెరుపులను చూపించింది. జీవంలేని పిచ్‌పై పాక్ బౌలర్లు తేలిపోగా... ఇంగ్లండ్ జట్టులో ఏకంగా నలుగురు బ్యాటర్లు సెంచరీల మోత మోగించారు. ఫలితంగా 145 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో మ్యాచ్ రోజే అత్యధిక పరుగులు చేసిన జట్టుగా ఇంగ్లండ్ ప్రపంచ రికార్డు నెలకొల్పింది.



జాక్ క్రాలీ



బెన్ డకెట్



ఓలీ పోప్



హ్యారీ బ్రూక్

రావల్పిండి: 17 ఏళ్ల తర్వాత పాకిస్తాన్ గడ్డపై టెస్టు ఆడేందుకు వచ్చిన ఇంగ్లండ్ ఎవ్వరూ ఊహించనిరీతిలో విధ్వంసం సృష్టించింది. గురువారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజు ఆటలో ఇంగ్లండ్ బ్యాటర్ల ధాటికి పలు రికార్డులు బద్దలయ్యాయి. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా... వెలుతురు మందగించి తొలి రోజు ఆటను ముగించే సమయానికి ఇంగ్లండ్ 75 ఓవర్లలో 4 వికెట్లకు 506 పరుగులు సాధించింది. ఇంగ్లండ్ ఓపెనర్లు జాక్ క్రాలీ (111 బంతుల్లో 122; 21 ఫోర్లు), బెన్ డకెట్ (110 బంతుల్లో 107; 15 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఓలీ పోప్ (104 బంతుల్లో 108; 14 ఫోర్లు), మిడిలార్డర్‌లో హ్యారీ బ్రూక్ (81 బంతుల్లో 101 బ్యాటింగ్; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. హ్యారీ బ్రూక్‌తో కలిసి బెన్ స్టోక్స్ (15 బంతుల్లో 34; 6 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నాడు. జో రూట్ (31 బంతుల్లో 23; 3 ఫోర్లు) ఒక్కడే తక్కువ స్కోరుకు అవుటయ్యాడు. వెలుతురు మందగించడంతో తొలి రోజు నిర్ణీత 90 ఓవర్లకు బదులు 75 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. పూర్తి కోటా ఓవర్లు వేసిఉంటే ఇంగ్లండ్ స్కోరు 600 దాటేది. తొలి రోజు ఇంగ్లండ్ బ్యాటర్లు 73 ఫోర్లు, 3 సిక్స్‌లు కొట్టడం విశేషం. ఈ మ్యాచ్‌తో పాక్ జట్టు తరఫున హారిస్ రవూఫ్, మొహమ్మద్ అలీ, సౌద్ షకీల్, జాహిద్ మొహమ్మద్... ఇంగ్లండ్ జట్టు తరఫున లివింగ్‌స్టోన్, విల్ జాక్స్ టెస్టుల్లో అరంగేట్రం చేశారు.

506 రావల్పిండి టెస్టులో తొలి రోజు ఇంగ్లండ్ సాధించిన పరుగులు. 145 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో మ్యాచ్ తొలి రోజే ఏ జట్టూ 500 పరుగులు చేయలేదు. 1910లో సిడ్నీ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో తొలి రోజు ఆస్ట్రేలియా 6 వికెట్లకు 494 పరుగులు సాధించింది. 112 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న ఈ రికార్డును గురువారం ఇంగ్లండ్ జట్టు బద్దలు కొట్టింది.

4 టెస్టు మ్యాచ్ తొలి రోజే ఓ జట్టు తరఫున నలుగురు బ్యాటర్లు సెంచరీలు సాధించడం ఇదే ప్రథమం.

178 పాక్‌తో తొలి టెస్టు తొలి సెషన్‌లో (లంచ్ సమయానికి) ఇంగ్లండ్ 27 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా చేసిన పరుగులు. గతంలో ఏ జట్టూ తొలి సెషన్‌లో ఇన్ని పరుగులు చేయలేదు. 2018లో అఫ్గానిస్తాన్‌తో బెంగళూరులో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో తొలి సెషన్‌లో భారత్ 27 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 158 పరుగులు చేసింది. ఈ రికార్డును ఇంగ్లండ్ నవరించింది.

4 4 4 4 4 4

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో సౌద్ షకీల్ వేసిన 68వ ఓవర్లో హ్యారీ బ్రూక్ వరుసగా ఆరు ఫోర్లు కొట్టి ఈ ఘనత సాధించిన ఐదో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో సందీప్ పాటిల్ (భారత్; 1982లో బాబ్ విల్లిస్ (ఆస్ట్రేలియా) బౌలింగ్‌లో), గేల్ (విండీస్ ;20 04లో హోగార్డ్ (ఇంగ్లండ్) బౌలింగ్), శర్వాణ్ (వెస్టిండీస్; 2006లో మునాఫ్ పటేల్ (భారత్) బౌలింగ్‌లో), జయసూర్య (శ్రీలంక; 2007లో అండర్సన్ (ఇంగ్లండ్) బౌలింగ్‌లో) ఈ ఘనత సాధించారు.

ప్రపంచకప్‌లో నేడు

ఘనా x ఉరుగ్వే
రాత్రి గం. 8:30 నుంచి

పోర్చుగల్ x దక్షిణ కొరియా
రాత్రి గం. 8:30 నుంచి

బ్రెజిల్ x కామెరూన్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

సెర్బియా x స్విట్జర్లాండ్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

గ్రూప్ 'సి' పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
అర్జెంటీనా	3	2	0	1	5	2	6
పోలాండ్	3	1	1	1	2	2	4
మెక్సికో	3	1	1	1	2	3	4
సౌదీ అరేబియా	3	1	0	2	3	5	3

గ్రూప్ 'ఎఫ్' పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
మొరాకో	3	2	1	0	4	1	7
క్రొయేషియా	3	1	2	0	4	1	5
బెల్జియం	3	1	1	1	1	2	4
కెనడా	3	0	0	3	2	7	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, చే.గో-చేసిన గోల్స్, ఇ.గో-ఇచ్చిన గోల్స్, పా-పాయింట్లు

బెల్జియం అవుట్

- గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ప్రపంచ రెండో ర్యాంకర్
- క్రొయేషియాతో మ్యాచ్ 'డ్రా'
- గోల్ చేసే ఐదు అవకాశాలను వృథా చేసిన స్టార్ ఫార్వర్డ్ లుకాకు
- 1986 తర్వాత నాకౌట్ దశకు మొరాకో
- అర్జెంటీనా, పోలాండ్ కూడా ముందుకు



లుకాకు

దోహా: స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన ప్రపంచ రెండో ర్యాంకర్, గత ప్రపంచకప్‌లో మూడో స్థానం పొందిన బెల్జియం జట్టు తాజా మెగా ఈవెంట్‌లో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. నాకౌట్ దశ బెర్త్ దక్కాలంటే గత వరల్డ్ కప్ రన్నరప్ క్రొయేషియా జట్టుపై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌ను బెల్జియం 0-0తో 'డ్రా' చేసుకుంది. బెల్జియంను నిలువరించిన క్రొయేషియా ఐదు పాయింట్లతో గ్రూప్ 'ఎఫ్'లో రెండో స్థానంలో నిలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. క్రొయేషియాతో మ్యాచ్‌లో బెల్జియం జట్టు ఓటమి స్వయంకృతమే అని చెప్పాలి. స్టార్ ఫార్వర్డ్ రొమెలు లుకాకుకు ఏకంగా ఐదుసార్లు గోల్ చేసే సువర్ణావకాశాలు వచ్చినా అతను వృథా చేశాడు.

మొరాకో మెరిసె..

గ్రూప్ 'ఎఫ్'లో ఆఫ్రికా ఖండానికి చెందిన మొరాకో జట్టు చివరి లీగ్ మ్యాచ్‌లో 2-1తో కెనడా జట్టును ఓడించి 1986 తర్వాత ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఏడు పాయింట్లతో మొరాకో గ్రూప్ 'ఎఫ్' టాపర్‌గా నిలిచింది. మొరాకో తరఫున హకీమ్ జియెచ్ (4వ ని.లో), యుసెఫ్ ఎన్ నెస్రి (23వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... 40వ నిమిషంలో మొరాకో డిఫెండర్ నాయెఫ్ సెల్ఫ్ గోల్‌తో కెనడా ఖాతాలో గోల్ చేరింది.


మెక్సికోకు నిరాశ...


గ్రూప్ 'సి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అర్జెంటీనా 2-0తో పోలాండ్‌పై... మెక్సికో 2-1తో సౌదీ అరేబియాపై గెలిచాయి. రెండో విజయంతో మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనా ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. అర్జెంటీనా తరఫున అలెక్సిస్ (46వ ని.), అల్వరెజ్ (67వ ని.) గోల్ చేశారు. సౌదీ అరేబియాపై మెక్సికో జట్టు గెలిచినా ముందంజ వేయలేకపోయింది. మెక్సికో జట్టులో మార్టిన్ (47వ ని.లో), చావెజ్ (52వ ని.లో) గోల్ చేయగా, సౌదీ తరఫున సాలెమ్ (95+5వ ని. ఇంజ్యూరీ టైమ్) గోల్ చేసి ఓటమిలో ఓదార్పునిచ్చాడు. పోలాండ్, మెక్సికో నాలుగు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరంతో పోలాండ్ నాకౌట్‌కు అర్హత సంపాదించింది. 1994 తర్వాత మెక్సికో గ్రూప్ దశలోనే అవుటైంది.

భారత్ 'ఎ'కు భారీ ఆధిక్యం

కాక్స్ బజార్: బంగ్లాదేశ్ పర్యటనలో తొలి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. గురువారం మూడో రోజు 404/5 ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 465/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్స్‌లో ఉపేంద్ర (71 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం బంగ్లాదేశ్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టానికి 172 పరుగులు చేసింది. హసన్ (21) నిష్క్రమించగా, జకీర్ (81 బ్యాటింగ్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), నజ్ముల్ (56 బ్యాటింగ్; 7 ఫోర్లు) అబేధ్యమైన రెండో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. స్నర్ సౌరభ్ కుమార్ ఒక వికెట్ తీశాడు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... బంగ్లా ఇంకా 181 పరుగులు వెనుకంజలోనే ఉంది.

రన్నరప్ అర్జున్... హారికకు మూడో స్థానం






కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ అంతర్జాతీయ ర్యాపిడ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ రన్నరప్‌గా నిలువగా... మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. అర్జున్‌కు ఐదు వేల డాలర్లు (రూ. 4 లక్షలు), హారికకు నాలుగు వేల డాలర్లు (రూ. 3 లక్షల 24 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. గురువారం ముగిసిన ర్యాపిడ్ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అర్జున్ 6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఏడో రౌండ్‌లో మగ్సూద్‌లూ (ఇరాన్)తో 39 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న అర్జున్, ఎనిమిదో రౌండ్‌లో 56 ఎత్తుల్లో నకమురా (అమెరికా)పై, తొమ్మిదో రౌండ్‌లో 59 ఎత్తుల్లో నిహాల్ సరీన్ (భారత్)పై గెలిచాడు. 6.5 పాయింట్లతో నిహాల్ విజేతగా నిలువగా, భారత్‌కే చెందిన విదిత్ 4.5 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. మహిళల విభాగంలో హారిక 5.5 పాయింట్లతో మూడో స్థానాన్ని సాధించింది. ఏడో రౌండ్ గేమ్‌ను అన్నా ముజిచుక్ (ఉక్రెయిన్)తో 22 ఎత్తుల్లో, ఎనిమిదో రౌండ్ గేమ్‌ను మరియా (ఉక్రెయిన్)తో 25 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న హారిక తొమ్మిదో రౌండ్‌లో 30 ఎత్తుల్లో సవితాశ్రీ (భారత్)పై గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఐదు పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. అనా ఉషెనినా (ఉక్రెయిన్) 6.5 పాయింట్లతో విజేతగా నిలిచింది.

లబుషేన్ 204, స్మిత్ 200





పెర్త్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 152.4 ఓవర్లలో 4 వికెట్లకు 598 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. లబుషేన్ (204; 20 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (200 నాటౌట్; 17 ఫోర్లు) డబుల్ సెంచరీలు చేశారు. లబుషేన్ అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన ట్రావిస్ హెడ్ (99; 11 ఫోర్లు) పరుగు తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. హెడ్ అవుటైన వెంటనే ఆసీస్ డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది.

క్లుప్తంగా

పీఆర్ ఈఎన్‌సీగా బాలూనాయక్

సాక్షి, అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా ప్రభుత్వం బి.బాలూనాయక్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు 19

సాక్షి, అమరావతి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజును ఎలాంటి రుసుము లేకుండా డిసెంబర్ 19వ తేదీలోపు చెల్లించవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు, ఇంతకు ముందు ఫెయిలైనవారు, హాజరు మిన హాయింపు కోరిన ప్రైవేట్ విద్యార్థులు, గ్రూప్ మార్పు చేసుకున్నవారు 19వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

'ఎంబీబీఎస్ కోర్సు'లకు వెబ్ ఆప్షన్ల స్వీకరణ

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ కోర్సుల్లో బీ, సీ కేటగిరీ సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ లో వెబ్ ఆప్షన్ల స్వీకరణకు డా. వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు https://ugmq. ntruhs admissions.comలో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. గురువారం రాత్రి 8 గంటల నుంచి ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం ఉదయం 9 గంటలు ఆప్షన్ల నమోదుకు ఆఖరి గడువు. ఆప్షన్ల నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829, 9492818477 నంబర్లను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర గ్రాంట్ల వినియోగ పత్రాలు పంపండి

సాక్షి, అమరావతి: కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు, వాటి వినియోగ పత్రాలను ఈ నెలాఖరులోగా పంపించాలని అన్ని శాఖలతో పాటు యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీలు, బోర్డులు, ఇన్‌స్టిట్యూషన్లను ఆర్థిక శాఖ ఆదేశించింది. 2016–17 నుంచి 2021–22 వరకు కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు ఎంత? ఆర్థిక సంవత్సరాల వారీగా వినియోగ పత్రాల సమాచారం ఇవ్వాలని ఆర్థిక శాఖను అకౌంటెంట్ జనరల్ కోరారు. ఈ నేపథ్యంలో ఆ వివరాలను ఈ నెలాఖరులోగా పంపించాలని ఆర్థిక శాఖ అన్ని శాఖలను ఆదేశించింది. అప్పటి వరకు తదుపరి గ్రాంట్లను విడుదల చేయొద్దని ట్రెజరీ అధికారులకు స్పష్టం చేసింది. గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి వినియోగ పత్రాలు పంపించడంలో విఫలమైన వారికి నెల వేతనాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించింది.

కొత్తగా 12 ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాల ఏర్పాటు

శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 12 ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎండీ ఎస్.ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 13 ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలు ఉండగా, వీటికి అనుబంధంగా కొత్త జిల్లాలకు కూడా సెంటర్లను కేటాయించాలని కోరిన నేపథ్యంలో భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆమోదం తెలిపిందని వివరించారు.

కొత్త కేంద్రాలు ఇవే..

పార్వతీపురం (వెయిట్‌లిఫ్టింగ్), పాడేరు (రెజ్లింగ్), అనకాపల్లి (బాక్సింగ్), రాజమహేంద్రవరం (ఫుట్‌బాల్), భీమవరం (రైఫిల్ షూటింగ్), మచిలీపట్నం (స్విమ్మింగ్), గుంటూరు (జూడో), బాపట్ల (ఫెన్సింగ్), నంద్యాల (హాకీ), పుట్టపర్తి (జూడో), రాయచోటి (ఫెన్సింగ్), చిత్తూరు (ఫెన్సింగ్).

కేంద్ర జలసంఘం చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్

సాక్షి, అమరావతి: కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్‌ను కేంద్ర జల్‌శక్తి శాఖ నియమించింది. ప్రస్తుతం కేంద్ర జలసంఘం సభ్యులుగా పనిచేస్తున్న ఆయన పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 31 వరకు చంద్రశేఖర్ అయ్యర్ సీడబ్ల్యూసీ చైర్మన్‌గా కొనసాగుతారు. 60 ఏళ్లు నిండనున్న నేపథ్యంలో ఈ నెల 31నే పదవీ విరమణ చేయనున్నారు. చంద్రశేఖర్ అయ్యర్ తర్వాత సీడబ్ల్యూసీలో అత్యంత సీనియర్ అయిన కుశ్వీందర్ వోరా జనవరి 1న సీడబ్ల్యూసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాయచోటి, వాల్మీకిపురం ఎస్టీవోల సస్పెన్షన్

బి.కొత్తకోట: బోగస్ ఏఐఎస్, ట్యాన్ నంబర్లతో ఆదాయపన్నుశాఖ నుంచి రీఫండ్‌గా అధిక మొత్తాలను పొందిన వ్యవహారంలో అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు ఉప ఖజానా అధికారులను సస్పెండ్ చేస్తూ ఖజానా శాఖ డైరెక్టర్ కె.మోహనరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. .

సై'కత'లతో చైతన్యం

ఇసుక రేణువులను మునివేళ్లతో తాకుతూ.. అద్భుత శిల్పాలు చెక్కుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు ఏలూరు జిల్లా కైకలూరు మండలం పల్లెవాడకు చెందిన ఆకునూరు బాలాజీ వరప్రసాద్. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఒడిశాలోని కోణార్క్ చంద్రభాగా బీచ్‌లో జరుగుతున్న 'అంతర్జాతీయ సైకత శిల్పకళోత్సవం -2022' పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొంటున్నాడు. చిత్రకళా పోటీల్లో చిన్ననాటి నుంచే అనేక బహుమతులు అందుకున్న బాలాజీ ఆ కళపై ఆసక్తి పెంచుకున్నాడు. డిగ్రీ చదివే రోజుల్లో సముద్ర తీరంలో స్నేహితులతో కలిసి ఇసుకతో 'మత్స్య సుందరి' పేరిట సైకత శిల్పాన్ని రూపొందించడం, అది పత్రికల్లో ప్రచురణ కావడంతో శాండ్ ఆర్ట్‌పైకి దృష్టి మరల్చాడు. ఎంతో సాధన చేసి సైకత శిల్పిగా, పోర్ట్రైట్ ఆర్టిస్ట్‌గా, స్పీడ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నాడు.

-సాక్షి, అమరావతి

శాండ్ ఆర్టిస్ట్‌గా అంతర్జాతీయ ఖ్యాతి

- అంతర్జాతీయ, జాతీయ అవార్డులతో రికార్డు
- అంతర్జాతీయ సైకత శిల్ప కళోత్సవం-2022లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం



బాలాజీ రూపొందించిన సందేశాత్మక సైకత శిల్పాలు

సైకత కథలకు విశేష స్పందన

భారతీయ ఇసుక శిల్పిగా, యానిమేషన్, కథకుడిగా బాలాజీ రూపొందించిన అనేక సైకత శిల్పాలు, సైకతరూపక కథలకు విశేష స్పందన లభిస్తోంది. వాటిని వీడియోలుగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల ప్రజలు వీక్షిస్తున్నారు. ఇప్పటివరకు రెండు అంతర్జాతీయ అవార్డులు, 8 జాతీయ అవార్డులు, రెండు పురస్కారాలు (ఉగాది, విశిష్ట వ్యక్తి పురస్కారం), రెండు ప్రపంచ రికార్డులు (అద్భుత ప్రపంచం, మేధావి ప్రపంచ రికార్డులు) సాధించాడు. ప్రపంచ వ్యాప్తంగా అనేక అంశాలపై 250కి పైగా ఇసుక శిల్పాలను చెక్కి ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

ఇసుక రేణువులతో చైతన్యం



చిన్నప్పటి నుంచి డ్రాయింగ్, పెయింటింగ్, కాన్వాసింగ్‌పై మక్కువతో అనేక ప్రయోగాలు చేశాను. సైకత శిల్పాల సృష్టిలోనూ పట్టు సాధించాను. ఎటువంటి సంగీతం, ఇతర పరికరాలు అవసరం లేకుండానే ఇసుక శిల్పాలతో ప్రజలకు అతి తేలిగ్గా అర్థమయ్యే రీతిలో అంశాలను ప్రదర్శిస్తున్నాను. 2018లో జరిగిన అంతర్జాతీయ సైకత కళా పోటీల్లో 28 దేశాల నుంచి 104 మంది సైకత శిల్పులు పాల్గొనగా.. అంతర్జాతీయ ప్రథమ బహుమతి సాధించడం నా జీవితంలో మరిచిపోలేను. ఇప్పుడు ఒడిశా రాష్ట్రంలో జరుగుతున్న అంతర్జాతీయ పోటీల్లో కచ్చితంగా బహుమతి సాధించాలనే పట్టుదలతో సైకత శిల్పాన్ని రూపొందిస్తున్నాను.

– ఆకునూరి బాలాజీ వరప్రసాద్, సైకత శిల్పి

'8న బీఈడీ (ఎస్.ఇ.) స్పాట్ అడ్మిషన్లు'

సాక్షి, అమరావతి: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహించే బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్–ఎస్.ఇ.) కోర్సులో అడ్మిషన్లకు ప్రవేశపరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఆ యూనివర్సిటీ అభ్యాసక సహాయ సేవాకేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగురాష్ట్రాల్లో 11 ప్రోగ్రాం సెంటర్లలో మూడు (ఎం.ఆర్., హెచ్.ఐ., వి.ఐ.) స్పెషలైజేషన్లలో మొత్తం 500 సీట్లున్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ప్రవేశపరీక్ష ర్యాంకుకార్డు, హాల్ టికెట్‌లతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని డిసెంబరు 8వ తేదీ మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల మధ్య హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న యూనివర్సిటీ అకడమిక్ బ్లాక్ వద్ద కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన వారు మాత్రమే అడ్మిషన్‌కు అర్హులని తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు మరో ప్రోగ్రాం సెంటర్‌కు మారదలచుకుంటే నిబంధనల మేరకు అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 8వ తేదీన కౌన్సెలింగ్ కేంద్రానికి రావాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని ఆయన సూచించారు.

చలిరోయ్.. చలి

- రాష్ట్రంలో అధిక శీతల ప్రభావం
- ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం
- ఐఎండీ అంచనా
- పగలూ చల్లటి అనుభూతి

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది శీతాకాలం ఎక్కువ ప్రభావం చూపనుంది. చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండనుంది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దేశంలో శీతాకాలం ప్రభావంపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం అంచనాలను విడుదల చేసింది. ఈ శీతాకాలంలో ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువగా రికార్డవుతాయని అంచనా వేసింది. ఫలితంగా రాష్ట్రంలో ఈ మూడు నెలలు చలి ఒకింత ఎక్కువ ఉంటుందని పేర్కొంది. రానున్న రెండు నెలల్లో (డిసెంబర్, జనవరిల్లో) అప్పుడప్పుడు అతి శీతల గాలులకు ఆస్కారం ఉంది. గరిష్ఠ (పగటి) ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువగా నమోదవుతాయని, అందువల్ల పగటి వేళ కూడా శీతల అనుభూతి ఉంటుందని ఐఎండీ అంచనా వేస్తోంది. సాధారణంగా నైరుతి రుతు పవనాల సీజనులో వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు ఆ తర్వాత వచ్చే శీతాకాలంలో చలి ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉండటానికి కూడా ఇదే కారణమని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. ఈ సీజనులో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలతో పోల్చుకుంటే ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మరోవైపు అక్టోబర్ నెలతో మొదలైన ఈశాన్య రుతు పవనాల సీజను డిసెంబర్‌తో ముగియనుంది. ఈ నెలలో రాష్ట్రంలో సాధారణ వర్షాలకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.



5న అల్పపీడనం!

దక్షిణ అండమాన్ సముద్రంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఈ నెల ఐదో తేదీన అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా కదిలి 48 గంటల్లో వాయుగుండంగా బలపడనుంది. 8వ తేదీకి తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు చేరుతుందని ఐఎండీ వెల్లడించింది. దీని ప్రభావం తమిళనాడు, పుదుచ్చేరిలపై అధికంగా, దక్షిణ కోస్తాంధ్రపై మోస్తరుగా ఉండే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో ఈనెల 6 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంపైకి తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా రానున్న రెండు రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తర కోస్తాంధ్రలో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

వామ్మో.. వీడు మామూలోడు కాదు!

- సంచలనంగా మారిన నకిలీ సీబీఐ అధికారి వ్యవహారం
- ఐదు రాష్ట్రాల్లో నెట్‌వర్క్
- ప్రజాప్రతినిధుల గుండెల్లో రైళ్లు
- కొవ్విరెడ్డి శ్రీనివాస్ డీల్స్‌పై దర్యాప్తు చేస్తున్న సీబీఐ

దొండపర్తి (విశాఖ దక్షిణ)/హైదరాబాద్ (సిటీ బ్యూరో): విశాఖకు చెందిన నకిలీ సీబీఐ అధికారి కొవ్విరెడ్డి శ్రీనివాస్ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. అధికార, రాజకీయ వర్గాల్లో అలజడి సృష్టిస్తోంది. దేశంలో వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులపై ఉన్న ఐటీ, ఈడీ కేసుల మాఫీకి డీల్స్ చేసుకున్న వ్యవహారం సంచలనంగా మారింది. కొవ్విరెడ్డి శ్రీనివాస్ తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటకల్లో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. ప్రధానంగా వ్యాపార వేత్తలతో పాటు రాజకీయ ప్రముఖులను టార్గెట్‌గా చేసుకున్నాడు. నగరాలు, పట్టణాల్లో జరిగే కుల సమ్మేళనాలకు ఆహ్వానం లేకున్నా హాజరవుతూ.. అక్కడకు వచ్చిన ప్రముఖులతో తానూ అదే కులానికి చెందిన వాడినని, ప్రస్తుతం సీబీఐలో పని చేస్తున్నానని పరిచయం చేసుకునేవాడు. అవతలి వ్యక్తులు ప్రముఖులైతే వారితో కలిసి ఫొటోలు దిగేవాడు. సీబీఐ, ఈడీ కేసులు ఎదుర్కొంటున్న వారి వివరాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని వివిధ ఏజెన్సీలకు చెందిన వెబ్‌సైట్లు, అధికారిక సోషల్ మీడియా ఖాతాలతో పాటు మీడియా ద్వారా తెలుసుకునేవాడు. వారిని సంప్రదిస్తూ ఆ కేసుల నుంచి తప్పిస్తానని చెప్పేవాడు. మరికొందరికి కేంద్రంలో అవసరమైన పనులు చేసి పెట్టడం, ఉద్యోగాల పేరుతోనూ ఎర వేశాడు.

హైదరాబాద్ వ్యాపారులతో సంప్రదింపులు

శ్రీనివాసరావు వ్యవహారాలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న న్యూఢిల్లీలోని సీబీఐ ఏసీబీ విభాగం గత నెల 26న కేసు నమోదు చేసి, అతడిని అరెస్ట్ చేసింది. ఈ కేసులో మరికొందరు నిందితులుగా ఉన్నారంటూ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సీనియర్ ఐపీఎస్ అధికారిగా, సీబీఐలో సంయుక్త డైరెక్టర్‌గా శ్రీనివాసరావు చెలామణి అయినట్టు ఆరోపించింది. శ్రీనివాస్‌తో సంప్రదింపులు జరిపిన వారిలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు, రాజకీయ నేతలు ఉన్నారు. సీబీఐ సహా వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులను సెటిల్ చేస్తానని, కాంట్రాక్టులు, అవసరమైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారులకు ఇవ్వాల్సి ఉందంటూ వీరి నుంచి ముందుగానే బంగారు ఆభరణాలు, నగదుతో పాటు ఖరీదైన గిఫ్ట్‌లు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 24న ఢిల్లీ వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన పెనుపోతుల శ్రీనివాసరావు అక్కడి తమిళనాడు భవన్‌లో సీబీఐ అధికారిగా చెప్పుకున్న శ్రీనివాసరావును కలిశాడని సీబీఐ గుర్తించింది. కాగా వీరిలో నలుగురిని సీబీఐ విచారించనుంది.

గిఫ్ట్‌లుగా రూ.25 లక్షల ఆభరణాలు

తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రానైట్ వ్యాపారులు నకిలీ అధికారి శ్రీనివాస్‌కు భారీ బహుమతులు ఇచ్చారు. వీరిలో అత్యధికులు ఆర్డర్లు, పర్మిషన్లు, లీజుల కోసం పైరవీలు చేయడానికి వీటిని అందించినట్లు సీబీఐ అధికారులు చెప్తున్నారు. ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్న కొందరు వాటి నుంచి బయటపడేందుకు ఇటీవల రూ.25 లక్షల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలు కానుకలుగా సమర్పించినట్టు సీబీఐ విచారణలో శ్రీనివాస్ అంగీకరించాడు. వీరిపై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా సస్పెండై..

అనకాపల్లి జిల్లా యలమంచిలికి చెందిన కొవ్విరెడ్డి శ్రీనివాసరావు ఉపాధి కోసం విశాఖకు వచ్చాడు. రెల్లి వీధిలో నివాసముంటూ అదే ప్రాంతానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పనిచేస్తూ వివిధ ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు. ఆ తరువాత సీబీఐ అధికారినంటూ పలువురితో పరిచయాలు పెంచుకున్నాడు. కొందరు అధికారులను సైతం బెదిరిస్తూ డబ్బులు వసూలు చేయడంతో పాటు అవసరమైన పనులు చక్కబెట్టుకొనేవాడు. ఇలా రూ.కోట్లు గడించి భోగాపురం ప్రాంతంలో భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం.

తెలంగాణ మంత్రి, ఎంపీ బాధితులా.. నిందితులా!

నకిలీ సీబీఐ అధికారి శ్రీనివాసరావు వ్యవహారంలో సీబీఐ అధికారులు తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర (గాయత్రి రవి)లకు నోటీసులు ఇచ్చారు. వీరిద్దరినీ సాక్షులుగా పరిగణిస్తూ గురువారం ఢిల్లీలో వాంగ్మూలాలు నమోదు చేశారు. దీనికి కొనసాగింపుగా హైదరాబాద్‌కు చెందిన మరో నలుగురు వ్యాపారులకు నోటీసులు జారీ చేసిన సీబీఐ శుక్రవారం విచారణకు హాజరుకావాలంటూ ఆదేశించింది. ఈ వ్యవహారంలో వీళ్లంతా బాధితులా? నిందితులా? అన్నది తేల్చడానికి సీబీఐ వివిధ కోణాల్లో ప్రశ్నించనుంది.

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఎన్నిక ఫలితాలను వెల్లడించవద్దు

- ఏసీఏ అధికారులకు హైకోర్టు ఆదేశం
- శరత్‌చంద్రారెడ్డిని ప్రతివాదిగా చేర్చేందుకు అంగీకారం
- ఆయనకు నోటీసులు జారీ
- విచారణ ఈ నెల 14కి వాయిదా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్‌కు ఈ నెల 3న నిర్వహించనున్న ఎన్నికల ఫలితాలను వెల్లడించవద్దని హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణ వరకు ప్రస్తుత కార్యవర్గం బీసీసీఐ నుంచి నిధులను తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అలా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకోచ్చునంది. అసోసియేషన్ కార్యకలాపాలను చూసుకోవాలని సంఘం సీఈవోను ఆదేశించింది. సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన పి.శరత్‌చంద్రారెడ్డిని ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చేందుకు అంగీకరించి ఆయనకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈడీ కేసు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శరత్‌చంద్రారెడ్డి ఏసీఏలో పదవులు నిర్వహించేందుకు అనర్హుడని, ఆ మేరకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపిస్తూ.. శరత్‌చంద్రారెడ్డిపై ఈడీ కేసు నమోదు చేయడమేగాక ఆయన పాత్రపై చార్జిషీట్ కూడా దాఖలు చేసిందని చెప్పారు. అందువల్ల ఆయన ఆఫీస్ బేరర్‌గా, కమిటీ సభ్యుడిగా, బీసీసీఐ ప్రతినిధిగా వ్యవహరించేందుకు అనర్హుడని తెలిపారు. ఈ వ్యాజ్యంలో ఆయన్ని ప్రతివాదిగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ఈ నెల 3న ఎన్నిక నిర్వహించనున్నారని తెలిపారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే ఈ వ్యాజ్యంలో శరత్‌చంద్రారెడ్డిని ప్రతివాదిగా చేర్చడం అవసరమన్నారు. ఆయన్ని ప్రతివాదిగా చేర్చేందుకు అంగీకరించి, నోటీసులు జారీచేశారు. ఈ నెల 3న నిర్వహించనున్న అపెక్స్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలను వెల్లడించవద్దని ఏసీఏ అధికారులను ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.


బీటెక్ అగ్రి సీట్ల భర్తీకి మ్యాప్ ఆఫ్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో మిగిలి ఉన్న సీట్లను మ్యాప్ ఆఫ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం తెలిపారు. ఎంసెట్- 2022 ద్వారా ర్యాంక్‌లు పొందిన విద్యార్థులు 8వ తేదీన గుంటూరులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడాలన్నారు.

'శ్రీప్రకాష్' ఆక్రమిత భూముల పరిశీలన

సర్వే చేసి నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ వెల్లడి

నక్కపల్లి/పాయకరావుపేట: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్‌పురంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థ ఆధీనంలో ఉన్న భూములను గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. సర్వే నంబర్ 122లో జోడిగెడ్డ పేరుతో ఎస్ఎఫ్ఏలో నమోదైన చెరువులో సుమారు 17 ఎకరాల ప్రభుత్వ భూమిని శ్రీప్రకాష్ విద్యాసంస్థ ఆక్రమించుకుని పట్టాదారు పాసుపుస్తకాలు పొందిందని వీఆర్వో భాస్కర నాయుడు బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ వ్యవహారం పత్రికల్లో రావడంతో తహసీల్దార్ జయప్రకాష్ స్పందించారు. గురువారం తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్లతో కలిసి భూములను పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ జయప్రకాష్ మాట్లాడుతూ కళాశాల యజమాని నర్సింహారావు ఈ భూములకు సంబంధించిన కొన్ని పత్రాలను తమకు అందజేశారని, మరికొన్ని పత్రాలు త్వరలో ఇస్తామని చెప్పారని.. అన్ని పత్రాలూ అందాక పరిశీలించి ఈ భూములు ప్రభుత్వానివా కాదా అనే విషయాన్ని సర్వే చేసి నిర్ధారిస్తామని తెలిపారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇలాంటి విషయాలను పత్రికా సమావేశం పెట్టి వెల్లడించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ వీఆర్వోకు షోకాజ్ నోటీసులిస్తామన్నారు.


శ్రీప్రకాష్ కళాశాల ఆధీనంలో ఉన్న భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.